Pubilshed from Tirupathi

PRGI NO : APTEL/25/A2316

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




తిరుపతి TIRUPATHI | సంపుటి : 01 Vol.No : 01 | సంచిక : 303 Issue No : 303 | మంగళవారం Tuesday | జూలై 21, 2026 21 JULY 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana




## తిరుమలకు భారీగా భక్తుల రాక...

- 31 కంపార్ట్‌మెంట్లు ఫుల్
- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లు పూర్తి
- శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం
- ఆదివారం రూ. 4.05 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం
- నిన్న శ్రీవారిని దర్శించుకున్న 90,956 మంది భక్తులు

తిరుపతి, ప్రజాభూమి ప్రతినిధి : తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న రద్దీ సోమవారం కూడా తీవ్రస్థాయిలో ఉంది. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని మొత్తం 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో పూర్తిగా నిండిపోయాయి.

- మిగతా 2లో..

# ఆక్వా కల్చర్ రంగాన్ని ఆదుకోండి



- సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతివ్వండి
- అమరావతిలో ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం అవసరం
- డీజీఎఫ్‌టీ ద్వారా ఫిష్ మీల్ ఎగుమతి నియంత్రణ
- ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతిని ప్రోత్సహించండి
- ఏరియేటర్లు, ప్రాసెస్ చేయని పొగాకుపై జీఎస్టీ తగ్గించండి
- ముగ్గురు కేంద్ర మంత్రులకు వేర్వేరుగా సీఎం చంద్రబాబు లేఖలు

**ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : జన్యుపరంగా మార్పు చేసిన సోయాబీన్ మీల్ ను దిగుమతి చేసుకునేందుకు రొయ్యల మేత తయారీ దారులకు అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ కు లేఖ రాశారు. రొయ్యల మేత తయారీలో ప్రధాన ముడిసరుకైన సోయాబీన్ మీల్ ధరలు విపరీతంగా పెరగడంతో, మేత తయారీ ఖర్చులు పెరిగాయని వివరించారు. దీనివల్ల రొయ్యల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని సీఎం స్పష్టం చేశారు. దేశంలో రొయ్యల మేత కొరతను తీర్చేందుకు, ధరల నియంత్రణకు సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇవ్వాలని కోరారు. 2021లోనూ రొయ్యల మేత తయారీదారులకు పరిమిత స్థాయిలో దిగుమతి చేసుకునేందుకు అనుమతులిచ్చారని లేఖలో పేర్కొన్నారు.**

ఈక్వెడార్ నుంచి పెరిగిన రొయ్యల ఉత్పత్తి, ఎగుమతుల వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో దేశీయ ఉత్పత్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అమెరికా, చైనా , యూరోప్ లాంటి ప్రధాన మార్కెట్లలో భారతీయ రొయ్యల ఎగుమతులు తీవ్ర పోటీని ఎదుర్కుంటున్నాయని సీఎం తన లేఖలో వివరించారు. జన్యుమార్పిడి చేసిన సోయాబీన్‌ను వ్యవసాయానికి, విత్తన ఉత్పత్తికి వినియోగించే అవకాశం లేదని తద్వారా జీవ వైవిధ్యానికి దేశీయ వంగడాలకు ముప్పు లేదని సీఎం వివరించారు. ప్రభుత్వం సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇస్తే రొయ్యల మేత పరిశ్రమకు నాణ్యమైన ముడిసరుకు అందుబాటులోకి వస్తుందని సీఎం స్పష్టం చేశారు. లక్షలాది మంది రొయ్యల రైతులు, కార్మికులకు ఉపాధి కలుగుతుందని, తద్వారా విదేశీ మారకద్రవ్యం లభిస్తుందన్నారు.

2 లో..

## సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

**దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది**

- విక్రమ్ విజయవంతం..యువకుల నైపుణ్యం
- పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ



ప్రజాభూమి ప్రతినిధి, న్యూఢిల్లీ : పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మోడీ మీడియాతో మాట్లాడారు. గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు. స్టార్టప్ కంపెనీ తయారు చేసిన విక్రమ్-1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిందని వివరించారు.

2 – పేజీలో..



## ఢిల్లీలో విద్యార్థులపై లాఠీ-ఛార్జ్..

- కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్
- ఢిల్లీలో నీట్ విద్యార్థుల ఆందోళనపై పోలీసుల లాఠీఛార్జ్
- కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి
- ప్రశ్నిస్తున్న యువతపై దాడులు బీజేపీ భయానికి నిదర్శనమన్న సీఎం
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- విద్యార్థులకు అండగా ఉంటానని స్పష్టం చేసిన రేవంత్

2 లో



## అంతర్జాతీయ ఉద్రిక్తతల ఎఫెక్ట్..

- భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో ఇన్వెస్టర్ల అప్రమత్తత
- 443 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 96 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి
- లాభాల్లో ముగిసిన మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు

2 లో

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ అంటూ దుష్ప్రచారం

**డాక్యుమెంట్ రైటర్లకు ఉపాధి మార్గాలు చూపిస్తాం**

- దీపం-2.0 లబ్దిదారులకు నిర్ధారిత తేదీల్లో నగదు జమ
- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు




ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నా రంటూ కొందరు పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని... దీనిపై వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు.

సేవల సులభతరానికే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారనే అంశం సమీక్షలో ప్రస్తావనకు వచ్చింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. రిజిస్ట్రేషన్ సేవలను మరింత సులభతరం చేసేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రం-శాఖలను ఏర్పాటు చేస్తున్నాం. ఇది ప్రైవేటీకరణ ఎంత మాత్రమూ కాదు. పాస్ పోర్టు సేవా కేంద్రాల తరహాలోనే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు పని చేస్తాయి. పాస్ పోర్టు సేవా కేంద్రాల పనితీరు ఏ విధంగా జరుగుతుందో... ఆ తర్వాత ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందో వివరించండి. పాస్ పోర్టు సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాక పాస్ పోర్టు ప్రాసెసింగ్ అనేది చాలా సులువైంది. ఇదే తరహాలో రిజిస్ట్రేషన్

- మిగతా 2లో..




## దేశంలోనే తొలి డెంగ్యూ వ్యాక్సిన్‌కి డిసిజిఐ ఆమోదం

న్యూఢిల్లీ : దేశంలోనే తొలి డెంగ్యూ వ్యాక్సిన్‌కి ఆమోదం లభించింది. టకేడా బయోఫార్మా స్యూటికల్స్ ఇండియా అభివృద్ధి చేసిన QDENGA (TAK-003) వ్యాక్సిన్‌ను డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డిసిజిఐ) అనుమతించింది. 4 నుంచి 60 ఏళ్ల వయస్సు గల వారికి డెంగ్యూ నివారణ కోసం ఈ టీకాను రెండు డోసులుగా, మూడు నెలల వ్యవధిలో ఇవ్వనున్నారు. గతంలో డెంగ్యూ సోకినా,

- మిగతా 2లో..

**దశాబ్దాల మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ్**

## శాశ్వత పరిష్కారం

**మంగళగిరిలో దశాబ్దాల ఇంటి స్థలాల సమస్యకు మంత్రి లోకేశ్ పరిష్కారం**

- 'మన ఇల్లు - మన లోకేశ్' కింద రెండో విడతలో 3 వేల మందికి పట్టాల పంపిణీ
- ఈ నెల 21, 22 తేదీల్లో లబ్ధిదారులకు పట్టాలు అందించనున్న మంత్రి
- నిషేధిత జాబితాలోని భూములకు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు జారీ
- సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములకు పేదలకు శాశ్వత హక్కులు

ప్రజాభూమి ప్రతినిధి, మంగళగిరి : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, మంగళగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా నెలకొన్న జఠిలమైన భూ సమస్యకు రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం చూపారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు యాజమాన్య హక్కులు కల్పించే ప్రక్రియను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా, 'మన ఇల్లు - మన లోకేశ్' కార్యక్రమం కింద రెండో విడతలో సుమారు 3,000 కుటుంబాలకు ఈ నెల 21, 22 తేదీల్లో శాశ్వత పట్టాలు పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

2 – పేజీలో..



## కష్టపడితే పేదరికాన్ని జయించవచ్చు

- తన జీవితమే అందుకు ఉదాహరణ
- మంత్రి నారాయణ వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి, నెల్లూరు : చదువుతో పేదరికాన్ని జయించవచ్చని ఏపీ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. తాను ట్యూషన్స్ ప్రారంభించి కష్టపడి ఈ స్థాయికి వచ్చానని పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు జిల్లాలో షైనింగ్ స్టార్ అవార్డ్స్ - 2026లో మంత్రి నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అవార్డులు, మెడల్స్, నగదు, బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు.

2 పేజీలో..



## విపక్షాల నిరసనలతో హోరెత్తిన పార్లమెంటు...

- నీట్ లీక్‌పై విపక్షాల నిరసనలతో ప్రారంభమైన పార్లమెంట్ సమావేశాలు
- తీవ్ర గందరగోళం నడుమ ఉభయ సభలు రోజంతటికి వాయిదా
- నీట్ అంశాన్ని ప్రస్తావించకుండా మాట్లాడిన ప్రధాని మోదీ
- విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతూ పార్లమెంట్ వద్ద ఆందోళనలు
- ఆగస్టు 13 వరకు 19 రోజుల పాటు కొనసాగనున్న సమావేశాలు

2 పేజీలో..

న్యూఢిల్లీ : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం వాడివేడిగా ప్రారంభమయ్యాయి. నీట్-యూజీ పేపర్ లీక్ కుంభకోణంపై తక్షణమే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో, తొలిరోజే ఉభయ సభలు రోజంతటికీ వాయిదా పడ్డాయి.



# సంపాదకీయం

## ప్రజాగొంతుకపై అంకుశం !

దేశంలో ఆందోళనలను పట్టించుకునేందుకు పాలకులకు తీరిక లేకుండా పోయింది. కేంద్రంలోని ప్రభుత్వమైనా, రాష్ట్రాల్లోని వివిధ పార్టీల నేతృత్వంలో ఉన్న ప్రభుత్వాలకైనా ఇది కనపడడం లేదు. అన్నా హజారే లాంటి వారు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే స్థితిలతో పాలకులు లేరు. రాజకీయ అవినీతిపై ఆయన యుద్ధం చేస్తున్నా, ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. తాజాగా సామాజిక కార్యకర్త, విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఇరవైరోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ఆమరణ దీక్షలో ఉన్నారు. ఆయన ఎందుకు దీక్ష చేస్తున్నారు..ఎందుకు నిరసనలకు దిగారన్న కనీస ఆలోచన కూడా చేసే పరిస్థితిలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం లేదు. ఎన్‌డిఎకు మద్దతు ఇస్తున్న పార్టీలు కూడా కిమ్మనడం లేదు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యంలో పనికిరాదు. మొత్తంగా పోటీ పరీక్షల విశ్వసనీయత దెబ్బతినివున్న పరిస్థితుల్లో ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్న సంస్కరణలపై మాట్లాడటా నికీ, తగిన చర్యలు చేపట్టడానికీ ప్రభుత్వానికి అభ్యంతరం ఉండనక్కరలేదు. ప్రజల పక్షాన నిరశనలు, ఉద్యమాలు చేయడం వాంగ్‌చుక్‌కు కొత్తకాదు. రేపోమాపో ఆయన దీక్ష విరమించినా ఎవరూ దానిని వైఫల్యంగా భావించరు. కానీ, నెలన్నరనుంచి సాగుతున్న ఈ ఉద్యమాన్ని బేఖాతరు చేయడం ప్రభుత్వానికి అప్రదిష్ఠతెస్తుంది, మానవత్వం, జవాబుదారీతనం కొరవడ్డాయన్న అభిప్రాయానికి తావిస్తుంది. శాంతియు తంగా సాగుతున్న నిరసనను అలాగే ముగిసేట్టు చూడాల్సిన బాధ్యత ఇరుపక్షాలపైనా ఉంది. కొందరు నిస్వార్థ పరులు దేశం కోసం ఏదో చేయాలన్న తపనలో ఉంటారు. వారు తమ ఆకాంక్షను నిరసలన ద్వారా తెలియచేస్తారు. వాటిని గుర్తించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అలా జరగడం లేదు. తాజాగా సోనమ్ వాంగ్ చుక్ దీక్ష ఈ కోవలోకే వస్తుంది. నీట్ తప్పిదాలకు బాధ్యత వహిస్తూ కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో వాంగ్‌చురక్ దీక్షకు దిగారు. నిజానికి సోనమ్ ను పిలిచి మాట్లాడవచ్చు. లూపదా ఆయన దీక్షను విరమించేలా, ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించ వచ్చు. కానీ ప్రభుత్వం అలా చేయకుండా యాన దీక్ష భగ్నానికి యత్నించింది. అంటే దీక్షలను కూడా తట్టుకునే స్థితిలో పాలకులు లేరని గుర్తించాలి. 1984లో లద్దాఖ్ వాసులకు ఎస్టీ హోదా ఇవ్వాలంటూ వాంగ్‌చుక్ తండ్రి వాంగ్యాల్ ఇలాగే దీక్షకు దిగితే నాటి ప్రధాని ఇందిరాగాంధీ స్వయంగా లెహ్ వెళ్ళి, డిమాండ్లు నెరవేరుస్తానని హామీ ఇచ్చి దీక్ష విరమింపచేసిన విషయం మరచిపోరాదు. 2011లో సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే దీక్ష సందర్భంలోనూ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ మానవతా దృక్పథంతో వ్యవహరించారు. అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ చర్చించడం ద్వారా పెద్దమనసు చాటుకున్నారు.

వాంగ్‌చుక్ ఈ దీక్షకు దిగడానికి బీజేపీమీద ఆయనకు ఉన్న పాతకక్షలే కారణమంటూ కొన్ని హిందీ చానెళ్ళలోనూ, సోషల్ మీడియాలోనూ బురదజల్లే పని జోరుగా సాగడం దారుణం కాక మరోటి కాదు. ఆయన ఆరోగ్యం తీవ్రంగా క్షీణించిందని, పదికేజీలకు పైగా బరువు తగ్గారని, దీక్షసాగితే కీలక అవయవాల పై దుష్ప్రభావాలు తప్పవని వైద్యబృందం హెచ్చరించడంతో పోలీసులు ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. నిజానికి ఈ పనిచేసే ముందు వాంగ్‌చుక్‌తో మాట్లాడివుంటే పాలక పార్టీ పెద్దల గౌరవం తగ్గేది ఏమీ లేదు.. ఆయన ప్రాణానికి ప్రమాదం ఉన్నది కనుక, దీక్ష విరమింపచేయా లంటూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేస్తూ, ప్రతీ పౌరుడి ప్రాణమూ విలువైనదేనని, వాంగ్‌చుక్‌కు ప్రభుత్వ వైద్యులతో నిరంతర పరీక్షలు నిర్వహిస్తూ, వైద్యపరమైన చర్యలన్నీ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. ఆయనతోపాటుగా ఆమరణదీక్షలో ఉన్న ముగ్గురు విద్యార్థినేతల ఆరోగ్యం బాగా దిగజారిందని, తక్షణమే దీక్షవిరమించాల్సిందిగా ఒకరిని వైద్యులు హెచ్చరించినట్టుగా వార్తలు వస్తున్నాయి. వాంగ్‌చుక్ మాత్రం తాను బయటకు బలహీనంగా కనిపిస్తున్నా, లోన గట్టిగానే ఉన్నానని హామీ ఇస్తున్నారు. తనను దీక్ష విరమించుకోవాలని ఒత్తిడి చేయవద్దని ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని వాంగ్‌చుక్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా, పార్లమెంట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం అయినా, ఎన్‌డిఎ పక్షనేతలు ఎవ్వరు కూడా వాంగ్‌చుక్‌ను పలకరించలేదు. ఆయన పక్షాన నిలవడానికి వారికి ధైర్యం లేకుండాపోయింది. దీక్షాస్థలిని సందర్శించి మద్దతు ప్రకటిస్తున్న ప్రముఖులు, నేతలు లేకపోలేదు. కొందరు స్వయంగా వచ్చి సంఘీభావం ప్రకటిస్తే, బీజేపీ ప్రభుత్వ కఠినవైఖరిని పలు వేదికలద్వారా మరికొందరు ప్రశ్నిస్తున్నారు. నీట్ వైఫల్యం మీద స్వయంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూ, ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ, కాస్తంత ఆలస్యంగానైనా వాంగ్‌చుక్ పక్షాన మాట్లాడుతోంది. ఇకపోతే లద్దాఖ్‌కు రాష్ట్రహోదా, ఆరో షెడ్యూల్ రక్షణల కోసం గత ఏడాది వాంగ్‌చుక్ సుదీర్ఘపోరాటం చేసినప్పుడు కూడా ప్రభుత్వం ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. పైగా, హింసను ప్రేరేపించారన్న ఆరోపణలతో, ఆయన మీద జాతీయ భద్రతాచట్టాన్ని ప్రయోగించి, జైల్లో పడేశారు. 170 రోజులు జైల్లో ఉన్నాక, సుప్రీంకోర్టులో కేసు చివరివిడత విచారణకు రెండురోజుల ముందు ప్రభుత్వం ఆయనను విడుదలచేసింది. దానితోపాటు, ఆయనను అరెస్టుచేయడానికి ప్రాతిపదికలుగా వాడిన పాకిస్థాన్‌తో సంబంధాలు, అనుమానస్పద విదేశీపర్యటనలు, అక్రమ విరాళాల సేకరణ ఇత్యాది ఆరోపణలను కూడా గాలికి వదిలేసింది. ఓ రకంగా ప్రజల గొంతుకపై పాలకులు అంకుశం దింపుతున్నారు. తాముకోరుకున్నట్లుగా పాలన సాగిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించడం లేదు. ఇందుకు తాజా ఘటనలే నిదర్శనం.

# ఆక్వా కల్చర్ రంగాన్ని ఆదుకోండి

**బ్లూ ఎకానమీకి సహకారం ఇవ్వండి :** ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేయటంతో పాటు ఎప్పటికప్పుడు సహకారం అందించేందుకు వీలుగా జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు కార్యాలయం అమరావతిలో ఏర్పాటు చేయాలని సీఎం మరో లేఖలో మంత్రిని కోరారు. ఈ ఏడాది జూన్ 5 తేదీన విశాఖలో జరిగిన సీఫుడ్ ఎక్స్ పోర్ట్స్ వర్క్ షాప్ లో అమరావతిలో ఎన్‌ఎఫ్ డీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు అమరావతిలోని నెక్కల్లు గ్రామంలో 7.89 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్‌ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం, శిక్షణ కేంద్రం, పార్క్, ప్రజల సందర్శనార్థం అక్వేరియం ఏర్పాటు కోసం కేటాయించామన్నారు. తక్షణం ఈ భూమిని స్వాధీనం చేసుకుని నిర్మాణాలు ప్రారంభించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. 2028 నాటికల్లా ప్రాంతీయ కార్యాలయం, అక్వేరియం, శిక్షణా కేంద్రాల పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ ప్రాంతీయ కేంద్రం బ్లూ ఎకానమీ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారుతుందన్నారు.


**డీజీఎఫ్‌టీ ద్వారా క్రమబద్ధీకరించండి :** ఆంధ్రప్రదేశ్ లోని అక్వా కల్చర్ రంగాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ కు ముఖ్యమంత్రి లేఖ రాశారు. ఈక్వెడార్ నుంచి అమెరికా, చైనా, యూరోప్ లాంటి దేశాలకు ఎగుమతులు పెరగటంతో అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు గణనీయంగా పడిపోయాయని తెలిపారు. దేశంలో ఫిష్ మీల్ లభ్యతను క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్య మంత్రిని సీఎం కోరారు. ప్రస్తుతం రొయ్యల ఫీడ్ లో ఉపయోగించే చేప పొడిని 5 శాతం ప్రోత్సాహకాలతో ఎగుమతికి అనుమతిస్తున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కారణంగా దేశీయ ఫీడ్ తయారీ దారులు ఎక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. డిజిఎఫ్‌టి ద్వారా ఎగుమతులను నియంత్రించాలన్నారు. దేశీయ రొయ్యల ఫీడ్ తయారీ దారుల అవసరాలు తీరిన తర్వాతే ఎగుమతులకు అనుమతించాలని కోరారు. జీఎం సోయాబీన్ మీల్ దిగుమతికి కూడా అనుమతి ఇవ్వాలన్నారు.

**నిర్యాత్ ప్రోత్సాహన్ పథకం వర్తింప చేయాలి :** ఏపీ నుంచి ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతులకు ప్రోత్సాహకాలు కల్పించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. లక్షలాది మంది రైతు కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించేందుకు దోహదపడుతోందని సీఎం వెల్లడించారు. దేశంలోని పొగాకు ఉత్పత్తిలో ఎఫ్‌సీవీ పొగాకు 70 శాతం మేర ఎగుమతి అవుతోందని సీఎం వెల్లడించారు. జింబాబ్వే, టాంజానియా లాంటి దేశాల్లోని ఎగుమతి దారులకు ఆయా దేశాలు రాయితీలు, సుంకాల మినహాయింపు ఇస్తున్నాయని తెలిపారు. భారతీయ పొగాకు ఎగుమతిదారులకు ఎలాంటి మద్దతు లేకపోవటంతో తీవ్రమైన పోటీ ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆగస్టు 2021లో రోడ్‌టెప్ (=శీఱుఖా) పథకం కింద టీ, కాఫీ, మసాలా దినుసులు లాంటి వ్యవసాయ వస్తువులను చేర్చినప్పటికీ... ప్రాసెస్ చేయని పొగాకును (నూ జశీంవ 2401) మాత్రం ఈ జాబితాలో చేర్చలేదన్నారు. సమాన వడ్డీ పథకం, నిర్యాత్ ప్రోత్సాహన్ లాంటి పథకాల కింద ఎఫ్‌సీవీ పొగాకుకు సబ్సిడీ లేకపోవటంతో ఎగుమతిదారులకు భారం పడుతోందని సీఎం వివరించారు. తక్షణమే ప్రాసెస్ చేయని పొగాకు (నూ జశీంవ 2401-2401 10, 2401 20,2401 30) రకాలను ఇతర వ్యవసాయ ఉత్పత్తులతో పాటు =శీఱుఖా పథకం కింద ప్రయోజనాలు వర్తింపజేయాలని సీఎం కోరారు.

**కిసాన్ క్రెడిట్ కార్డుపై రూ.5 లక్షల టాప్ అప్ ఇవ్వండి :** ఆక్వా కల్చర్ రంగాన్ని ఆదుకునేలా ఆక్వా కల్చర్ ఏరియేటర్లపై జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి తగ్గించాలని ముఖ్యమంత్రి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ను కోరారు. కేంద్ర మంత్రికి లేఖ రాసిన సీఎం భారత- అమెరికా వాణిజ్య ఒప్పందంతో ఆక్వా దిగుమతులపై సుంకం 10 శాతానికి తగ్గినా ఇంకా చట్టపరమైన అనిశ్చితి కొనసాగుతోందని టారిఫ్ సంక్షోభంపై కేంద్ర ఆర్థిక శాఖ జోక్యం చేసుకోవాలని సీఎం కోరారు. కిసాన్ క్రెడిట్ కార్డు పై రూ.5 లక్షల వరకూ వన్ టైమ్ టాప్ అప్ ఇవ్వాలని సీఎం కేంద్ర ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేశారు.

దేశీయ మార్కెటింగ్ కోసం ఎన్‌ఎఫ్‌డీబీ ద్వారా రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ ను ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించేందుకు రొయ్య ఎగుమతులను పెంచేలా సబ్సీడీలు ఇవ్వటంతో పాటు సామర్థ్యాలను పెంచేలా చూడాలని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు. అలాగే ప్రాసెస్ చేయని పొగాకు హెచ్‌ఎస్‌ఎన్ కోడ్ 2401 పై జీఎస్టీని 40 నుంచి 28 శాతానికి తగ్గించాలని సీఎం కోరారు. ఏపీలోని లక్షలాది మంది పొగాకు రైతులతో పాటు డీలర్లు, ఎక్స్ పోర్టర్లకు ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జీఎస్టీ పెంపు వల్ల వర్కింగ్ క్యాపిటల్ సమస్యలు తలెత్తి సకాలంలో రైతులకు చెల్లింపులు చేయటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. జీఎస్టీ తగ్గింపు కారణంగా ఆర్థిక లావాదేవీలు మెరుగవుతాయని సీఎం స్పష్టం చేశారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ అంటూ దుష్ప్రచారం




సేవా కేంద్రాల పనితీరు ఉంటుంది. అయితే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల విషయంలో కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించే బాధ్యతను అధికారులు తీసుకోవాలి. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను వివరించాలి. అలాగే డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా మార్గాలు చూపెడతాం. దీపం-2.0 పథక లబ్దిదారులకు ఇచ్చే సబ్సిడీని క్రమపద్ధతిలో ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ సబ్సిడీని నిర్ధారిత తేదీల్లో ఇచ్చే అంశాన్ని పరిశీలించాలి. ఈ అంశంపై పౌర సరఫరాల శాఖ-ఆర్థిక శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలి. దీనికి సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించి అమలు చేయాలి"అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**టిగెంట్ పిటిషనర్లకు కౌన్సెలింగ్ :** "లిటిగెంట్ పిటిషనర్లను ఏ విధంగా కట్టడి చేయాలి. ఎలాంటి ప్రజా ప్రయోజనం లేకుండా చేసే ఫిర్యాదు దారులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి. రాష్ట్ర వ్యాప్తంగా 81 మంది లిటిగెంట్ పిటిషనర్లు ఉన్నట్టు గుర్తించాం. వీరు సరాసరి ఒక్కొక్కరు 246 పిటిషన్లు పెడుతున్నారు. వీరి వివరాలను జిల్లా కలెక్టర్లకు పంపించాలి. వారు పెట్టే అర్జీల్లో ప్రజా ప్రయోజనాలు ఉంటే వాటిని పరిశీలించాలి. ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేసే ఉద్దేశంతో పిటిషన్లు పెట్టే వారిని గుర్తించాలి. ఫిర్యాదుల పరిష్కారంలో ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరించాలి. ప్రాధాన్యతల వారీగా ఆర్థిక సమస్యలను పరిష్కరిద్దాం. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం కారణంగా ప్రస్తుతం 49 శాతం లోటు వర్షపాతం ఉంది. ఈ ప్రభావం నుంచి బయటపడేసే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. ఈ మేరకు రైతుల్లో అవగాహన కల్పించాలి. డ్రై క్రాప్స్ వేసేలా రైతులను ప్రొత్సహించండి. ఇదే సమయంలో వీబీ జీ రామ్ జీ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలి. జలధార పనులకు వీబీ జీ రామ్ జీ పనుల్ని అనుసంధానం చేయాలి. ప్రజాభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పని విధానం మార్చుకోవాలి. పరిపాలనా విధానాలను మెరుగుపరుచుకోవాలి. సమస్యలు ఉత్పన్నమయ్యాక చర్యలు తీసుకోవడంతోపాటు... ముందుగానే ఏయే సమస్యలు వస్తాయనే విషయాన్ని అంచనా వేసి.. దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దశాబ్దాల మొండి సమస్యకు మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారం

మంగళగిరి నియోజకవర్గంలోని కొండవాలు, అటవీ, దేవాలయ భూముల్లో వేలాది కుటుంబాలు దశాబ్దాలుగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నాయి. అయితే, ఆ స్థలాలపై వారికి ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ ఆస్తులను పిల్లలకు బదిలీ చేయాలన్నా, అత్యవసరానికి రుణం పొందాలన్నా వీలుకాని దుస్థితి నెలకొంది. ఎన్నికల ప్రచారంలో ఈ సమస్యను గుర్తించిన లోకేశ్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం, అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే తొలి విడతలో భాగంగా రత్నాల చెరువు, యర్రబాలెం, నీరుకొండ వంటి ప్రాంతాల్లో 3,002 మందికి సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములపై శాశ్వత హక్కులు కల్పించారు.ప్రస్తుతం రెండో విడతలో భాగంగా మంగళగిరి డీజీపీ కార్యాలయం సమీపంలోని సీకే కన్వెన్షన్ హాలులో పట్టాల పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఈ విడతలో అందించే పట్టాల మార్కెట్ విలువ కూడా సుమారు రూ.1,000 కోట్లు ఉంటుందని అంచనా. మొత్తంమీద, దశాబ్దాలుగా కాగితాలపై హక్కుల్లేక అభద్రతాభావంతో జీవిస్తున్న వేలాది కుటుంబాలకు మంత్రి లోకేశ్ చొరవతో శాశ్వత భరోసా లభించనుంది.

# సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

సోమవారం పార్లమెంట్ దగ్గర మీడియాతో ప్రధాని మాట్లాడారు.

భారత అంతరిక్ష ప్రస్థానంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని ఉద్ఘాటించారు. భారతదేశ యువత అంతరిక్షంలోకి దూసుకుపోయిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. విక్రమ్-1 విజయం వెనుక యువత పాత్ర కీలకమని తెలిపారు. స్కైరూట్ విజయవంతం అవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అదే సమయంలో అంతరిక్ష రంగ స్టార్టప్ స్కైరూట్ 'విక్రమ్-1' ప్రయోగం విజయవంతం అవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 28 ఏళ్ల సగటు వయసున్న ఆవిష్కర్తలదే ఈ ఘనత అని కొనియాడారు. 'ఏడాది కాలంలో ఎన్నో గొప్ప విషయాలు జరిగాయి. అంతరిక్షంతో సహా వేదిక ఏదైనా.. మనం సాధించిన విజయాలు దేశానికి గర్వకారణం. గత సంవత్సరం వర్షాకాల సమావేశాలకు ముందు ఒక భారతీయ పౌరుడు శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఇప్పుడు ఒక భారతీయ స్టార్టప్ స్కైరూట్ అద్భుతమైన ఘనత సాధించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలంటించారు. భారత యువత అంతరిక్షంలో ఒక కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఇలాంటి ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు 28 ఏళ్లని నాకు తెలిసింది. ఇక్కడ నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదని పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి మోదీ అన్నారు. యువత సాధించిన ఈ విజయం యాదృచ్ఛికం కాదు. మన దేశ యువత సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలే హద్దుల్లేనివని చెప్పే సందేశం ఇదని ప్రధాని ప్రశంసించారు. రాజస్థాన్‌లో అతిపెద్ద ఆయిల్ రిఫైనరీని దేశానికి అంకితం చేశామని వెల్లడించారు. ఒక సెమీ కండక్టర్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ రైలును ప్రారంభించామని తెలిపారు. యుద్ధంతో చాలా దేశాలకు నష్టం జరుగుతోందని చెప్పారు. చమురు ధరలు అమాంతం పెరుగుతు న్నాయని తెలిపారు. 7.7శాతం గ్రోత్‌రేట్ భారత్ నమోదు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'వర్షాకాలం, వర్షాకాల సమావేశాలు.. ఈ రెండు చురుగ్గా ఉంటే ఫలితాలు గొప్పగా ఉంటాయి. అప్పుడే దేశం సంక్షేమంగా ఉంటుంది. అందుకే ఈ రెండూ మెరుగ్గా ఉండాలని కోరుకుంటున్నాను' అని మోదీ తెలిపారు. గందరగోళ పరిస్థితులకు తావులేకుండా పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చలు జరగాలని ఆకాంక్షించారు.

# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్..

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ :** నీట్-యూజీ 2026 పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై దేశ రాజధాని ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు ఆయన తన పూర్తి మద్దతు ప్రకటించారు.సోషల్ మీడియా వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి, విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు వారి గొంతు నొక్కేందుకు పోలీసు బలగాలను ప్రయోగిస్తోందని ఆరోపించారు. "నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పడిన ప్రతి దెబ్బ.. ప్రశ్నలన్నా, నిజమన్నా బీజేపీకి ఉన్న భయాన్ని బహిర్గతం చేస్తోంది. నీట్ కుంభకోణంపై కేంద్రం ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలి. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు.పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజైన సోమవారం, కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు 'ఛలో పార్లమెంట్' కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో సమూల సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ వారు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి.

# అంతర్జాతీయ ఉద్రిక్తతల ఎఫెక్ట్..



**న్యూఢిల్లీ :** అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితికి తోడు, దేశీయంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీల పతనానికి దారితీసింది. దీంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు.

ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 443 పాయింట్లు నష్టపోయి 77,708.52 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 96 పాయింట్లు క్షీణించి 24,238.50 వద్ద ముగిసింది.మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 24,300--24,400 జోన్ తక్షణ నిరోధకంగా కొనసాగుతోంది. ఈ స్థాయిని నిలకడగా అధిగమిస్తేనే బుల్స్ పట్టు సాధించి, సూచీ 24,500--24,600 స్థాయిల వైపు పయనించే అవకాశం ఉంటుంది. ఒకవేళ సూచీ కిందకు వస్తే, 24,100 వద్ద తక్షణ మద్దతు లభిస్తుందని, ఈ స్థాయిని కోల్పోతే లాభాల స్వీకరణ పెరిగి 24,000 సైకలాజికల్ మార్క్ వరకు పడిపోవచ్చని హెచ్చరిస్తున్నారు.సెషన్ మొత్తంలో బ్యాంకింగ్ షేర్లపై అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతి సుజుకి ఇండియా షేర్లు నిఫ్టీలో టాప్ లూజర్లుగా నిలిచాయి. సూచీలు నష్టపోయినప్పటికీ, బ్రాడర్ మార్కెట్ మాత్రం రాణించడం గమనార్హం. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.6 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.16 శాతం లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు తీవ్రంగా నష్టపోగా, నిఫ్టీ ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు లాభాలతో ముగిశాయి.

అంతర్జాతీయంగా అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తొమ్మిదో రోజుకు చేరడం, ముఖ్యంగా హర్మూజ్ జలసంధిపై ఉద్రిక్తతలు కేంద్రీకృతమవ్వడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపరిచిందని విశ్లేషకులు పేర్కొన్నారు.

## తిరుమలకు భారీగా భక్తుల రాక...

ప్రస్తుతం టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న ఆదివారం (జులై 19) ఒక్కరోజే 90,956 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారికి 33,046 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.05 కోట్లుగా నమోదైంది. రద్దీకి అనుగుణంగా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది.ఆదివారం నాడు టీటీడీ మొత్తం 4.44 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించింది. అదేవిధంగా, 2.94 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసింది. యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వైద్య కేంద్రాల ద్వారా 3,708 మందికి వైద్య సేవలు అందించినట్లు టీటీడీ వెల్లడించింది. భక్తుల రద్దీ కొనసాగుతున్నందున, యాత్రికులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## కష్టపడితే పేదరికాన్ని జయించవచ్చు

విద్యార్థులు కష్టపడి చదివితేనే లక్ష్యాన్ని చేరుకోగలరని సూచించారు. యువనేత నారా లోకేశ్ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నారని ఉద్ఘాటించారు. విద్యార్థులు ఈ మార్పులను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి నారాయణ పిలుపునిచ్చారు.తన కష్టంతోనే ఈ స్థాయికి వచ్చానని మంత్రి నారాయణ ప్రస్తావించారు. తాను పదోతరగతి ఫెయిల్ అయ్యానని, ఆ తర్వాత గ్రేస్ మార్కులతో పాస్ అయ్యానని వెల్లడించారు. పదోతరగతి ఫెయిల్ తనలో పట్టుదల పెంచిందని చెప్పుకొచ్చారు. డిగ్రీ మూడేళ్లల్లో యూనివర్శిటీ టాపర్‌గా నిలిచానని తెలిపారు. స్టాటిస్టిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించానని వెల్లడించారు. వీఆర్సీలో పార్టు టైం లెక్చరర్‌గా రూ.40ల జీతానికి పనిచేశానని వివరించారు. మూడు నెలలకు గానూ రూ.120ల జీతం ఇస్తే తాను తీసుకోలేదని వెల్లడించారు. ప్రభుత్వ అధ్యాపకుడిగా అవకాశం ఇచ్చినా తాను రాజీనామా చేశానని ప్రస్తావించారు.

## దేశంలోనే తొలి డెంగ్యూ వ్యాక్సిన్‌కి డిసిజిఐ ఆమోదం

సోకకపోయినా ఈ టీకా తీసుకోవచ్చని, టీకాకు ముందు ప్రత్యేక స్క్రీనింగ్ అవసరం లేదని కంపెనీ తెలిపింది.

ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్ ఆధారంగా ఈ అనుమతి లభించిందని, డెంగ్యూ నివారణతో పాటు ఆసుపత్రిలో చేరే ప్రమాదాన్ని కూడా గణనీయంగా తగ్గించడంలో ఈ వ్యాక్సిన్ సమర్థవంతంగా పనిచేసిందని టకేడా వెల్లడించింది. ఇప్పటికే 43 దేశాల్లో ఈ వ్యాక్సిన్‌కు అనుమతి లభించగా, ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా అధిక డెంగ్యూ వ్యాప్తి ఉన్న ప్రాంతాల్లో దీని వినియోగాన్ని సిఫార్సు చేసింది. ఇది ప్రస్తుతం బ్రెజిల్ జాతీయ టీకా కార్యక్రమంలో భాగంగా ఉందని, అర్జెంటీనా, కొలంబియా, ఇండోనేషియాలోని ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా అందుబాటులో ఉందని తెలిపింది.



## విపక్షాల నిరసనలతో హోరెత్తిన పార్లమెంటు...

ఈ సమావేశాలు ఆగస్టు 13 వరకు జరగనుండగా, మొత్తం 19 పనిదినాలు ఉన్నాయి.ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా దివంగత సభ్యులకు నివాళు లర్పించి, సభ గౌరవాన్ని కాపాడాలని సభ్యులను కోరారు. కానీ, ప్రతిపక్ష సభ్యులు నీట్ వివాదం, విద్యార్థుల ఆత్మహత్యలపై నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో స్పీకర్ మొదట సభను మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆ తర్వాత కూడా గందరగోళం కొనసాగడంతో రేపటికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇదే తరహా దృశ్యాలు కనిపించాయి.

సమావేశాలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ మీడియాతో మాట్లాడుతూ.. స్కైరూట్ రాకెట్ ప్రయోగం, హైడ్రోజన్ రైలు వంటి విజయాలను ప్రస్తావిస్తూ దేశ యువతను ప్రశంసించారు. అయితే, దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన నీట్ వివాదంపై ఆయన ఏమీ మాట్లాడలేదు.మరోవైపు, నీట్ లీక్‌లకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ (కాక్‌రోచ్ జనతా పార్టీ) ఆధ్వర్యంలో జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వరకు ర్యాలీ చేపట్టారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ పరిసరాల్లో ఢిల్లీ పోలీసులు, ఆర్‌పీఎఫ్ బలగాలతో భారీ భద్రత ఏర్పాటు చేసి, నిషేధాజ్ఞలు విధించారు. ఈ సమావేశాల్లో హోం మంత్రి అమిత్ షా 'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు'ను ప్రవేశపెట్టనున్నారు.

# యువతకు టూరిజం గైడ్స్‌గా ఉపాధి అవకాశాలు: మంత్రి కందుల దుర్గేష్



జైపూర్ లో టూరిజం గైడ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ నరేంద్ర సింగ్ రాథోర్ తో మంత్రి కందుల దుర్గేష్ కీలక భేటీ

ఏపీకి రండి అని యువతకు గైడ్స్ గా శిక్షణ ఇవ్వండి అని టూరిజం గైడ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ కు అధికారిక ఆహ్వానం

ఏఐ డిజిటల్ గైడ్స్‌తో పాటు పర్యాటక ప్రాంతాల్లో అందుబాటు లోకి ప్రొఫెషనల్ టూర్ గైడ్స్ వస్తారన్న మంత్రి దుర్గేష్

పర్యాటకులు తమ పర్యటనల్లో వ్యక్తిగత గైడ్స్ కావాలని కోరు కుంటే శిక్షణ పొందిన యువత ఎంతగానో దోహదపడతారని మంత్రి దుర్గేష్ వెల్లడి

రాజస్థాన్(జైపూర్)/అమరావతి ప్రజా భూమి ప్రతినిధి రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. రాజస్థాన్ లోని జైపూర్‌లో రెండో రోజు పర్యటిస్తున్న మంత్రి దుర్గేష్ .. టూరిస్ట్ గైడ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ నరేంద్ర సింగ్ రాథోర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగ అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పనపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2026 వార్షిక బడ్జెట్‌లో పర్యాటక, ఆతిథ్య రంగాలకు విశేష ప్రాధాన్యం కల్పించిందని.. అందులో భాగంగా పర్యాటక రంగంలోని 20 కీలక విభాగాలలో 10,000 మంది యువతకు టూరిజం అండ్ హాస్పిటాలిటీ స్కిల్ కౌన్సిల్ వంటి సంస్థల ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ అందించాలని నిర్ణయించిన అంశాన్ని గుర్తుచేశారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ఆల్ ఇండియా టూరిజం గైడ్స్ ఫెడరేషన్ సహకారంతో ఎక్కువ మంది ఆంధ్రప్రదేశ్ యువతకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించి వారిని ప్రొఫెషనల్ టూర్ గైడ్స్‌గా తీర్చిదిద్దాలని మంత్రి దుర్గేష్ ఆయనను కోరారు.

తద్వారా స్థానిక యువతకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీలో పర్యాటక సేవలను మెరుగుపరచడంతో పాటు, స్థానికంగా పర్యాటక రంగంలో వస్తున్న డిమాండ్‌కు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడం , వారికి శిక్షణను అందించేందుకు త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించాలని ఫెడరేషన్ ప్రతినిధులను మంత్రి కందుల దుర్గేష్ అధికారికంగా ఆహ్వానించారు. పర్యాటక ప్రాంతాలలో సందర్శకులకు మెరుగైన సేవలందించేందుకు ఇటీవల ప్రవేశపెట్టిన 'ఏఐ డిజిటల్ గైడ్స్'తో పాటు, శిక్షణ పొందిన గైడ్స్ కూడా అందుబాటులో ఉంటారని మంత్రి దుర్గేష్ తెలిపారు. పర్యాటకులు తమ పర్యటనల్లో వ్యక్తిగత గైడ్స్ కావాలని కోరుకుంటే ఈ శిక్షణ పొందిన యువత ఎంతగానో దోహదపడతారని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల ఆధ్వర్యంలో పర్యాటక రంగం ద్వారా రాష్ట్రంలోయువతకు భారీగా ఉపాధి అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కందుల దుర్గేష్ పునరుద్ఘాటించారు. పర్యటనలో మంత్రి దుర్గేష్ తో పాటు ఏపీ పర్యాటక స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ ఉన్నారు.

# టిడ్కో గృహాల నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయండి

### టిడ్కో గృహాల నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)



జగ్గయ్యపేట, ప్రజాభూమి

టిడ్కో గృహాల నిర్మాణ పనులు మరింత వేగవంతంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ,అనుకున్న సమయానికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ ఆదేశించారు.జగ్గయ్యపేట పట్టణంలోని టిడ్కో గృహాల నిర్మాణ ప్రాంతాన్ని స్థానిక శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సోమవారం సందర్శించి, నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు._ఈ సందర్భంగా సంబంధిత శాఖ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే రాజగోపాల్ టిడ్కో గృహాల నిర్మాణ పనుల ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. పనులను మరింత వేగవం తంగా పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను త్వరితగతిన అందించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా, నిర్ణయించిన గడువులో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అలాగే టిడ్కో గృహాల నిర్మాణానికి సంబంధించిన సమస్యలు, పనుల పురోగతి, చేపట్టాల్సిన తదుపరి కార్యాచరణపై సమగ్రంగా చర్చించేందుకు ఈ నెల 24వ తేదీన జగ్గయ్యపేట మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు నకరికంటివెంకట్ , నేతలుపుల్లారావు, నోముల రఘు, శ్రీనాథ్, అక్బర్, సంబంధిత శాఖ అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




# ఖరీఫ్–2026 పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



మచిలీపట్నం/ ప్రజా భూమి ప్రతినిధి ఖరీఫ్–2026 సీజన్‌కు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పి ఎమ్ ఎఫ్ బి వై) కింద అర్హులైన రైతులందరూ తప్పనిసరిగా నమోదు చేసుకొని పంటల బీమా రక్షణ పొందాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి సూచించారు.సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన–ఖరీఫ్ 2026 జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జ్యోతి రమణి, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన లక్ష్యాలు, అమలు మార్గదర్శకాలు, ఖరీఫ్–2026లో అమలు విధానాన్ని వివరించారు.ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులకు కలిగే పంట నష్టాలను తగ్గించి ఆర్థిక భద్రత కల్పించడమే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ముఖ్య ఉద్దేశ్యమన్నారు.రుణగ్రహీత రైతులతో పాటు రుణేతర రైతులు, కౌలు రైతులు కూడా స్వచ్ఛందంగా పథకంలో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో రైతులకు విస్తృత అవగాహన కల్పించి అర్హులైన ప్రతి రైతు పథకంలో నమోదు అయ్యేలా వ్యవసాయ, రెవెన్యూ, గ్రామ సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.రుణేతర రైతులకు ఈ ఏడాది రైతు స్వీయ ధృవీకరణ (ఫార్మర్ సెల్ఫ్ డిక్లరేషన్) విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల నమోదు ప్రక్రియ మరింత సులభతరం అయిందని తెలిపారు. నమోదు సమయంలో ఆధార్, భూ యాజమాన్య లేదా కౌలు ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలు, మొబైల్ నంబర్ తదితర అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు.

జిల్లాలో రుణగ్రహీత, రుణేతర రైతుల నమోదు పురోగతిని సమావే శంలో సమీక్షించిన కలెక్టర్, నమోదు ప్రక్రియను వేగవంతం చేసి లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారుల కు ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని నమోదు కేంద్రా ల్లో అవసరమైన ఏర్పాట్లు చేయా లని సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో ఇరిగేషన్ శాఖ ఎస్ఈ గుణకర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జె జ్యోతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రవీంద్రారెడ్డి, జిల్లా గణాం క శాఖ ఏడి కే పద్మజ, డ్రైనేజీ శాఖ ఈఈ కిరణ్ బాబు, కృషి విజ్ఞాన కేంద్ర వ్యవసాయ శాస్త్రవేత్త సుధారాణి, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, టాటా ఏఐజీ జనరల్ ఇన్సూ రెన్స్ కంపెనీ ప్రతినిధు లు, మండల వ్యవసాయ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఈ నెల 21 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు



- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ:

ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జిల్లాలో ప్రత్యేక ఆధార్ సేవా శిబిరాలు అందుబాటులో ఉంటాయని.. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఈ శిబిరాలు సేవలందిస్తాయన్నారు. కొత్తగా ఆధార్ నమోదు, ఆధార్‌లో పేరు, చిరునామా, జనన తేదీ, మొబైల్ నంబరు, బయోమెట్రిక్ వివరాల నవీకరణతో పాటు 5 నుంచి 15 ఏళ్లు, ఆ పైబడిన చిన్నారుల బయోమెట్రిక్ అప్‌డేట్ తదితర సేవల ను పొందొచ్చన్నారు. ప్రజలకు సకాలంలో పారదర్శకంగా ఆధార్ సేవలు అందించేందుకు చర్య లు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధానంగా విద్యార్థులకు ఆధార్ సేవలు తేలిగ్గా అందుబాటులో ఉండేలా పాఠశాలలు, కళాశాలల్లోనూ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# సామాన్య ప్రజా సమస్యల పట్ల సహానుభూతితో స్పందిస్తే తక్షణమే పరిష్కారం సాధ్యం

### జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు'మీకోసం' కార్యక్రమంలో ప్రజల నుంచి 56 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ



మచిలీపట్నం క్రైమ్ ప్రజా భూమి ప్రతినిధి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్ (మీకోసం) కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యతతో, ఎలాంటి రాజీ లేకుండా చట్టపరిధిలో విచారించి పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, తెలిపారు.ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక – మీకోసం కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకొని వారితో ముఖాముఖి మాట్లాడి చట్ట పరిధిలో పరి ష్కారం అందిస్తామని హామీ ఇచ్చారు. సమస్య లతో వచ్చిన ప్రతి ఫిర్యాదుదారునితో చిరునవ్వుతో, మర్యా ద పూర్వకంగా మాట్లాడి, వారి బాధలను అర్థం చేసుకుంటూ స్పందిస్తే, వారి సమస్య సగం పరి ష్కారమైన భావన కలుగుతుందని అన్నారు. ప్రతి ఫిర్యాదుదారులో న్యాయం జరుగుతుందనే నమ్మకా న్ని కల్పించడం పోలీసుల బాధ్యత అని సూచించారు.ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో ముఖా ముఖి మాట్లాడిన ఎస్పీ , ప్రతి ఫిర్యాదును చట్టపరిధిలో సమగ్రంగా విచారించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు ఎలాంటి సమస్య ఎదురైనా నిర్భయంగా పోలీసులను ఆశ్రయించి చట్టబద్ధమైన పరిష్కారం పొందవచ్చని భరోసా కల్పించారు.ఈరోజు మీకోసం కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి మొత్తం 56 ఫిర్యాదులు అందాయి.

వాటిలో ముఖ్యమైనవి పామర్రు: శ్రీను అనే వ్యక్తి తన పితరుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తిని బంధువులు నకిలీ పత్రాలు చూపించి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రశ్నించినందుకు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఫిర్యా దు చేశారు.చల్లపల్లి: లక్ష్మి అనే మహిళకు వివాహం జరిగి ఆరు సంవత్సరాలు అయినప్పటికీ అదనపు కట్నం కోసం అత్తింటి వారు తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారని న్యాయం చేయాలని కోరారు.కంకిపాడు: బసవయ్య అనే రైతు తన వ్యవసాయ భూమికి వెళ్లే మార్గాన్ని సరిహద్దు భూమి యజమాని అడ్డుకుంటూ, ప్రశ్నించినందుకు దుర్భా షలాడి శారీరక దాడికి పాల్పడుతున్నాడని, రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. ఘంటసాల: నరేష్ అనే వ్యక్తి వచ్చి డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉండగా తన స్నేహి తుడు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మ బలికి తన వద్ద నుండి మూడు లక్షల రూపాయిలు తీసుకున్నాడని సంవత్సరమైనప్పటికీ ఉద్యోగం గూర్చి ఎటువంటి సమాచారం లేకపోగా అడుగుతుంటే బెదిరిస్తున్నారని న్యాయం చేయమని ఫిర్యాదు.అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులకు పంపించి, చట్టపరంగా సత్వర విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

# వడివడిగా 22ఏ అర్జీల పరిష్కారం..

- తాజాగా మరో పదిమందికి పత్రాల అందజేత
- అత్యంత పారదర్శకంగా దరఖాస్తుల పరిష్కారం
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

నిషేధిత భూముల (22-ఏ) జాబితాలో పొరపాటున నమోదైన భూములకు సంబంధించి పట్టాదారులకు సత్వర న్యాయం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి దరఖాస్తును పారదర్శకంగా, చట్టబద్ధంగా, వేగవంతంగా పరిశీలిస్తూ 22(ఏ) కేసుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామన్నారు.22ఏ నుంచి తొలగించి భూ యాజమాన్య హక్కుల పునరుద్ధరణకు సంబంధించి సోమవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డిహాల్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ.. పదిమందికి ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 22(ఏ) కేసుల పరి ష్కారం కోసం ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎప్పటికప్పుడు పరిష్కార మైన కేసులకు సంబంధించి అర్జీదారులకు పత్రాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి సత్వర పరిష్కారం అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు. గత మూడు నెలల కాలంలోనే 62 ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించడం జరిగిందన్నారు. భూ వివాద రహిత గ్రామాలు లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా సంబంధిత రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.



# ఉప ముఖ్యమంత్రిపవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని తిరుమలగిరిలో జనసేన నేతల ప్రత్యేక పూజలు

జగ్గయ్యపేట, ప్రజా భూమి

జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని జనసేన నేతలు తిరుమలగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల జరిగిన శస్త్రచికిత్స నుండి త్వరితగతిన పూర్తిగా కోలుకొని, తిరిగి ప్రజా సంక్షేమం మరియు రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాల్లో మరింత ఉత్సాహంతో సేవలందించాలని ఆకాంక్షిస్తూజనసేన నాయకులు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను సతీమణి విమల భాను ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమల భాను ఆదేశాల మేరకు, సోమవారంఉదయం తిరుమలగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయ సన్నిధిలో పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యం, ఆయురారోగ్యాలు మరియు ప్రజాసేవలో మరింత విజయవంతమైన ప్రస్థానం కొనసాగాలని ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి మొక్కు తీర్చుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ మండలంపార్టీ అధ్యక్షులు చిలుకూరి శ్రీను . దండ రమేష్ . బండి నరేష్ .బెంబవరుపు కృష్ణకుమారి .మేడపురెడ్డి కృష్ణ నాయుడు .నారికెళ్ళ కవిత.కోడెబోయిన ఇంద్రావతి .యానుముల సింధూజ పా ల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


# దస్తావేజు లేఖరుల పెన్డౌన్ దీక్షకు వైయస్సార్ కాంగ్రెస్ నేత తన్నీరు నాగేశ్వరరావు మద్దతు



### ప్రభుత్వం జీవో నెం. 396ను వెంటనే రద్దు చేయాలి దస్తావేజు లేఖర్లపై ఆంక్షలు ఎత్తివేయాలి తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట, ప్రజాభూమి

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 396ను వెంటనే రద్దు చేసి, దస్తావేజు లేఖర్లపై విధించిన ఆంక్షలు, నిషేధాలను ఎత్తివేయాలని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్–ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.సోమవారం జగ్గయ్యపేట పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖర్లు నిర్వహించిన శాంతియుత ధర్నాకు ఆయన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున మద్దతు ప్రకటించారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి దస్తావేజు లేఖర్లు పడే ఇబ్బందులను వివరించారు.ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ, గత నెల 30వ తేదీన ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 396 వల్ల రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది దస్తావేజు లేఖర్ల జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జీవో అమలుతో దస్తావేజు లేఖర్ల వృత్తి దెబ్బతినడమే కాకుండా, ప్రజల ఆస్తుల భద్రత, న్యాయపరమైన రక్షణ కూడా దెబ్బతినే అవకాశం ఉందన్నారు.ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నిర్ణయం వల్ల అనేక కుటుంబాలు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, దస్తావేజు లేఖర్లను ఇబ్బందులకు గురిచేసే చర్యలను వెంటనే వెనక్కి



తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖర్లతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.దస్తావేజు లేఖర్ల సమస్యలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించి, జీవో నెం. 396ను వెంటనే రద్దు చేసి వారి జీవనోపాధిని కాపాడాలని తన్నీరు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజున్నిసా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గింజుపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శ్యామల్, జిల్లా పంచాయతీ రాజ్ కార్యదర్శి శీలం మంగారావు, మండల ప్రచార విభాగ అధ్యక్షులు వేశాల కనక చంద్రరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నరసింహారెడ్డి, పట్టణ కార్యదర్శి దార్ల ప్రసన్నకుమార్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు పిడమర్తి ప్రభు, పట్టణ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు ఉసా సురేష్, దస్తావేజు లేఖర్ల సంఘం నాయకులు, సభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక & పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ టూక్ అల్ మర్రీకి ఘన స్వాగతం



గన్నవరం, ప్రజాభూమి

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం, గన్నవరం వద్ద యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) ఆర్థిక & పర్యాటక శాఖ మంత్రి హిజ్ ఎక్సలెన్సీ అబ్దుల్లా బిన్ టూక్ అల్ మర్రీ కి సోమవారం ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా గుడివాడ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) జి. బాల సుబ్రహ్మణ్యం విమానాశ్రయంలో మంత్రివర్యులను మర్యాద పూర్వకంగా ఆహ్వానించి, రాష్ట్ర ప్రభు త్వ తరపున స్వాగతం తెలిపారు.అనంతరం సంబంధిత అధికారులు ప్రోటోకాల్ ప్రకారం స్వాగత కార్యక్రమాలను నిర్వహించి, అతిథికి అవసరమైన ఏర్పాట్లు కల్పించారు.ఈ కార్యక్ర మంలో సంబం ధిత ప్రభుత్వ అధికారులు, విమానాశ్రయ అధికారులు, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

మంగళవారం 21 జూలై 2026


## సోషల్ మీడియా బాధ్యతాయుత వినియోగంపై ఏలూరులో రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు



స్థానిక గిరిజన భవన్‌లో సామాజిక వేత్త, జనసేన నాయకురాలు దిరిసిన ఫాతిమా రాణి ఆధ్వర్యంలో "సోషల్ మీడియా - సామాజిక బాధ్యత" అంశంపై సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఏపీఎస్ ఆర్టీసీ జోన్-2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా విని యోగించాలని, అసత్య ప్రచారం, ద్వేషపూరిత పోస్టులు, రెచ్చగొట్టే సందేశాలకు దూరంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, ఐక్యత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో రిటైర్డ్ ఎస్పీ నక్క సూర్య చంద్ర రావు, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, జనసేన నాయకుడు నారా శేషు, వివిధ మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈత పోటీల్లో శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థికి కాంస్య పతకం




ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

ఏలూరు అగ్రహారంలోని శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్.కె. హకీల్ ఈత పోటీల్లో ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించి కళాశాలకు మరోసారి గర్వకారణంగా నిలిచాడు. విశాఖపట్నంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జూలై 18, 19 తేదీల్లో నిర్వహించిన 11వ జూనియర్ & సబ్-జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో జరిగిన 200 మీటర్ల బటర్‌ఫ్లై స్విమ్మింగ్ విభాగంలో హకీల్ అద్భుత ప్రదర్శన చేసి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం హకీల్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేసింది. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు, ఏలూరు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సత్కార కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జి. చంద్రరావు, వైస్ ప్రిన్సిపల్ వి. సుభాష్ పాల్గొని హకీల్‌ను అభినందిస్తూ అతని విజయాన్ని కొనియాడారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కూడా హకీల్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## తొమ్మిదేళ్ల పంచాయితీ బాధ్యతలు స్వీకరించిన చైతన్య

ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి



జీలుగుమిల్లి పంచాయతీలో గత కొంతకాలము నుండి ఇన్చార్జి పాన్లో జరుగుతున్న నేపథ్యంలో నేడు నూతన పంచాయతీ కార్యదర్శి గా తొమ్మిదేళ్ల చైతన్య బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు బుట్టాయిగూడెం మండలంలోని రెడ్డి గణపురం పంచాయతీలో గ్రేడ్ ఫోర్ పని చేసి పదోన్నతి పై గ్రేడ్ 3 కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. పంచాయతీలో త్రాగునీటి సమస్య పైన దృష్టి పెడతానని, పారిశుధ్యం ఎవరు నిర్లక్ష్యం ఊహించొద్దని ఆయన అన్నారు. పంచాయతీ పరిధిలో ఏవైనా సమస్యలు ఉంటే కార్యదర్శి దృష్టికి తీసుకుని రావాలని ఆయన కోరారు.

## ప్రసన్న కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నేతల రు.15 వేల ఆర్థికసాయం

ప్రజా భూమి ప్రతినిధి-కామవరపుకోట



మండల కేంద్రంలోని పాతూరు శివారు వైఎస్సార్ జగనన్న కాలనీలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ప్రసన్న కుటుంబానికి మండల వైఎస్సార్‌సీపీ నేతలు అండగా నిలిచారు. చింతలపూడి నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ కంభం విజయరాజు చేతుల మీదుగా రు. 15వేలు ఆర్థిక సాయం అందేశారు. మండల వైసీపీ అధ్యక్షులు రాయంకుల సత్యనారాయణ రు. 5000, మాజీ సొసైటీ అధ్యక్షులు, పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు సాయిన కనకరాజు రు. 10,000 మొత్తం రు. 15వేల ఆర్థిక సాయాన్ని విజయరాజు చేతుల మీదుగా ప్రసన్నకు అంద జేశారు. కార్యక్రమంలో మండల వైఎస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, మండల వైసీపీ అధ్యక్షులు రాయంకుల సత్యనారాయణ, టౌన్ వైసీపీ అధ్యక్షులు బీఎస్ఎన్, మాజీ సొసైటీ అధ్యక్షులు సాయిన కనకరాజు, తమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం, సిరిశెట్టి సిద్ధిరాజు, భీమిరెడ్డి వెంకన్నబాబు, నానాది సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరులో మాలమహానాడు జిల్లా సమావేశం

- 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ రద్దు చేయాలని డిమాండ్
- జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు




నగరంలోని లేడీస్ క్లబ్‌లో మాలమహానాడు ఏలూరు జిల్లా సమావేశం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొని రాష్ట్రంలో దళితుల సమస్యలు, హక్కుల పరిరక్షణ, సబ్ ప్లాన్ నిధుల వినియోగంపై ప్రభుత్వ వైఖరిని ప్రస్తావించారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల మరణించిన కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంకు నాయకులు ఘనంగా నివాళులర్పించి, ఆయన ప్రజాసేవలను స్మరించుకున్నారు. అనంతరం నల్లి రాజేష్ మాట్లాడుతూ 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను వెంటనే రద్దు చేసి, దళిత క్రైస్తవులకు రాజ్యాంగబద్ధంగా లభించాల్సిన హక్కులు, రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పూర్తిగా ఆయా వర్గాల అభివృద్ధికే ఖర్చు చేయాలని, వాటి వినియోగంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు ఏలూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బోరుగడ్డ కిషోర్, రాష్ట్ర యువజన ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సుంకర రాజేష్, జిల్లా యువజన అధ్యక్షుడిగా రామాల ఆనంద్, రాష్ట్ర కార్యదర్శిగా పీతల కృష్ణమూర్తి, ఏలూరు మండల అధ్యక్షుడిగా జంగం వెంకటరత్నం ఎన్నికయ్యారు. జిల్లాలో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహాసేన అధ్యక్షుడు అలగ రవికుమార్, గుండే నగేష్, తొర్లపాటి శ్రీనివాస్, విప్పర్తి ప్రభాకర్, రొక్కాల నాగరాజు, వెంపల రాజు, సింగవరపు మనోజ్, మద్రే సామ్యూల్‌తో పాటు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ విభాగం ప్రైవేటీకరణను విరమించుకోవాలి

- జీ .ఓ .నెం.396ను వెంటనే రద్దు చేయాలి
- దస్తావేజు లేఖర్ల సంఘం డిమాండ్

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు



రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీ .ఓ .నెం .396 ద్వారా రిజిస్ట్రేషన్ శాఖలోని సేవలను పబ్లిక్--ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో అమలు చేసి ప్రైవేటీకరించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకుని జీవోను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ దస్తావేజు లేఖర్ల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పెనుమాక వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, జీ.ఓ. నెం.396 అమలులోకి వస్తే రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది లైసెన్స్ పొందిన దస్తావేజు లేఖర్లు, వారి కుటుంబాలు ఉపాధిని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రజలకు పారదర్శకంగా సేవలందిస్తున్న దస్తావేజు లేఖర్ల వ్యవస్థను బలహీనపరిచి, రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రైవేటీకరణ వల్ల సాధారణ ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడటంతో పాటు సేవలలో పారదర్శకత, జవాబుదారీతనం దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే జీ.ఓ.నెం.396 ను రద్దు చేసి రిజిస్ట్రేషన్ శాఖను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని, దస్తావేజు లేఖర్ల హక్కులు, ఉపాధికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర,జిల్లా దస్తావేజు లేఖర్ల సంఘం నాయకులు, సభ్యులు, పెద్ద సంఖ్యలో దస్తావేజు లేఖర్లు పాల్గొన్నారు.

## సదరం సర్టిఫికెట్ల జాప్యంపై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు

త్వరగా పరిష్కరించకపోతే ధర్నాకు దిగుతాం

లాంప్ కోఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో లాంప్ కోఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ దివ్యాంగుల సమ స్యలను జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్ నైడియా దేవి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 2025 ఆగస్టులో అమలాపురం ఏరియా ఆసుపత్రిలో దివ్యాంగులకు సదరం రీ-అసెస్‌మెంట్ నిర్వహించినప్పటికీ, ఇప్పటివరకు కొత్త సదరం సర్టిఫికెట్లు జారీ కాకపోవడంతో సంబంధిత లబ్ధిదారులు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందలేక తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయకర్త ( డిసిహెచ్ఎస్ )ను వెంటనే పిలిపించి, సమస్యను అత్యవసరం గా పరిష్కరించి సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం బడుగు సుబ్బాయమ్మ మాట్లాడుతూ, సదరం రీ-అసెస్‌మెంట్ జరిగి దాదాపు సంవత్సరం పూర్తవుతున్నా ఇప్పటికీ సర్టిఫికెట్లు సంబంధిత సచివాలయాలకు పంపించకపో వడం అత్యంత బాధాకరమన్నారు. ఈ నిర్లక్ష్యం వల్ల దివ్యాంగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో దివ్యాంగులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు, ధర్నాలకు దిగేందుకు సిద్ధంగా ఉన్నామని లాంప్ కోఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ హెచ్చరించారు.

# ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి జన్మదిన వేడుకలు

### ఘనంగా నిర్వహించిన చింతూరు మండల టీడీపీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్

ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం..



చింతూరులో రంపచోడవరం నియోజకవర్గ శాసనసభ్యురాలు, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీష దేవి జన్మదిన సందర్భంగా, చింతూరు మండల టీడీపీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సమాజ సేవకు ప్రాధాన్యత ఇస్తూ, ఒక గిరిజన మహిళకు జీవనోపాధి కల్పించే ఉద్దేశ్యంతో కుట్టు మిషన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మొహమ్మద్ జమాల్ ఖాన్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే శిరీష దేవి గిరిజనుల సంక్షేమం, మహిళల సాధికారత మరియు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. వారి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మం డల అధ్యక్షుడు ఎండి జహంగీర్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ్ నర్సింగరావు,, మార్కెట్ కమిటీ మెంబర్ సాల్మన్ రాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు తుర్రం చిన్నం ముత్తయ్య, తెలుగు మహిళా అధ్యక్షురాలు నాగ మంగ వేణి, మాజీ తెలుగు మహిళా అధ్యక్షురాలు కారం అచ్చమ్మ, యూనిట్ ఇన్చార్జ్ పొదిలి రామారావు, తెలుగు యువత అధ్యక్షుడు ఎండి రియాజ్, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి జగదీష్, బీసీ సెల్ అధ్యక్షుడు ముత్యాల శ్రీరామ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాఫర్, పేగ గ్రామ కమిటీ అధ్యక్షుడు సోడా శ్రీను, భూక్య మోహన్, చల్లా వెంకటేష్, మహిళా నాయకులు సత్యవతి, రాములమ్మ, టీడీపీ నాయకులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

### ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో సిటిజన్ క్యూఆర్ కోడ్‌లు ప్రదర్శించాలి

ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ వేదికలో సిటిజన్ క్యూర్ కోడ్ లు అన్ని శాఖల అధికారులు కార్యాలయంలో ప్రదర్శించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియా దేవి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి భవన్ నందు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో సేవలు పొందిన అనంతరం క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలను నమోదు చేయాలని ప్రజలకు సూచించారు. ఈ ఫీడ్‌బ్యాక్ ద్వారా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మారుతుందని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో సుమారు 230 అర్జీలను ఆమె స్వీకరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవి మాట్లాడుతూ ప్రజల సంతృప్తే అధికారుల పనితీరుకు గీటురాయని, సేవల నాణ్యతే సుపరిపాలనకు ప్రమాణమని అన్నారు. అర్జీల పరిష్కారంలో అధికారులు పూర్తి జవాబుదారీతనంతో వ్యవహరించాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అర్జీని నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని, అదే సమస్యపై మళ్లీ అర్జీలు రాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి పెట్టాలని అధికారులను



ఆదేశించారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా వచ్చిన అర్జీలను ప్రత్యేకంగా పరిశీలించి, అర్జీదారులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సంతృప్తికరమైన పరిష్కారం అందించాలని సూచించారు. ఫిర్యాదు పరిష్కారం అనంతరం జిల్లా స్థాయి అధికారులు స్వయంగా అర్జీదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని, పరిష్కారం సాధ్యం కాని సందర్భాల్లో కారణాలను స్పష్టంగా తెలియజేస్తూ ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలతో మర్యాదగా, నిబద్ధతతో వ్యవహరిస్తూ ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంపొందించేలా సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వి సుబ్బారావు, డిఆర్డిఏ డి రాంబాబు, డిప్యూటీ కలెక్టర్ కె. అచ్యుత కుమారి , డి ఎల్ డి వో లు యు.విజయ్ భాస్కర్, విజయం లక్ష్మి, డ్వామా పీడి జి. ఎస్ రామ్ గోపాల్ సమాచార పౌర సంబంధాల అధికారి సి. హెచ్. శ్రీనివాస్ జిల్లా అధికారులు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జగ్గిరెడ్డి వ్యాఖ్యల్లో పొంతన లేదు

### రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం: టీడీపీ నేతలు.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

ఖరీఫ్ సాగుకు కూటమి ప్రభుత్వం కాలువల ద్వారా సాగునీటిని సమర్థవంతంగా అందిస్తుంటే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పొంతనలేని వ్యాఖ్యలు చేస్తూ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని టీడీపీ నేతలు విమర్శించారు. రావులపాలెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి, జిల్లా అధికార ప్రతినిధి మాసాబత్తుల ఆనందరావుతో కలిసి మాట్లాడారు. వారు మాట్లాడుతూ, ఒక ప్రాంతంలో కాలువల్లో నీరు ఎక్కువగా వదులుతున్నారని, పంటలు మునిగిపోతున్నాయని ఆరోపిస్తూ, మరో ప్రాంతంలో నీరు అందడం లేదని చెప్పడం జగ్గిరెడ్డి మాటల్లోనే పొంతన లేకపోవడాన్ని స్పష్టం చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఎల్‌నీనో ప్రభావంపై శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నప్పటికీ, వాటిని పక్కనబెట్టి ప్రభుత్వంపైనే విమర్శలు చేయడం రాజకీయ దురుద్దేశమేనని పేర్కొన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్వయంగా నియోజకవర్గంలో కాలువలను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు ఇవ్వడాన్ని అభినందించాల్సింది పోయి, ఫోటోషూట్ కోసమే పర్యటన చేశారంటూ విమర్శించడం బాధ్యతారాహిత్యమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి నీటిపారుదల శాఖ మంత్రులు అనిల్ కుమార్ యాదవ్, అంబటి రాంబాబు కోనసీమ ప్రాంతాన్ని ఒక్కసారైనా సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకున్న దాఖలాలు లేవని గుర్తు చేశారు. రైతుల సంక్షేమాన్ని గతంలో ఎప్పుడూ పట్టించుకోని జగ్గిరెడ్డి ఇప్పుడు రైతులపై ప్రేమ చూపుతున్నట్లు నటిస్తూ, ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనిలో అవినీతి ఉందంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా మీడియా పాత్రపై కూడా స్పందించిన వారు, ఈనాడు పత్రిక ప్రభుత్వ పనుల్లో లోపాలను ఎత్తిచూపుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తుందని, అయితే సాక్షి పత్రిక మాత్రం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, అవినీతిని ప్రశ్నించకుండా కప్పిపుచ్చే ధోరణి అవలంబించిందని విమర్శించారు.




ప్రజలు వాస్తవాలను గుర్తించి అసత్య ప్రచారాలను నమ్మవద్దని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గుత్తుల పట్టాభిరామారావు, రావులపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి ప్రసాద్, యూనిట్ ఇన్‌చార్జి తోట రజని, బూత్ కన్వీనర్ అత్తిలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
కాకినాడ, తూర్పుగోదావరి 5
మంగళవారం 21 జూలై 2026

## కూటమి నిర్లక్ష్యం, ఇరిగేషన్ అవినీతితో

# కొత్తపేటలో రైతులు రెండువైపులా నష్టపోయారు

- వేసవి కెనాల్ క్లోజర్ పనుల్లో అవినీతి వల్లే ఖరీఫ్ సంక్షోభం
- ఫోటోషూట్లతో కాదు, రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి.
- ఇరిగేషన్ శాఖ అవినీతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలి.
- పంటలు మునిగిన రైతులకు వెంటనే నష్టపరిహారం ప్రకటించాలి.
- వాడపల్లి సైఫన్ నిర్మాణంపై విచారణ జరపాలి.
- సమస్యలు పరిష్కరించకపోతే ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో ఒకవైపు వేల ఎకరాల్లో వరి నారుమళ్లు, పంటలు మునిగిపోతుండగా, మరోవైపు శివారు ప్రాంతాల్లో సాగునీరు అందక భూములు ఎండిపోయి నెర్రెలు ఇస్తున్న దుస్థితికి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం, ఇరిగేషన్ శాఖ వైఫల్యం, వేసవి కాలువల నిర్వహణ పనుల్లో జరిగిన అవినీతే కారణమని జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. రైతుల సమస్యలపై స్పందిస్తూ ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం సంపద సృష్టిస్తామని చెప్పినా రైతులకు కనీస సాగునీరు కూడా అందించలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. కొత్తపేట నియోజకవర్గ రైతులు ఒక్క ఖరీఫ్ సీజన్‌లోనే సుమారు రూ.3,500 కోట్ల విలువైన పంటలను పండించే సామర్థ్యం కలిగి ఉన్నప్పటికీ, ప్రభుత్వం సరైన నీటి నిర్వహణ చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. గత వేసవిలో కాలువలు మూసివేసిన సమయంలో పూడికతీత, తూముల శుభ్రపరిచే పనులు, కాలువల్లో పేరుకుపోయిన మట్టి అడ్డంకుల తొలగింపు వంటి నిర్వహణ పనులు సక్రమంగా చేయకపోవడంతో, సాధారణంగా 11 వేల క్యూసెక్కుల నీటితో సాగాల్సిన ప్రాంతంలో 14,700 క్యూసెక్కులు విడుదల చేసినా చివరి ఆయకట్టుకు నీరు చేరలేదని ఆరోపించారు. ప్రస్తుతం వేల ఎకరాల్లో నారుమళ్లు మునిగిపోవడంతో రైతులు బ్యాంకుల్లో బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలతో సాగు కూడా చేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు శివారు ప్రాంతాల్లో నీరు అందక భూములు ఎండిపోతుండటంతో రైతులు రెండు వైపులా తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇటీవల కోనసీమ పర్యటనకు వచ్చిన ఇరిగేషన్ మంత్రి సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించకుండా నీరు ఉన్న ప్రాంతాల్లో ఫోటోషూట్లకే పరిమితమయ్యారని విమర్శించారు. రైతుల బాధలు తెలుసుకోవడం కంటే ప్రచారానికే ప్రాధాన్యం ఇచ్చారని, ఫోటోలకు బదులుగా ముంపు, ఎండలతో ఇబ్బందులు పడుతున్న రైతుల వద్దకు వెళ్లి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని డిమాండ్ చేశారు. వాడపల్లి వద్ద రూ.2.90 కోట్లతో నిర్మించిన సైఫన్ వల్ల ముంపు సమస్య తగ్గకపోగా మరింత పెరిగిందని ఆరోపించిన జగ్గిరెడ్డి, ఆ పనుల్లో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కాలువల నిర్వహణలో జరిగిన అవినీతిపై జిల్లా కలెక్టర్‌కు అధికారులు తప్పుడు నివేదికలు ఇచ్చారంటూ మీడియాలో వచ్చిన కథనాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. ప్రతి నియోజకవర్గానికి కోట్ల రూపాయలు కేటాయించామని ప్రభుత్వం చెబుతున్నట్లయితే, ఆ నిధులు ఎక్కడ ఖర్చయ్యాయో ప్రజలకు వెల్లడించాలని సవాల్ విసిరారు. అవసరమైతే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి బాధ్యులను గుర్తించాలని అన్నారు. నిజంగా పనులు జరిగి ఉంటే నేడు రైతులు ఈ దుస్థితిని ఎదుర్కొనాల్సిన అవసరం వచ్చేదే కాదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం రైతులకు యూరియా అందించడంలోనూ, సాగునీరు సమకూర్చడంలోనూ విఫలమైందని, అనేక ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు కూడా నెలకొన్నాయని విమర్శించారు. దేవాదాయ శాఖ భూములు సాగు చేస్తున్న రైతులు భారీ కౌలు చెల్లించి తెచ్చిన నారుమళ్లు కూడా నీటిలో కొట్టుకుపోతున్న పరిస్థితి దారుణమన్నారు. కాలువల గట్లపై ఆక్రమణలు తొలగిస్తామని చెప్పే ముందు కాలువల్లో పేరుకుపోయిన పూడిక, తూములు, లాకుల వద్ద పేరుకున్న మట్టిని తొలగించి సాగునీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఖరీఫ్ పంటలు ముంపునకు గురైన రైతులకు వెంటనే పూర్తి స్థాయి నష్టపరిహారం ప్రకటించాలని, ఇరిగేషన్ శాఖలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడించి భారీ స్థాయిలో ఆందోళన చేపడతామని చిర్ల జగ్గిరెడ్డి హెచ్చరించారు.

## అర్హులైన ఏ ఒక్కరూ ఓటు కోల్పోకుండా చూడాలి

సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బిఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలి

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దిశా నిర్దేశం.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంటున్నందున, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా, నకిలీ ఓట్ల తొలగింపు విషయంలో బిఎల్ఎలు అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దిశా నిర్దేశం చేశారు. రావులపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో ఆత్రేయపురం, రావులపాలెం పార్టీ నాయకులు, బిఎల్ఏ లతో సర్ పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు మృతుల ఓట్లు, శాశ్వత వలసదారుల ఓట్లు, గుర్తుతెలియని (అన్ ఐడెంటిఫైడ్) ఓట్లకు సంబంధించి జాబితాలను సమగ్రంగా పరిశీలించి అర్హులైన ఏ ఒక్కరూ ఓటును కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత బిఎల్ఎలపై ఉందన్నారు. నేటి నుంచి అందరూ ఈ అంశాలపై దృష్టి సారించాలన్నారు.

## విద్యార్థుల తల్లిదండ్రులకు స్టీల్ బాక్సుల బహుకరణ




ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పాలకొల్లు పట్టణ పరిధిలో గల జి .వి .ఎ స్ .వి .అ ర్ .ఎం మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ నందు "మెగా టీచర్స్ మీటింగ్" ను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా శుక్రవారం నాడు జరగబోయే మీటింగుకు ప్రముఖ డాక్టర్ లావణ్య హాస్పిటల్ అధినేత డాక్టర్ స్వరూప్ రు.5600 విలువగలస్టీలు బాక్సులు విద్యార్థుల తల్లిదండ్రులకు బహుకరించడానికి ముందస్తుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుల వారికి అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ స్వరూప్ గారు మాట్లాడుతూ "పిల్లల ఆరోగ్యం కోసం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి స్టీల్ బాక్సులు వాడాలి. మంచి ఆహారం, మంచి అలవాట్లతోనే స్వర్ణాంధ్ర సాధ్యం" అని తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవానీ ప్రసాద్ రాయపూడి డాక్టర్ స్వరూప్ గారి సేవలను కొనియాడారు. పిల్లల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరూ సహకరించి ఈ మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ విజయవంతం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలు దేవ గానుగుల వరలక్ష్మి. బాలి ఏడుకొండలు . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి. నందిని. లీల కుమారి పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొవాలని సూచించారు.లావణ్య హాస్పిటల్ అధినేత డాక్టర్ స్వరూప్‌లి గారిచే విద్యార్థి తల్లిదండ్రులకు స్టీల్ భోజన బాక్సులు బహుకరించడం జరుగుతుందని తెలిపారు.

## మద్రాస్ ఐఐటీలో సీటు సాధించిన రావులపాలెం రూరల్ సీఐ కుమారుడు రుచిత్ సాయికి ఘన సత్కారం

ఎస్పీ రాహుల్ మీనా, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభినందనలు.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

ప్రతిష్ఠాత్మక జేఈఈ మెయిన్స్-2026 పరీక్షలో ఆలిండియా 1001వ ర్యాంకు, ఏపీ ఈఏపీసెట్ (ఎంసెట్)లో 99వ ర్యాంకు సాధించి, దేశంలోని అత్యున్నత విద్యాసంస్థల్లో ఒకటైన ఐఐటీ మద్రాస్ లో సీటు దక్కించుకున్న రావులపాలెం రూరల్ సీఐ చి.హెచ్. విద్యాసాగర్ తనయుడు రుచిత్ సాయికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు శాఖ ఉన్నతాధికారులు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రుచిత్ సాయిని శాలువాతో సత్కరించి, ఘనంగా అభినందించారు. కష్టపడి చదివి జాతీయ స్థాయిలో విశిష్ట ఫలితాలు సాధించడం గర్వకారణమని కొనియాడారు. అదేవిధంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, అడిషనల్ ఎస్పీ ఎం. మహేంద్ర, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ తదితరులు రుచిత్ సాయిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అదే విధంగా ప్రతిభావంతుడైన తనయుడిని తీర్చిదిద్దిన సీఐ విద్యాసాగర్‌ను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రుచిత్ సాయి సాధించిన ఈ అరుదైన విజయం రావులపాలెం ప్రాంతానికే కాకుండా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు గర్వకారణమని పలువురు ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, విద్యావేత్తలు, స్థానికులు ప్రశంసించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే విజయాలు సాధించవచ్చని యువతకు రుచిత్ సాయి ఆదర్శంగా నిలిచారని అభిప్రాయపడ్డారు.



## ఉద్యోగుల సమస్యలపై మంత్రి నిమ్మల రామానాయుడుకి వినతిపత్రం సమర్పించిన జేఏసీ నాయకులు



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

రాష్ట్ర జలవనరుల శాఖ మాత్యులు నిమ్మల రామానాయుడుకి క్యాంప్ కార్యాలయం నందు జిల్లా జేఏసీ అధ్యక్షులు యూ వెంకట పాండు రంగారావు మరియు జేఏసీ నాయకులు ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రంతీ సమర్పించారు. ఈ సమస్యల్లో ప్రధానంగా పి ఆర్ సి కమిటీ వేసి ఐ ఆర్ ప్రకటించాలని.. పిఆర్సి ఏరియాస్ విడుదల చేయాలని. పెండింగ్ లో ఉన్న ఐదు డిఏలు విడుదల చేయాలని. హెల్త్ కార్డులు సక్రమంగా పనిచేసేలా చూడాలని. జిపిఎఫ్ ఎన్కాష్మెంట్ విడుదల చేయాలని. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం పెన్షన్ మంజూరు చేయాలని. గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీము మంజూరు చేయాలని. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని. సరెండర్ లీవ్ బకాయిలు విడుదల చేయాలని మంత్రివర్యులు రామానాయుడుకి తెలియజేయగా ఈ విషయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టిలో పెట్టి క్యాబినెట్ సమావేశంలో న్యాయం జరిగేలా చేస్తానని రామనాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో జేఏసీ అధ్యక్షులు ఉదిసి వెంకట పాండు రంగారావు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు.ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు పెన్మెత్స సాయి వర్మ.ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం.యుటిఎఫ్ జిల్లాప్రధానకార్యదర్శి పోలిశెట్టి క్రాంతి కుమార్. ఎం.వి రాజశేఖర్. డి ఏసుబాబు.ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్షులు రమణ. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులుకే.కామరాజు. జిల్లాఎన్జీవో నాయకులు పి.కుమార్ స్వామి.ఎ.ఎస్ ఎన్. మూర్తి.పాలకొల్లు జేఏసీ అధ్యక్షులు గుడాల హరిబాబు. జేఏసీ సెక్రెటరీ కె రాజశేఖర్ (యుటిఎఫ్) పాలకొల్లు ఎన్జీవోఅసోసియేట్ ప్రెసిడెంట్ కె బి కె రమేష్ రెడ్డి.పాలకొల్లు ఎన్జీ వో సెక్రటరీ గుబ్బల ప్రసాద్ పాలకొల్లు ఎన్ జీవో ట్రెజరర్ రామ కిరణ్మయి. జిల్లా పంచాయతీ సెక్రెటరీల సంఘం జిల్లా అధ్యక్షులు పాల శ్రీనివాసరావు. సచివాలయం ఉద్యోగులు మరియు ఎలమంచిలి. పోడూరు. పాలకొల్లు మండల స్థాయి ఉద్యోగ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ విజేతలో ఎస్‌పిఎల్ ఎన్నికలు

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తాళ్లపూడి లోని శ్రీ విజేత హై స్కూల్ లో సోమవారం ఎస్ పి ఎల్ ఎన్నికలు నిర్వహించారు. ప్రజాస్వామ్య భారత దేశంలో ఎన్నికలు రాజ్యాంగ బద్ధంగా ఏ విధంగా నిర్వహిస్తారో అదే మాదిరిగా ప్రధానోపాధ్యాయులు డా జె వి ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. నలుగురు విద్యార్థులు ఎస్ పి ఎల్ ఎన్నికలో నామినేషన్ దాఖలు చేసి, వారికి కేటాయించిన గుర్తులతో ప్రచారం నిర్వహించిగా పోలింగ్ రోజైన సోమవారం నాడు విద్యార్థులు తమ తమ ఓటర్ కార్డు తో వరుసగా వచ్చి ఎన్నికలో పాల్గొని తమకు నచ్చిన అభ్యర్థికి ఓట్ వేశారు. విద్యార్థులే పోలింగ్ సిబ్బందిగా వ్యవహరించిన ఈ ఎన్నికలో 85 మంది విద్యార్థులు తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. పోటీ చేసిన 4 గురు విద్యార్థులలో 9 వ తరగతి విద్యార్థి ఊసా వీరబాబు 57 ఓట్లు సాధించి ఎస్ పి ఎల్ గా ప్రమాణ స్వీకారం చేసాడు. అనంతరం జరిగిన కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు విద్యార్థి దశ నుండి అలవాటు చేసుకోవాలని, గెలుపు ఓటమి లను సమానంగా స్వీకరించే స్వభావాన్నీ ఈ ఎన్నికల ద్వారా నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమం లో విద్యార్థులు, పాఠశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



## కాజులూరు కాలేజీ విద్యార్థిని తనిషాకి "షైనింగ్ స్టార్" అవార్డు.

-కలెక్టర్ చేతుల మీదుగా ప్రధానం.




ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు

కాజులూరు జూనియర్ కాలేజీకి చెందిన షేక్ తనీషాకి "షైనింగ్ స్టార్" అవార్డు దక్కింది. ఈ మేరకు సోమవారం కాకినాడ టి.టి.డి. కల్యాణ మండపంలో జరిగిన "షైనింగ్ స్టార్" అవార్డు ఫంక్షన్ లో అవార్డు గ్రహీత షేక్ తనీషా హెచ్ ఈ సి గ్రూపులో 1000 మార్కులకు 897 మార్కులు తెచ్చుకున్న తనీషా కాకినాడ జిల్లా కలెక్టర్ కలెక్టరు హరిచంద్రప్రసాద్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డు సభకు హాజరైన పలువురు ప్రముఖుల సమక్షంలో అందుకుంది. దీంతో ఆవిద్యార్థినికి 20 వేలం రూపాయలు నగదు బహుమతి, ప్రశంసాపత్రంతో మెడల్ అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థిని తనిషాని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్ శ్రీనివాస్ , కళాశాల సిబ్బంది, విద్యార్థిని , విద్యార్థులు, గ్రామపెద్దలు తదితరులు అభినందించారు.

## గ్రామ స్థాయిలో ఎడ్ల గణేశ్వరరావు ఫౌండేషన్ కైలాస రధం సేవలు విస్తరణ పట్ల హర్షం

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

ఎడ్ల గణేశ్వరరావు ఫౌండేషన్ కైలాస రధం సేవలు గ్రామస్థాయిలో కూడా విస్తరణ చేస్తున్నందుకు గ్రామస్తులు అభినందనలు కృతజ్ఞతలు తెలియజేశారు. మేడపాడు గ్రామానికి 17 సంవత్సరాల క్రితం కృష్ణాజిల్లా కలిదిండి మండలం కాళ్ళపాలెం గ్రామం నుంచి వచ్చి మేడపాడు గ్రామంలో స్థిరపడిన బుద్ధన వెంకట కృష్ణారావు గ్రామంలో మెడికల్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఒక కుమారుడు కుమార్తె ఇరువురు జీవితంలో స్థిరపడినారు. ఆయన ఇటీవలకాలంలో షుగర్ వ్యాధితో వివిధ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటూ ఆదివారం సాయంత్రం స్వర్గస్తులైనారు. బంధువులు మిత్రులు సుధీర ప్రాంతాల్లో ఉండటం వలన రుద్రభూమికి తీసుకువెళ్లడానికి వైసీపీ నేత ఎడ్ల తాతాజీ ని సంప్రదించగా అప్పటికప్పుడు కైలాస రథాన్ని పంపి కార్యక్రమం జరగడానికి సహకరించినారు. ఈ విధమైన సామాజిక స్ఫూహతో ఎడ్ల గణేశ్వరరావు ఫౌండేషన్ వారు చేస్తున్న సేవలను కృష్ణ కుటుంబ సభ్యులు బంధువులు శ్రేయోభిలాషులు మరియు గ్రామస్తులు కొనియాడారు.



## రావులపాలెం ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

- అధికారులతో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమీక్ష
- అనధికార నిర్మాణాల తొలగింపునకు ఆదేశాలు.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

రావులపాలెం జాతీయ రహదారిపై రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధికారులతో సోమవారం కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో నేషనల్ హైవే, రెవెన్యూ, ఆర్ అండ్ బి, గ్రామ పంచాయతీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీకి కారణమవుతున్న అంశాలు, రహదారి ఇరువైపులా ఉన్న అడ్డంకులు, అనధికార నిర్మాణాల తొలగింపు, పార్కింగ్ నిర్వహణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ, రావులపాలెంలో ట్రాఫిక్ సమస్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సూచించారు. జాతీయ రహదారి వెంట ఉన్న అడ్డంకులు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను గుర్తించి చట్టబద్ధంగా తొలగించే చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శనివారం వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వేలాదిమంది భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. భక్తులు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సౌకర్యాలు, రహదారి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రావులపాలెం ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి అవసరమైన చర్యలను త్వరితగతిన అమలు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. సమావేశంలో నేషనల్ హైవే అధికారులు, రావులపాలెం తహసీల్దార్, ఆర్ అండ్ బి శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

మంగళవారం 21 జూలై 2026


## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం:జిల్లా జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



ప్రజా సమస్యలను వేగంగా, పారదర్శకంగా, నిబంధనల మేరకు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని రెవెన్యూ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ఎస్) రెవెన్యూ క్లినిక్ కార్యక్రమా లకు సంబంధించిన అర్జీలను ప్రజల నుండి జాయింట్ కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన ప్రతి ఫిర్యాదు అర్జీని పరిశీలించి సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం గడువులోగా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అలాగే భూసమస్యలపై ప్రత్యేక దృష్టినిసారించాలని, రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు వివాదాలు రికార్డుల్లోని తప్పులు, విస్తీర్ణవత్యాసాలు తదితర అంశాలపై వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని, భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంవహిస్తే చర్యలు తప్పవని జాగ్రత్తగా హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ1100 టోల్ ఫ్రీ సేవ ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత బాధ్యతతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రతి అర్జీదారులతో నేరుగా మాట్లాడిన తర్వాతే నివేదిక సమర్పించాలని మాట్లాడిన తేదీ సమయాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో మండలస్థాయి అధికారులు ఖచ్చితంగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో హాజరుకావాలని పెండింగ్ లో ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ప్రజల్లో 1100 సేవలపై మరింత అవగాహన కల్పించాలని సూచించారు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుండి వివిధ సమస్యలతో కూడిన 712 అర్జీలు వచ్చాయి. ఇందులో 427 పీజీఆర్ఎస్ అర్జీలు కాగా 285 దాకా రెవెన్యూ అర్జీలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఏ మాలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జున రెడ్డి, కిరణ్మయి జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జెఎన్టీయూ ఎన్టీఆర్ ఆడిటోరియంలో "షైనింగ్ స్టార్స్ - 2026" బహుమతి ప్రధానోత్సవ సభలో పాల్గొన్న: మంత్రి, ఎమ్మెల్యే



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం నగరంలోని జెఎన్టీయూ యూనివర్సిటీలో ఉన్న ఎన్టీఆర్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన "షైనింగ్ స్టార్స్ – 2026" బహుమతి ప్రధానోత్సవ సభలో పాల్గొన్న రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్, ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప, ఏపీ వీరశైవ లింగాయత్ వెల్ఫేర్ డెవలప్మెంట్ ఛైర్మన్ స్వప్న, ఆరె కటిక వెల్ఫేర్ ఛైర్మన్ హరికృష్ణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనరసింహమూర్తి, డిఈఓ బి.శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష ఏపిసి శైలజ, ఇంటర్మీడియట్ విద్య జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎస్విఎస్. గురువయ్య, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వెంకటరమణ నాయక్, ఆయా శాఖల అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పుట్లూరు మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించండి. ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించిన సిపిఐ మండల కార్యదర్శి డి పెద్దయ్య



ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండలంలోని గ్రామాలలో త్రాగునీటి సమస్య పరిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో అలివేలమ్మకు వినతి పత్రం సమర్పించడం జరిగినది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పెద్దయ్య మాట్లాడుతూ పుట్లూరు మండలంలోని చాలా గ్రామాలలో త్రాగునీరు సమస్య దాదాపు గత వారం రోజుల నుంచి ఉన్నది కానీ సంబంధిత అధికారులుతాగునీరు సమస్య పరిష్కరించకపోవడం దారుణం. గ్రామాలలో బోరు బావులలో నీళ్లు ఉన్న నీళ్లు అందించకపోవడం చాలా దారుణం. అరకట వేముల గ్రామంలో దాదాపు పది రోజులుగా కాలనీలో త్రాగునీరు రావడం లేదు. గండికోట ప్రాజెక్టు పైప్ లైన్ పనిచేయకపోవడం వలన నీరు రాలేదని చెప్పడంతో ప్రజలు సొంత డబ్బు వెచ్చించి ట్యాంకర్లతో నీళ్లు తోలుకొని ఒక్కొక్క ట్యాంకర్ కు 600 రూపాయలు బాడుగ చెల్లించడం జరుగుతున్నది. గత మూడు రోజుల నుంచి గండికోట ప్రాజెక్టు పైపు లైన్ పరిష్కారమైనప్పటికీ , కొన్ని గ్రామాలలో కాలనీలకు నీళ్లు ఇప్పటికి కూడా సరఫరా కావడం లేదు. కావున వెంటనే ప్రభుత్వశీ సంబంధిత అధికారులు స్పందించి త్రాగునీరు సమస్య పరస్కరించాలని, అలాగే నీళ్లు రాని కాలనీలోని ఆర్ డి టి సమస్థ వేసిన బోరు నుంచి పైప్ లైన్ సపరేట్ వేసి నీళ్లు అందని కాలనీలకునీళ్లు అందేటట్టు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అధికారులను కోరుతున్నాం. లేనిపక్షంలో కాలనీ వాసులతో కలిసి రోడ్డు మీద ఆందోళన చేయాల్సి వస్తుందని సంబంధిత అధికారులను హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి, బాలు, డి హెచ్ పి ఎస్, అధ్యక్ష కార్యదర్శులు, పెద్దన్న, రాఘవేంద్ర, దేవరాజు, నడిపి నారాయణ, రామాంజనేయులు, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణ రెడ్డి



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా రామకృష్ణ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కమిషనర్ రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతమైన పాలన అందించేందుకు కృషి చేస్తానన్నారు. అన్ని వార్డుల్లో ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. మున్సిపల్ సిబ్బందితో సమన్వయంగా పనిచేస్తూ, ప్రజా శ్రేయస్సే పరమావధిగా సేవలందిస్తానని పేర్కొన్నారు. పట్టణ పరిశుభ్రత, తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు.

## పల్లె పల్లెకు బీఎస్పీని విజయవంతం చేద్దాం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పల్లె పల్లెకు బీఎస్పీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తొలుత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ నాయకులు సుబ్బరాయప్ప చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, సుబ్బరాయప్ప పార్టీకి దీర్ఘకాలికంగా సేవలు అందించి ఇటీవలనే అనారోగ్యానికి గురై మృతి చెందడం తీరని లోటని పేర్కొన్నారు. పల్లె పల్లెకు బీఎస్పీ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నాయకులందరూ ఐకమత్యంగా నిర్వహించాలన్నారు. అనంతరం పల్లె పల్లెకు బీఎస్పీ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కన్వీనర్ గా ఎం.అనిల్ కుమార్, గ్రామకోకన్వీనర్ గా ఎం.శివ, బివిఎఫ్ కన్వీనర్ గా ఎం. చంద్రశేఖర్, భీవైఎఫ్ కన్వీనర్ గా పెయింటర్ ఆంజనేయులును ఎన్నుకున్నారు. గ్రామాల్లో డ్రైనేజీలు, రోడ్లు, దళితుల స్మశాన వాటికలకు రహదారి సౌకర్యం వంటి అంశాలపై ప్రభుత్వ అధికారులు దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి మండల కమిటీ ఉపాధ్యక్షులు కొండప్ప, నియోజకవర్గ అధ్యక్షులు చౌళూరు రామాంజనేయులు, నాయకులు కొట్నూరు గంగప్ప, స్టూడియో గంగాధర్, స్థానిక నాయకులు లక్ష్మీనరప్ప, రామాంజప్ప, క్రిష్టప్ప, నరసింహప్ప, గంగాధర్, నారాయణప్ప, సతీష్, వెంకటరాముడు, చలపతి,జగదీష్, నరసింహమూర్తి, రామాంజినప్ప తదితరులు పాల్గొన్నారు.



## పీజీఆర్ఎస్ లో 130 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ పి.జగదీష్

### గడువులోగా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



జిల్లా ప్రజల సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్' కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని బాధితుల నుండి 130 పిటీషన్లను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన ప్రతి అర్జీదారుడి సమస్యను ఆయన ఓపికగా విన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీలు ఎం నాగభూషణం, ఎస్ మహబూబ్ బాషాలు కూడా పాల్గొని అర్జీల స్వీకరణలో భాగస్వాములయ్యారు. అక్కడికక్కడే ఫోన్ లైన్లో ఆదేశాలు కేవలం అర్జీలు తీసుకోవడమే కాకుండా, సమస్యల తీవ్రతను బట్టి జిల్లా ఎస్పీ తక్షణమే స్పందించారు. అక్కడికక్కడే ఫోన్ ద్వారా సంబంధిత క్షేత్రస్థాయి పోలీస్ అధికారులతో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు.?నిర్ణీత గడువులోగా పరిష్కారం బాధితుల ఫిర్యాదులపై తక్షణమే చట్టప్రకారం విచారణ జరపాలని, నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులను ఎస్పీ ఆదేశించారు. జవాబుదారీతనంతో వ్యవహరించాలి వచ్చిన ప్రతి పిటిషనర్‌కు న్యాయం జరిగేలా చూడటం పోలీసుల ప్రాథమిక బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత జవాబుదారీతనంతో వ్యవహరించాలని, బాధితులను ఇబ్బందులకు గురిచేయకుండా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. అర్జీదారులకు భోజన సదుపాయం దూర ప్రాంతాల నుండి వచ్చే అర్జీదారుల సౌకర్యార్థం జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇస్కాన్ సంస్థ సహకారంతో పీజీఆర్ఎస్‌కు విచ్చేసిన బాధితులకు, వారి సహాయకులకు పోలీస్ అధికారులు భోజన సౌకర్యాన్ని కల్పించారు. ఎస్పీ ఆదేశాల మేరకు అధికారులు ఈ భోజన వసతిని స్వయంగా పర్యవేక్షించారు. పోలీసుల స్పందన, మానవీయ తీరు పట్ల అర్జీదారులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు.

## 12 ఏళ్లుగా అదే వేతనం.. సహాయ నిరాకరణకు ఎంపీఈఓల నిర్ణయం

ప్రజాభూమి, ముదిగుబ్బ





వ్యవసాయ శాఖలో మల్టీపర్పస్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్లుగా (ఎంపీఈఓలు) గత 12 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు కల్పించకపోవడంతో సహాయ నిరాకరణ చేపట్టనున్నట్లు ఎంపీఈఓలు తెలిపారు. ఈ మేరకు మండల వ్యవసాయ అధికారి రవీంద్రకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీఈఓలుగా పనిచేస్తున్న తమకు నియామకం జరిగిన నాటి నుంచి ఇప్పటివరకు నెలకు రూ.12 వేల వేతనం, రూ.3 వేల ఇన్సెంటివ్ మాత్రమే అందుతున్నాయని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని గత పదేళ్లుగా ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక నాలుగు నెలలుగా వేతనాలు కూడా అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని తెలిపారు. ఉద్యోగ భద్రతతో పాటు వేతనాల పెంపుపై ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడంతో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు సహాయ నిరాకరణ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం సూత్రం ప్రకారం నెలకు రూ.35 వేల వేతనం అమలు చేయడం, శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించడం, నాన్ బ్యాంక్ పోస్టులను శాశ్వత పోస్టులుగా మార్చడం, ఈహెచ్ఎస్ (ఈహెచ్ఎస్) ఆరోగ్య కార్డుల సౌకర్యం కల్పించడం, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయడం, పాత సీపీఎస్ (ఓల్డ్ సిపిఎస్) విధానాన్ని అమలు చేయడం వంటి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు.

## ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

### -జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి రాజశేఖర్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న రిమాండ్ ఖైదీల కోసం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని సంబంధిత సంస్థ కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపకారాగారంలో రికార్డులను పరిశీలించి రిమాండ్ ఖైదీలతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పటి నుండి కారాగారంలో ఉంటున్నారు, బెయిల్ మంజూరు అయిందా, జామీను దారులు ఉన్నారా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉప కారాగార సిబ్బంది వ్యవహార శైలి, భోజన నాణ్యత, వైద్య సదుపాయం తదితర అంశాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని రిమాండ్ ఖైదీలు తెల్లకాగితంపై దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వపరంగా ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని తెలిపారు. అలాంటి రిమాండ్ ఖైదీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా ఉపకారాగారంలో అధికారులు వివక్ష ప్రదర్శిస్తుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తప్పులు చేసి జైళ్లకు రావద్దని, తద్వారా ఎన్నో ఇబ్బందులకు గురికావాల్సి ఉంటుందని సూచించారు. అనంతరం ఆయన జైలు గదులు, నిత్యావసరాలు, వంటగది, తాగునీటి నాణ్యత తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపకారాగారాధికారి హనుమప్ప, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనంత గోపాలకృష్ణ, న్యాయవాదులు పార్వతి, శ్రీలేఖ, యశస్విని, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వసతి గృహాల సమస్యలను పరిష్కరించాలి

### -ఏ.ఎస్.డబ్ల్యూ.ఓ కార్యాలయం ముందు ఏఐఎస్ఎఫ్ ధర్నా

ప్రజాభూమి, హిందూపురం టౌన్



ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏ.ఎస్.డబ్ల్యూ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి మాట్లాడుతూ, హిందూపురం పట్టణంలోని కళాశాల బాలికల వసతి గృహానికి సొంత భవనం నిర్మించాలని, శిథిలావస్థకు చేరుకున్న బాలుర కళాశాల హాస్టల్ భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. అదే విధంగా ముక్కడిపేట లోని బీసీ బాలుర హాస్టల్‌కు చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, హాస్టల్ విద్యార్థులకు బెడ్‌లు, బెడ్‌షీట్లు, ట్రంకు పెట్టెలు వంటి మౌలిక అవసరమైన వస్తువులను వెంటనే అందించాలన్నారు. కనీస సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పట్టణంలోని బీసీ, ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహానికి ఇప్పటికీ సొంత భవనం లేకపో వడం బాధాకరమన్నారు. అద్దె భవనాల్లో విద్యా ర్థినులు ఉం డాల్సిన పరిస్థితి నెలకొనడం వల్ల భద్రత, విద్యాభ్యాసంపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. వెంటనే శాశ్వత భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థకు చేరుకున్న బీసీ బాలుర కళాశాల హాస్టల్ భవనం ప్రమాదకరంగా మారిందని, ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నందున అత్యవసరంగా మరమ్మతులు చేపట్టాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో కాస్మోటిక్ ఛార్జీలు ప్రస్తుతం ఏమాత్రం సరిపోవడం లేదని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా వాటిని పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, బద్రీ, దేవా, సునీల్, మనోజ్, కలందర్, కలీం, తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ ప్రిన్సిపాల్ ప్రగతికి ఘన సన్మానం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విశిష్ట సేవలందించిన ప్రగతిని సోమవారం కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ప్రిన్సిపాల్ ప్రగతి బదిలీపై అనంతపురం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కళాశాల అసిస్టెంట్ నరసింహులు ఆధ్వర్యంలో జరిగిన సన్మానంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, సప్తగిరి కళాశాల మాజీ సీఈవో ఈశ్వర్ రెడ్డి, న్యాయవాదులు శ్రీనివాస్ రెడ్డి, సిద్దు, వ్యాపారవేత్తలు పుల్లారెడ్డి, రామకృష్ణ, రంగప్ప పాల్గొని ప్రిన్సిపాల్ ప్రగతి సేవలను కొనియాడారు. కళాశాల అభివృద్ధికి, విద్యార్థినుల విద్యా పురోగతికి, క్రమశిక్షణకు, విద్యా ప్రమాణాల పెంపుకు ఆమె చేసిన విశేష కృషిని ప్రశంసించారు. అనంతరం శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. అనంతపురంలో కూడా ఆమె తన సేవలను విజయవంతంగా కొనసాగించాలని, మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## షైనీస్టార్ అవార్డు అందుకున్న బాలయేసు విద్యార్థిని




ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలోని బాలయేసు జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎం. శ్రావణి షైనీ స్టార్ అవార్డు అందుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన అవార్డుకు కళాశాలకు చెందిన శ్రావణి గత ఏడాది ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఎం.పి.సి విభాగం నుండి 986 అత్యున్నత మార్కులు సాధించింది. దీంతో ఆమె షైనీస్టార్ అవార్డుకు ఎంపిక కాగా సోమవారం కొత్తచెరువులో జరిగిన కార్యక్రమంలో ఎం. శ్రావణికి బి.సి. సంక్షేమ, చేనేత శాఖ మంత్రి సవితమ్మ, పుట్టపర్తి శాసనసభ్యులు పల్లె సింధూర, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, మాజీ ప్రభుత్వ విప్ పల్లె రఘునాథ రెడ్డి చేతుల మీదుగా బంగారు పతకం, రూ. 20 వేల నగదు తో పాటు ప్రశంసా పత్రాన్ని అందించారు. కాగా కళాశాలకు చెందిన విద్యార్థిని శ్రావణి షైనీ స్టార్" అవార్డును అందుకోవడం స్ఫూర్తిదాయకమని కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ ఎం.శౌరి రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

# ప్రత్యేకహోదా సాధనకు పట్టు పట్టాలి

## - పార్లమెంట్ సభ్యులకు తులసిరెడ్డి సూచన



ప్రజాభూమి, వేంపల్లె

రాష్ట్రానికి సంజీవని వంటి ప్రత్యేకహోదా సాధించేందుకు పార్లమెంట్ సభ్యులు పట్టు పట్టాలని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డా. ఎన్. తులసిరెడ్డి సూచించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో రాష్ట్రానికి చెందిన సభ్యులు ప్రత్యేకహోదా అమలుకు కృషి చేయాలన్నారు. ప్రత్యేకహోదా అమలు ద్వారా ఉపాధిహామీ, సర్వశిక్ష అభియాన్ తదితర కేంద్ర ప్రాయోజిత పథకాలపై కేంద్రం 90 శాతం నిధులు భరిస్తుందన్నారు. అలాగే అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంక్ తదితర విదేశీ ఆర్థిక సంస్థల సహాయంతో అమలవుతున్న పథకాలకు 90-100 శాతం మేర నిధులు కేంద్రం భరిస్తుందన్నారు. అస్సాం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మిజోరం, మణిపూర్, త్రిపుర, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ప్రత్యేకహోదా అమలవుతోందన్నారు. 2014, ఫిబ్రవరి 20న అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఏపి రాష్ట్రానికి ఐదేళ్ల పాటు ప్రత్యేకహోదా అమలు చేస్తామని ప్రకటించారన్నారు. మార్చి 1న ప్రత్యేకహోదాపై తీర్మానం చేసి అమలు చేయాలని ప్రణాళిక సంఘాన్ని ఆదేశించినట్లు తెలిపారు. ఆ తర్వాత బీజేపీ అధికారంలోకి వస్తే పదేళ్ల పాటు ప్రత్యేకహోదా అమలు చేస్తామని మేనిఫెస్టోలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చి 12 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ప్రత్యేకహోదా అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రంలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం దీనిపై ఛాలెంజ్ గా తీసుకుని ప్రత్యేకహోదా అమలు సాధనకు కృషి చేయాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# జీవో 396 రద్దు చేయాలి: పులివెందుల దస్తావేజులేఖరుల పెన్‌డౌన్ ఆందోళన

## పి పి పి విధానం వద్దు: దస్తావేజులేఖరుల రాష్ట్రవ్యాప్త నిరసన



ప్రజాభూమి,పులివెందుల,

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 396ను వెంటనే రద్దు చేయాలని పులివెందుల దస్తావేజు లేఖరులు డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ అయిన పి పి పి విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తు జూలై 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా పులివెందుల ప్రాంతానికి చెందిన దస్తావేజు లేఖరులు కలిసి సోమవారం స్థానిక సిఐ గారికి వినతిపత్రం సమర్పించారు. లేఖరులు మాట్లాడుతూ జీవో నెం. 396 అమలులోకి వస్తే వేలాది మంది దస్తావేజు లేఖరులు తమ జీవనోపాధిని కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్న తమను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన చెందారు. పి పి పి విధానం వల్ల ప్రజల ఆస్తులకు కూడా భద్రత తగ్గుతుంది. ప్రజలు తమ భూములు, ఆస్తులను కోల్పోయే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది అని వారు పేర్కొన్నారు..కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో నెం. 396ను రద్దు చేయాలని, దస్తావేజు లేఖరుల ఉపాధితో పాటు ప్రజల ఆస్తులకు సంపూర్ణ భద్రత కల్పించాలని కోరారు.ఈ ఉద్యమానికి ప్రజలు మద్దతు ఇచ్చి సహకరించాలని దస్తావేజు లేఖరులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జగన్మోహన్,బసవరాజు,ప్రసాద్, శివ,అమీర్ భాష,రామాంజి, వి జి వల్లి, భార్గవ, దత్తు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# బిదనంచెర్ల వద్ద పీబీసీ కాలువలను పరిశీలించిన మారెడ్డి జోగిరెడ్డి



ప్రజాభూమి, పులివెందుల

సింహాద్రిపురం మండలంలోని బిదనంచెర్ల గ్రామంలో చిత్రావతి రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలు వస్తున్న నేపథ్యంలో తుంగభద్ర ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి గారు కడప జిల్లా జలవనరుల శాఖ అధికారులతో కలిసి సోమవారం పీబీసీ కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జోగిరెడ్డి మాట్లాడుతూ చిత్రావతి రిజర్వాయర్ నుంచి వస్తున్న కృష్ణా జలాలు రైతులకు సకాలంలో అందేలా పీబీసీ కాలువల ద్వారా నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కాలువల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.జలవనరుల శాఖ అధికారులు మాట్లాడుతూ, పీబీసీ కాలువల ద్వారా నీటి ప్రవాహం సజావుగా కొనసాగుతోందని, నీటి పంపిణీ వ్యవస్థను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన సాంకేతిక చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ పరిశీలనలో కడప జిల్లా జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ (సి ఈ ) బాలచంద్రారెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ ఈ )రమేష్, డిప్యూటీ ఇంజనీర్ (డి ఈ ) శ్రీనివాస్,ఈ ఈ వెంకటేశ్వర్లు అసిస్టెంట్ ఇంజనీర్లు ( ఏ ఈ ఎస్ )తో పాటు సంబంధిత అధికారులు , టీడీపీ నాయకులు రామిరెడ్డి ప్రకాష్ రెడ్డి, కందుల ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రతిభతో మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలి

## - కరస్పాండెంట్ బిఎస్. రమణారెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

విద్యార్థులు చదువుల్లో రాణించి తమ ప్రతిభతో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని స్థానిక ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బిఎస్. రమణారెడ్డి వెల్లడించారు. సోమవారం కడపలోని మాధవి కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డును కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చేతుల మీదుగా విద్యార్థిని షేక్ అఫ్సాన్ రూ.20 వేల చెక్కుతో పాటు మెడల్, ప్రశంస పత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలతో చదువుల్లో రాణించి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ఆదర్శంగా నిలవాలని కోరారు. తమ పాఠశాల విద్యార్థిని సాధించిన విజయం పట్ల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

# ఆర్టీసీ ఆస్తులు ప్రైవేటీకరణ వద్దు

## 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలి ఏపీపీటీడీ జేఏసీ నాయకులు



ప్రజాభూమి పులివెందుల

ఆర్టీసీ ఆస్తుల ప్రైవేటీకరణ వెంటనే నిలిపివేయాలని, 11వ పిఆర్సి బకాయిలను చెల్లించాలని ఏపీపీటీడీ జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏపీ పిటిడి జేఏసీ నాయ కులు స్థానిక బాకరాపురంలోని వైయస్ జగన్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు అలాగే ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి సతీమణి ఉమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమ స్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. అనంతరం జేఏసీ నాయకులు యు ఆర్ సి రెడ్డి, ఎం ఎం రెడ్డి లు మాట్లాడుతూ ఎలక్ట్రిక్ బస్సులను ఏపీఎస్ఆర్టీసీ ద్వారానే కొనుగోలు చేసి సంస్థ ద్వారా నడపాలని , 11వ పి అర్ సి బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. 12వ పి ఆర్ సి కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు.స్త్రీ శక్తి పథకం విజయవంతం చేయుటకు 4000 బస్సులను కొనుగోలు చేసి, 1000 ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. 05 పెండింగ్ డి ఎ లను వెంటనే చెల్లించాలన్నారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.



# రోడ్డు ప్రమాద బాధితుడికి అండగా నిలిచిన పులివెందుల డీఎస్పీ బి. మురళీ

## మానవత్వం చాటిన డీఎస్పీ: గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స



ప్రజాభూమి,పులివెందుల

మానవత్వంతో ఆదుకున్న పోలీసు అధికారి అంటూ పులివెందుల డీఎస్పీ బి. మురళిపై స్థానికులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.కడప రోడ్డులోని కొత్తపల్లి గ్రామ సమీపంలో కొత్తపల్లికి చెందిన ప్రశాంత్ తన వాహనంపై వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కిందపడిన ప్రశాంత్‌కు తీవ్ర రక్తస్రావ గాయాలు అయ్యాయి.అదే సమయంలో అటుగా వెళ్తున్న పులివెందుల డీఎస్పీ బి. మురళీ వెంటనే తన వాహనాన్ని ఆపారు. బాధితుడికి అక్కడికక్కడే ప్రథమ చికిత్స అందించడంతో పాటు తాగునీరు అందించారు.అనంతరం ఆలస్యం చేయకుండా తన సొంత వాహనంలోనే ప్రశాంత్‌ను వేంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడి బాధితుడికి వెంటనే చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు.డీఎస్పీ బి. మురళి చూపిన సమయస్ఫూర్తి, మానవతా దృక్పథాన్ని స్థానికులు, ప్రజలు అభినందిస్తున్నారు.

# వర్షాలు పడాలని కోనేరప్ప స్వామికి ప్రత్యేక పూజలు

## -భక్తులకు అన్నదానం



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల మండలం పరిధిలోని నల్లగొండ వారి పల్లె గ్రామ సమీపంలో కొలువై ఉన్న కోనేరప్ప స్వామికి సోమవారం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ ప్రజలు కోనేరప్ప స్వామిని దర్శించుకుని కార్యకర్తరము సమర్పించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వకాలం నుండి వర్షాలు సకాలంలో పాడినప్పుడు కోనేరప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తే ఇక్కడ వర్షాలు సకాలంలో కురుస్తాయని పూర్వీకుల నమ్మకం అన్నారు. అందులో భాగంగానే ఇప్పుడు వర్షాలు పడక రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో కోనేరప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించాలని వారు తెలిపారు. ఈ పూజలు నిర్వహించడం వలన సకాలంలో వర్షాలు పడి రైతులు సుభిక్షంగా ఉంటారని గ్రామ ప్రజల నమ్మకం అన్నారు. కోనేరప్ప స్వామికి పూజలు నిర్వహిస్తే తప్పకుండా వర్షాలు పడతాయన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి

## - ప్రేమతరు కార్యక్రమంలో కన్వీనర్ కుంచా సాయినాథ్ పిలుపు



ప్రజాభూమి, వేంపల్లె

శ్రీ సత్యసాయి బాబా దివ్యాశీస్సులతో శ్రీ సత్యసాయి సేవా ఆర్గనైజేషన్స్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రేమతరు కార్యక్రమాన్ని స్థానిక పట్టణంలో నిర్వహించినట్లు వేంపల్లె మండల శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కుంచా సాయినాథ్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం ఆవరణతో పాటు గండి రోడ్డులోని శ్రీకృష్ణ ఆలయ ఆవరణలో సేవా సమితి సభ్యులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కుంచా సాయినాథ్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ శ్రీ సత్యసాయి సేవా ఆర్గనైజేషన్స్ సూచనల మేరకు పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సంరక్షణ, సమాజ శ్రేయస్సు లక్ష్యంగా ప్రేమతరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని, భావితరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ నరసింహులు, వెటర్నరీ ఏడీ రవీంద్రనాథ్, పులివెందుల ఏపీఎం గురురాజు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పుల్లగూర గోవర్ధన్, శివకిరణ్, శివరంజని, సునీత తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల గుర్తింపునకు విద్యార్థులే కీలకం

## - కరస్పాండెంట్ కె. నారాయణ రెడ్డి

## - కలెక్టర్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్స్ అవార్డులు



ప్రజాభూమి, వేంపల్లె

పాఠశాల గుర్తింపునకు విద్యార్థులే కీలకమని స్థానిక నారాయణ విద్యా సంస్థల కరస్పాండెంట్ కె.నారాయణ రెడ్డి వెల్లడించారు. సోమవారం కడపలోని మాధవి కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డులను నారాయణ విద్యా సంస్థకు చెందిన విద్యార్థినిలు కె.కీర్తన, డి.కీర్తనలు అందుకున్నారు. ఈ అవార్డులను కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చేతుల మీదుగా ప్రధానం చేశారు. రూ.20 వేల చెక్కుతో పాటు సర్టిఫికేట్, మెడల్స్ లను విద్యార్థినిలకు పంపిణీ చేశారు. పదోతరగతి -2026 ఫలితాల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థినిలు కె.కీర్తన(587), డి.కీర్తన(579) అత్యుత్తమ ప్రతిభతో విజయాన్ని సొంతం చేసుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ కె.నారాయణ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డులను తమ విద్యార్థినిలు దక్కించుకోవడం సంతోషకరమన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్య సాధన దిశగా అడుగులు వేసి భవిష్యత్ లో ఉన్నతమైన స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్జేడి శ్యాముల్, డిఇఓ షంషుద్దీన్, ఆర్ఐఓ పట్నాయక్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ భానుప్రకాష్, ఎంఇఓ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ కమిషనర్ శివ తనూజను మర్యాదపూర్వకంగా కలిసిన ఉర్దూ అకాడమీ డైరెక్టర్



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పురపాలక సంఘ నూతన కమిషనర్‌గా శివ తనూజ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్టేట్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసిం వల్లి కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారు పుష్పగుచ్ఛం, నోట్‌బుక్కులు, పెన్నులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ శివ తనూజ మాట్లాడుతూ పులివెందులలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పులివెందుల ప్రజలకు మేలు జరిగే విధంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో అందరి సహకారం అవసరం. మీరు అందరూ సహకరించాలని" కమిషనర్ కోరారు.కమిషనర్ చొరవతో పులివెందుల మరింత అభివృద్ధి చెందుతుందని ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# దళిత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం: జగన్ మోహన్ రాజు

## పెద్దపల్లె సర్వే నం.937 భూముల సమస్యపై రైతులతో సమావేశం



ప్రజాభూమి, సిద్దవటం: పెద్దపల్లె సర్వే నం.937 భూముల సమస్యకు చట్టబద్ధ పరిష్కారం చూపించి దళిత రైతులకు న్యాయం చేస్తామని రాజంపేట టీడీపీ ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు హామీ ఇచ్చారు. రాజంపేట టీడీపీ అధికార ప్రతినిధి చలపాటి చంద్ర ఆధ్వర్యంలో ఆదివారం సిద్దవటం మండలం మాధవరం-1 గ్రామంలోని ఎస్‌కేఆర్ నగర్ హరిజనవాడకు చెందిన దళిత రైతులతో ఆయన నివాసంలో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు చలపాటి చంద్ర ఆధ్వర్యంలో కార్యకర్తలు డప్పు వాయిద్యాలు, బాణాసంచాతో జగన్ మోహన్ రాజుకు ఘన స్వాగతం పలికి, గజమాల వేసి శాలువాతో సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో ఆక్రమణకు గురైన భూములను గుర్తించి చట్టపరమైన చర్యల ద్వారా దశలవారీగా పేదలకు పంపిణీ చేస్తామని తెలిపారు. పెద్దపల్లె సర్వే నం.937 భూముల సమస్యను కూడా చట్టబద్ధంగా పరిష్కరించి దళిత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ముద్దు కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎద్దల విజయ్ సాగర్, రాష్ట్ర వాణిజ్య అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి వీరనాల రామచంద్ర పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జూదంపై పోలీసుల దాడి.. నలుగురు అరెస్ట్, నగదు స్వాధీనం



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని వంతాటిపల్లి ఎస్సీ కాలనీ సమీపంలో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.14,066 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సిద్ధవటం ఎస్ఐ హారిక తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ, కడపకు చెందిన నలుగురు వ్యక్తులు జూదం ఆడుతున్నట్లు అందిన రహస్య సమాచారంతో పోలీసు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఘటన స్థలంలో జూదం ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.14,066 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ దాడిలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం..

## యూట్యూబర్‌కు తీవ్ర గాయాలు



ప్రజాభూమి, సిద్ధవటం: కడప-చెన్నై జాతీయ రహదారిపై జేఎంజే కళాశాల సమీపంలోని కోతుల మోరి వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్ధవటం మండలం మాధవరం-1 గ్రామపంచాయతీ వెంకటేశ్వరాపురం గ్రామానికి చెందిన '999 ఇండియా' యూట్యూబర్ జయకృష్ణ తీవ్రంగా గాయపడ్డారని ఎస్ఐ హారిక తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. జయకృష్ణ కడప నుంచి కారులో తన స్వగ్రామమైన మాధవరానికి వెళ్తుండగా, రాజంపేట వైపు నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ హారిక తెలిపారు.

# ఎన్యుమరేషన్ గడువు మరో 10 రోజులు పొడిగింపు

## డిఎల్వోలతో తహసీల్దారు విజయ్ కుమార్



ప్రజాభూమి, సిద్ధవటం: ఓటర్ల ఎన్యుమరేషన్ ప్రక్రియ గడువును మరో 10 రోజుల పాటు పొడిగించినట్లు సిద్ధవటం మండల తహసీల్దార్ విజయకుమార్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీఎల్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 14వ తేదీ నుంచి ఎన్యుమరేషన్ గడువును మరో 10 రోజులు పొడిగించినట్లు తెలిపారు. డీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్లను గుర్తించి, వారికి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై విద్యార్థినులకు ఎస్ఐ హారిక అవగాహన



ప్రజాభూమి, సిద్ధవటం: ప్రతి విద్యార్థిని సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిద్ధవటం ఎస్ఐ హారిక సూచించారు. కడప జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం సిద్ధవటంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహంలో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హారిక మాట్లాడుతూ, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే క్రమశిక్షణతో పాటు అప్రమత్తత కూడా అవసరమని తెలిపారు. సైబర్ మోసాలకు గురికాకుండా వ్యక్తిగత వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100కు ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కిట్లను విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ లీలావతి, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులకు "షైనింగ్ స్టార్స్" నిదర్శనం

- 258 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రధానం చేసిన మంత్రి
- జిల్లా ఇన్‌చార్జి మరియు రాష్ట్ర రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్
- విద్యార్థుల ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడమే సమాజ ప్రగతికి అసలైన పునాది
- జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్







ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి, విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులకు షైనింగ్ స్టార్స్ నిదర్శనమని జిల్లా ఇన్‌చార్జి మరియు రాష్ట్ర రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం స్థానిక శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించిన "షైనింగ్ స్టార్స్--2026" ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా, విద్యార్థుల విజయోత్సాహంతో పండుగ వాతావరణంలో జరిగింది. తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి మరియు రాష్ట్ర రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, రైల్వే కోడూరు, సూళ్లూరుపేట,ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, అరవ శ్రీధర్, నెలవల విజయశ్రీ, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్, ఆర్.ఐ.ఓ గోపాల్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు నరసింహ యాదవ్, సి.ఆర్. రాజన్, సదాశివం, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... విద్యావంతుడు, దూరదృష్టి కలిగిన నాయకుడు విద్యాశాఖ మంత్రిగా ఉంటే విద్యారంగంలో ఎంతటి మార్పులు సాధ్యమవుతాయో "షైనింగ్ స్టార్స్" కార్యక్రమమే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఒకప్పుడు దేశంలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్ర విద్యా వ్యవస్థ గత ప్రభుత్వ హయాంలో వెనుకబడిందని, అయితే ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా రంగాన్ని సవాల్‌గా స్వీకరించి సంస్కరణలను వేగవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం, ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడం, నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు, నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు భోజన పథకం పునరుద్ధరణ, 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ వంటి కార్యక్రమాలు విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని వివరించారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం పేరెంట్--టీచర్ సమావేశాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఈ నెల 24న నిర్వహించే సమావేశాలకు ప్రతి తల్లిదండ్రి తప్పనిసరిగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. తిరుపతి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గతంలో ప్రతిభా పురస్కారాలు కొద్దిమంది విద్యార్థులకే పరిమితమయ్యేవని, ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన అన్ని విభాగాల ప్రతిభావంతులైన 258 మంది విద్యార్థులను ఒకే వేదికపై సత్కరించడం విద్యారంగంలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికిందని మంత్రి అభినందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడమే సమాజ అభివృద్ధికి అసలైన పునాది అని పేర్కొన్నారు. పిల్లల విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు రెండు చక్రాల్లాంటి వారని, ఈ ఇద్దరి సమిష్టి కృషితోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు. ప్రతి విద్యార్థికి తనకంటూ ప్రత్యేకమైన ప్రతిభ, వ్యక్తిత్వం ఉంటుందని, పక్కింటి పిల్లలతో గానీ, ఇతరులతో గానీ పోల్చడం ద్వారా వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయవద్దని తల్లిదండ్రులకు సూచించారు. మార్కులే జీవిత విజయానికి కొలమానం కాదని, మంచి వ్యక్తిత్వం, నైపుణ్యాలు, క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యమని అన్నారు. విద్యార్థులు చిన్న లక్ష్యాలతో సరిపెట్టుకోకుండా పెద్ద కలలు కనాలని, "నక్షత్రాలను లక్ష్యంగా పెట్టుకుంటే కనీసం మేఘాల వరకైనా చేరుకుంటారు" అనే సూక్తిని గుర్తు చేశారు. ప్రపంచ స్థాయి అవకాశాలను అందుకునేలా తమ ప్రతిభను అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఇటీవల అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లాను తాను స్వయంగా కలిసిన అనుభవాన్ని పంచుకున్న కలెక్టర్, అలాంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు తమ లక్ష్యాల సాధనలో ముందుకు సాగాలని సూచించారు. తన చిన్ననాటి నాసా కల, వైద్య విద్య, అనంతరం సివిల్ సర్వీసెస్ వరకు సాగిన ప్రయాణాన్ని వివరిస్తూ, విద్యార్థుల ఆసక్తులను గుర్తించి తల్లిదండ్రులు సరైన దిశలో ప్రోత్సహించాలని కోరారు. ఈ రోజు వేదికపై మెరిసిన ప్రతి "షైనింగ్ స్టార్" వెనుక ఒక ఉపాధ్యాయుడి కృషి దాగి ఉందని కలెక్టర్ కొనియాడారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడం గురువుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలు, సంగీతం, కళలు వంటి పాఠ్యేతర కార్యక్రమాల్లోనూ విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. ఇవి ఒత్తిడిని తగ్గించి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని తెలిపారు. తాను సివిల్స్‌కు సిద్ధమవుతున్న సమయంలో కూడా క్రీడలు, ఇతర అభిరుచులకు సమయం కేటాయించడం వల్ల మానసిక ఒత్తిడిని అధిగమించగలిగానని వివరించారు. తిరుపతి ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. పరీక్షలను విద్యార్థులు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని, ప్రణాళికాబద్ధంగా చదివితే తప్పకుండా మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. విద్యే జీవితంలో ఎవరూ దోచుకోలేని శాశ్వత సంపద అని పేర్కొంటూ, తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వారి లక్ష్యసాధనకు తోడ్పడాలని సూచించారు. షైనింగ్ స్టార్స్--2026 కార్యక్రమం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్, మెడల్‌తో పాటు రూ.20,000 నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కూడా సన్మానించడం ద్వారా కుటుంబాల కృషిని గుర్తించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఇతర విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించి మరింత ప్రతిభ కనబర్చేందుకు ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులకు వివిధ ప్రోత్సాహక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. చదువే శాశ్వత సంపద అని, విద్యతోనే వ్యక్తి, కుటుంబం, సమాజం గౌరవప్రదమైన స్థాయికి చేరుకుంటారని పేర్కొంటూ, అవార్డు గ్రహీతలందరికీ అభినందనలు తెలియజేసి మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సూళ్ళూరుపేట ఎం.ఎల్.ఏ. మాట్లాడుతూ విద్య జీవితానికి బలమైన పునాది అని, చదువుతో పాటు క్రమశిక్షణ, నిజాయితీ, పెద్దల పట్ల గౌరవం, సమాజంలో మెలగడం వంటి విలువలను కూడా పాఠశాలలే నేర్పుతాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విద్య, ఆరోగ్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో 'వన్ క్లాస్--వన్ టీచర్', లీప్ యాప్, పాఠశాలల్లో యోగా, సాంస్కృతిక కార్యక్రమాలు, పోషకాహారం, మోడల్ స్కూల్స్ వంటి పలు సంస్కరణలు అమలు చేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నందుకు అభినందించారు. తన నియోజకవర్గం నుంచి షైనింగ్ స్టార్స్‌గా ఎంపికైన విద్యార్థులను, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని పల్లవిని ప్రత్యేకంగా ప్రశంసించారు. విద్యార్థులు బాగా చదవాలని, ఉపాధ్యాయులు, పెద్దలను గౌరవించాలని, నిజాయితీతో జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. రైల్వే కోడూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ... కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, నిర్వాహకులు మరియు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మక ఆలోచన పెంపొందాలని సూచించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన 258 మంది విద్యార్థులకు "షైనింగ్ స్టార్స్--2026" పురస్కారాలు, చెక్కులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి, వారిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా కృషి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విద్యా సంస్కరణలకు ప్రతీకగా నిలిచిందని విద్యార్థులు, తల్లిదండ్రులు వారి యొక్క అభిప్రాయాలను వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన యువకుడికి 10 రోజులు జైలు శిక్ష




ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట. మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి తిరుపతిలోని ప్రత్యేక న్యాయస్థానం 10 రోజుల సాధారణ కారాగార శిక్ష విధించింది. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితుడు పి. వెంకటేష్ (30),తారకరామనగర్, కరకంబాడి,తిరుపతికి చెందినవ్యక్తి. మోటార్ వాహనాల చట్టం ప్రకారం,సెక్షన్ 185 కింద నమోదైన కేసులో నిందితుడు కోర్టులో హాజరై తన నేరాన్ని అంగీకరించాడు. దీంతో తిరుపతిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించి, మోటార్ వాహనాల చట్టం ప్రకారం సెక్షన్ 185 ప్రకారం 10 రోజుల సర్వసాధారణ కారాగార శిక్ష విధించింది. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర హెచ్చరించారు.

## జీవో 396 రద్దు చేయాలని దస్తావేజు లేఖరుల పెన్ డౌన్



ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.396ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం పిలుపు మేరకు తొట్టంబేడు లో సోమవారం దస్తావేజు లేఖరులు పెనౌడౌన్ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ నెల 31 వరకు 12 రోజుల పాటు నిరసన కొనసాగుతుందని తెలిపారు. దస్తావేజుల తయారీని ప్రైవేట్ సేవా కేంద్రాలకు అప్పగించడం వల్ల, ప్రజలు ఆస్థులు ప్రవేటు వాళ్ళ చేతిలో ఉంటాయి.మరియు వేలాది మంది దస్తావేజు లేఖరుల జీవనోపాధి ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పునరాలోచన చేసి జీవో 396ను వెంటనే రద్దు చేయాలని, ప్రజలు, డాకుమెంట్స్ రైటర్స్ తమ ఉద్యమానికి కోరుతున్నారు.

## వారాహి మాత ఆలయ వ్యవహారంలో ట్రస్ట్‌కు తాత్కాలిక రక్షణ కల్పించిన కోర్టు



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్ తిరుపతి అదనపు జిల్లా న్యాయస్థానం (జూనియర్ డివిజన్)లో ఐఏ నెం.126/2026, ఓఎస్ నెం.496/2026 కేసులో జూలై 14న కీలక ఉత్తర్వులు వెలువడ్డాయి. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, తమ ట్రస్ట్ వేద, ధార్మిక, ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణ కోసం చట్టబద్ధంగా నమోదు చేయబడిన ట్రస్ట్ అని తెలిపారు. ట్రస్ట్ వ్యవస్థాపక ధర్మకర్త కొనుగోలు చేసి ట్రస్ట్‌కు విరాళంగా ఇచ్చిన స్థలంలో శ్రీ వారాహి మాత ఆలయం నిర్మించి, నిత్యపూజలు, వేదకార్యక్రమాలు, వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు రెవెన్యూ రికార్డులు, విద్యుత్ కనెక్షన్, బ్యాంకు ఖాతా వివరాలు, ఆదాయపు పన్ను రిటర్నులు తదితర పత్రాలను కోర్టుకు సమర్పించారు. అలాగే 2025 జూన్ 9న ప్రతివాదులు మరికొందరితో కలిసి ఆలయాన్ని కూల్చివేయడంతో పాటు, విగ్రహాన్ని ధ్వంసం చేసి, అక్కడ ఉన్న వారిపై దాడి చేసి స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఈ ఘటనపై క్రైమ్ నెం.288/2025 నమోదు అయినట్లు కోర్టుకు వివరించారు. ఆలయం ధ్వంసమైనప్పటికీ తాత్కాలిక విగ్రహాలతో నిత్యపూజలు కొనసాగిస్తున్నామని తెలిపారు.ఇక 2026 జూలై 15 నుంచి నిర్వహించాల్సిన వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల సమయంలో కూడా ప్రతివాదులు అడ్డంకులు సృష్టించి, పూజా సామగ్రిని ధ్వంసం చేసి, కార్యక్రమాలు నిర్వహించవద్దని బెదిరించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో శాశ్వత నిషేధాజ్ఞతో పాటు తాత్కాలిక నిషేధాజ్ఞ ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు.వాదనలు, అఫిడవిట్‌లు, సమర్పించిన పత్రాలను పరిశీలించిన కోర్టు, ట్రస్ట్ ప్రాథమికంగా తమ హక్కు, స్వాధీనాన్ని నిరూపించే ఆధారాలను సమర్పించిందని అభిప్రాయపడింది. ట్రస్ట్ రిజిస్ట్రేషన్, రెవెన్యూ రికార్డులు, బ్యాంకు ఖాతాలు, ఆదాయపు పన్ను రిటర్నులు, అధికారుల ఉత్తర్వులు తదితర పత్రాలు ఆలయం ఉనికిని, అక్కడ నిరంతర ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయాన్ని ప్రాథమికంగా వెల్లడిస్తున్నాయని పేర్కొంది. అలాగే ఆలయ ధ్వంసానికి సంబంధించి నమోదైన క్రైమ్ నెం.288/2025 కేసు పెండింగ్‌లో ఉండడం, బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల సమయంలో మరోసారి జోక్యం చేసుకున్నారనే ఆరోపణల నేపథ్యంలో, తక్షణ రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని కోర్టు భావించింది.పిటిషనర్‌కు ప్రాథమికంగా బలమైన కేసు ఉందని, సౌలభ్య సమతుల్యత కూడా వారి వైపే ఉందని కోర్టు పేర్కొంది. తాత్కాలిక నిషేధాజ్ఞ ఇవ్వకపోతే నిత్యపూజలు, బ్రహ్మోత్సవాలు, ఇతర ధార్మిక కార్యక్రమాలు నిలిచిపోయి భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని, ఆ నష్టం డబ్బుతో భర్తీ చేయలేనిదని అభిప్రాయపడింది.ఈ నేపథ్యంలో ప్రతివాదులకు ముందస్తు నోటీసులు ఇవ్వడం వల్ల ఉత్తర్వుల ఉద్దేశం దెబ్బతింటుందని భావించిన కోర్టు, 2026 జూలై 14 నుంచి జూలై 23 వరకు ప్రతివాదులు, వారి అనుచరులు లేదా ప్రతినిధులు పిటిషనర్ స్వాధీనంలో ఉన్న షెడ్యూల్ ఆస్తిలో జోక్యం చేసుకోవడం, ధార్మిక మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆటంకం కలిగించడం నిషేధిస్తూ ఏకపక్ష (ఎక్స్‌పార్టీ) తాత్కాలిక నిషేధాజ్ఞ జారీ చేసింది. అదేవిధంగా ఆర్డర్ 39 రూల్ 3 సీపీసీ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని, ప్రతివాదులకు నోటీసులు జారీ చేయాలని కోర్టు ఆదేశించింది.

## విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### నంద కిషోర్ రెడ్డి

**సాంఘిక సంక్షేమ వసతి గృహం విద్యార్థులకు దుప్పట్లు, టీ-షర్ట్స్ పంపిణీ**



ప్రజాభూమి ప్రతినిధి, వరదయ్యపాలెం: విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సింగిల్ విండో చైర్మన్ ఆణిముత్యం నంద కిషోర్ రెడ్డి అన్నారు. వరదయ్యపాలెంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ప్రభుత్వం అందించిన దుప్పట్లు, టీ-షర్ట్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నంద కిషోర్ రెడ్డి వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులకు స్వయంగా దుప్పట్లు, టీ-షర్ట్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పేద మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు కల్పించాలి



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని ఊరందూరు, నారాయణపురం పంచాయతీల్లోని వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అంగేరి పుల్లయ్య డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సామాజిక శంఖారావంలో భాగంగా దళితుల సమస్యలపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ ఊరందూరు, నారాయణపురం పంచాయతీలను శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో కలిపిన కారణంగా ప్రభుత్వం ఆ పంచాయతీ గ్రామాలతో పాటు జింగిలిపాలెం, పెంకులపాడు గ్రామాలకు గత ఐదేళ్లుగా ఉపాధి పనులు కల్పించడం లేదని వాపోయారు. తమను మున్సిపాలిటీలో కలపొద్దని కోర్టుకెళ్లి గ్రామస్తులు స్టే తెచ్చుకున్నా అధికారులు ఉపాధి పనులు కల్పించడంలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఫలితంగా సుమారు 250 వ్యవసాయ కూలీ కుటుంబాలు పనుల్లేక, మూడు పూటలా తిండి దొరక్క అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి పనులు కల్పించడంలో ఉన్న సాంకేతిక సమస్యను అధిగమించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఉడమలపాడు రెవెన్యూ, ఖాతా నెం.126లో వందమంది ఊరందూరు దళితులకు డీకేటి పట్టాలు ఇచ్చారనీ, అయితే గత ప్రభుత్వ హయాంలో సుమారు 20 ఎకరాల భూమిని కొందరు తమ పేర్లపై మార్చుకుని నీలగిరి చెట్లు పెంచుతున్నట్లు ఆరోపించారు. ఆర్డీవో విచారణ జరిపి దళితులకు న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా తొట్టంబేడు మండలంలోని చేమూరు దళితులకు 2006లో డీకేటి భూములు పంచిపెట్టారనీ, పట్టాలు కూడా ఇచ్చారనీ, అయితే ఆన్లైన్ చేయకుండా ఏళ్ల తరబడి తాత్సారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఇకనైనా దళితుల భూముల వివరాలను ఆన్లైన్లో ఎక్కించాలని కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గంధం మణి, కేవిపిఎస్ నాయకులు పెనగడం గురవయ్య, వెలివేంద్రం, కుమార్, వెంకటేష్, ఊరందూరు, చేమూరు దళితులు పాల్గొన్నారు.

## శ్రీ శక్తి పీఠంలో శ్రీ వారాహి దేవి నవరాత్రి ఉత్సవాలు

### శ్రీ లఘువారాహి దేవి ప్రత్యేక హోమం



ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం ప్రపంచంలోని అత్యంత మహిమాన్వితమైన ఏకైక శ్రీ పాతాళ శ్వేత వారాహీ మహాక్షేత్రమైన తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం రాయలచెరువు కట్ట దగ్గర ఉన్న శ్రీ శక్తిపీఠంలో నిర్వహించబడుతున్న శ్రీ వారాహీ నవరాత్రి మహోత్సవములలో ఆరవ రోజున అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించబడినవి. ఈ సందర్భంగా భయ నివారణ, రక్షణ, విజయం, భూ/గృహ సమస్యా పరిష్కారం కొరకు విశేష ఫలదాయకమైన శ్రీ లఘు వారాహీ దేవి ప్రత్యేక మంత్ర హోమం నిర్వహించబడినది.



స్త్రీమూర్తులకు సువాసిని పూజా, మధ్యాహ్నం అమ్మవారికి మహా హారతి సమర్పించబడగా, సాయంత్రం కళా నివేదన రూపంలో సంగీత, నాట్య, సాహిత్య సేవలు అమ్మవారికి అంకితం చేయబడినవి. రాత్రి వేళ పరమపూజ్య శ్రీ మాతాజీ వారి సమక్షంలో నవరాత్రి పూజ, దర్బారు సేవ జరుగగా, నడిచే దైవం జగద్గురువుల వారిచే మహా హారతి, అనంతరం అమ్మవారికి ఏకాంత సేవ నిర్వహించబడినవి. ఈ పుణ్యదినాన సుమారు 15,000 మందికి పైగా భక్తులు క్షేత్రాన్ని సందర్శించి అమ్మవారి దివ్య దర్శన భాగ్యాన్ని పొందారు. వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ సమృద్ధిగా జరిగినది, ఇది గురు-దైవానుగ్రహానికి, పీఠం సేవాతత్పరతకు నిదర్శనంగా నిలిచింది.

## రాష్ట్ర పార్టీలో పదవులు ఇచ్చినందుకు... చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఇద్దరు నేతలు



ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి రూరల్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఎస్సార్ వాలంటరీ విభాగం రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులైన చంద్రగిరి పట్టణానికి చెందిన యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, తిరుచానూరుకు చెందిన సి.శ్రీధర్‌రెడ్డి ఆదివారం చంద్రగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని ఆయన నివాసంలో వేర్వేరుగా జరిగిన మర్యాదపూర్వక భేటీలో శాలువాలు, గజమాలలతో సత్కరించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిని కూడా కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి బాధ్యతలు చేపట్టిన ఇద్దరు నాయకులు పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంస్థాగత బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి కూడా వారికి అభినందనలు తెలియజేసి కొత్త బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.అనంతరం యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, సి.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తమకు రాష్ట్ర స్థాయిలో అవకాశం కల్పించిన పార్టీ అధిష్ఠానానికి, ప్రోత్సాహం అందించిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ సంస్థాగత బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తామని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చంద్రగిరి, తిరుచానూరుకు చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్ సి పురం లో వైసీపీ నుండి టిడిపిలోకి భారీగా చేరిన వైసీపీ నాయకులు.

## ఆర్ సి పురం టీడీపీలో జోష్ .... వైసీపీలో డీలా... నెన్నూరు, నడవలూరు, సి రామపురంలో వైసీపీకి షాక్







ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రపురం. మండలంలోని నెన్నూరు పంచాయతీకి చెందిన మాజీ సింగిల్ విండో చైర్మన్ టి సిద్ధమనిరెడ్డి, వైసీపీ ఎంపీటీసీ జ్ఞానమ్మ , టీ.గిరిధర్ రెడ్డి, టీ. ప్రసాద్ రెడ్డి, యుగంధర్ రెడ్డిలతో పాటు సి రామాపురం, నడవలూరు గ్రామాలకు చెందిన 50 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఆదివారం రఘునాథ రిసార్ట్స్ లోని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యేలు పులివర్తి నాని, డాక్టర్ కే మురళీమోహన్, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ టిడిపి అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, తిరుపతి టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పులిగోరు మురళి కృష్ణారెడ్డిలు వైసిపి నాయకులను టిడిపిలోకి ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పి టిడిపిలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా టి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైసిపి ప్రభుత్వ పాలన చూసాం ... రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ ( నాని) ప్రజా సంక్షేమ పాలన అభివృద్ధికి ఆకర్షితులై టిడిపిలో చేరామని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ల సహకారంతో చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పులివర్తి నాని ఎన్నడూ లేని అభివృద్ధి చేయడం ... పార్టీలకు అతీతంగా ఆయన చేస్తున్న పరిపాలనా విధానం చూసి పార్టీలోకి చేరామని టి సిద్ధమనిరెడ్డి, టి ప్రసాద్ రెడ్డి, యుగంధర్ రెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ పార్టీలో చేరిన వారందరికీ సముచిత గుర్తింపు, ప్రాధాన్యత ఉంటుందని భరోసా ఇచ్చారు. చంద్రగిరి నియోజకవర్గంలో, ముఖ్యంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని అదే టీడీపీలో చేరికలకు కారణమవుతోందని పేర్కొన్నారు.ఎమ్మెల్యే పులివర్తి నాని నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో నెన్నూరు పంచాయతీలో తెలుగుదేశం పార్టీ విజయానికి సమిష్టిగా కృషి చేసి టిడిపి పార్టీ జెండాను ఎగురవేస్తామని.. అలాగే ఏ ఎన్నికలు జరిగినా టీడీపీ పార్టీ విజయానికి కృషి చేస్తామని ఎమ్మెల్యేకి హామీ ఇచ్చారు. అభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతూ పార్టీ బలోపేతానికి నిరంతరం పనిచేస్తామని వారు స్పష్టం చేశారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఆర్ సి పురం టిడిపిలో నూతన ఉత్సాహం జోస్ పెరిగింది..... వైసీపీ డీల పడింది. వైసీపీకి కంచుకోటలైన నెన్నూరు, సి రామపురం, నడుములూరు గ్రామాలలో నాయకులు టిడిపిలో చేరడంతో వైసీపీకి షాక్ తగిలింది. చంద్రగిరి నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల సమరంలో టిడిపి అన్ని స్థానాలు కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ఎమ్మెల్యే పులివర్తి నాని ఆపరేషన్ పులివర్తి కార్యక్రమాన్ని వినూత్నంగా చేపట్టి టిడిపిలోకి భారీ చేరికలు చేపడుతున్నారు. దీంతో చంద్రగిరి నియోజకవర్గంలో వైసిపి నాయకత్వం డీలపడడం ఖాయం అనిపిస్తున్నది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి ఏపీ ఎం ఎస్ ఎం ఈ డైరెక్టర్ చినబాబు, సింగిల్ విండో అధ్యక్షులు చేకూరి జనార్దన్ చౌదరి, మాజీ ఎంపీపీ టి కేశవుల నాయుడు, కొట్టే నరసింహ రెడ్డి, రావిల్ల గిరి బాబు,చేకూరి వెంకట ప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి, కే ముని రామిరెడ్డి, దినేష్ రెడ్డి, సాయి రెడ్డి. కోరా హరి ప్రసాద్ నాయకులు పాల్గొన్నారు.

# వాతావరణ మార్పులకు అనుగుణంగా తీర మహిళలకు నూతన ఉపాధి మార్గాలు

## వాకాడులో సామర్థ్యాభివృద్ధి శిక్షణ -- సీ వీడ్ సాగు, ఆర్నమెంటల్ ఫిషరీస్‌పై అవగాహన



ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు మారుతున్న వాతావరణ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంటూ తీర ప్రాంత మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు వాతావరణ అనుకూల జీవనోపాధి అవకాశాలపై వాకాడులో ఒకరోజు సామర్థ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జీసీఎఫ్--ఈసీఆర్ఐసీసీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్), మత్స్యశాఖ సంయుక్త భాగస్వామ్యంతో స్థానిక సెర్ప్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వాకాడు ఎంపీడీఓ సాయిప్రసాద్ అధ్యక్షత వహించారు.వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతో సంప్రదాయ జీవనోపాధులకు ఎదురవుతున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకుని, మహిళలకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా సముద్రపు శైవలాల (సీ వీడ్) సాగు, అలంకార చేపల పెంపకం (ఆర్నమెంటల్ ఫిషరీస్) వంటి వాతావరణ అనుకూల మత్స్యాధార ఉపాధి అవకాశాలపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారు. అంతేకాకుండా విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెట్ అనుసంధానం, వ్యాపార నిర్వహణ, ఆదాయ వృద్ధికి సంబంధించిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు. ప్రాజెక్టు పరిధిలోని 60 మంది మహిళా లబ్ధిదారులు ఈ శిక్షణలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ సాయి ప్రసాద్ మాట్లాడుతూ, తీర ప్రాంత మహిళలు వినూత్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే కుటుంబ ఆర్థికాభివృద్ధితో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. వాకాడు తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ, మహిళలకు నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకతను ప్రోత్సహించే ఇటువంటి కార్యక్రమాలు గ్రామీణాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. జీసీఎఫ్--ఈసీఆర్ఐసీసీ ప్రాజెక్టు ద్వారా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు తీర ప్రాంత మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీఓ సభ్యుడు రామన్నయ్య, రీడ్స్ సంస్థ కోఆర్డినేటర్ ఎం. రామ్‌లాల్, హైఫర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ ఎన్.వి.ఆర్. గణేష్, సెర్ప్ ఏపీఎం పోలమ్మ, జీసీఎఫ్--ఈసీఆర్ఐసీసీ జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ ఎన్. జస్వంత్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీఓఏలు) తదితరులు పాల్గొన్నారు.

# సత్యవేడు ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఆదిమూలం కృషి

## - రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతుల అందుచేత



ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు సత్యవేడు నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ని మర్యాదపూర్వకంగా కలిసి పలు వినతిపత్రాలను సమర్పించారు. నియోజకవర్గ అభివృద్ధి, మౌలిక వసతులు, రెవెన్యూ సంబంధిత సమస్యలు, ప్రజలకు అవసరమైన సేవల మెరుగుదల తదితర అంశాలపై ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వినతులను స్వీకరించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకొని పరిష్కార మార్గం చూపుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు ఎమ్మెల్యే తో పాటు ఇలన్ గోవన్ రెడ్డి, గోపినాథ్ రెడ్డి, రవి రెడ్డి, లోకయ్య రెడ్డి, కరుణాకర్ నాయుడు, సుధాకర్ నాయుడు, ఈశ్వరయ్య, యాచంద్ర నాయుడు, నరేంద్ర, మాజీ జెడ్పీటీసీ సుమాంజలి, నందకిషోర్ రెడ్డి, అవసరం సురేష్, బాలాజీ, మాజీ ఎంపీపీ మురళి, దయాలన్, నాయకులు పాల్గొన్నారు.

# పద్మానగర్‌లో మిగిలిన ప్రభుత్వ భూమిని స్థానిక పేదలకే కేటాయించాలి -- సిపిఐ డిమాండ్




ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట. రేణిగుంట మండలంలోని కుర్రకాల్వ సమీపంలోని పద్మానగర్ ప్రాంతంలో సర్వే నెం. 271, 272, 274లలో ప్రభుత్వం గతంలో సుమారు 1,800 మంది పేద కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించింది. అయితే, ఇదే సర్వే నంబర్లలో సుమారు ఒకటిన్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఇంకా ఖాళీగా ఉన్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రేణిగుంట మండల కమిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.. ఈ నేపథ్యంలో మిగిలిన ప్రభుత్వ భూమిపై వెంటనే రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయి సర్వే నిర్వహించి, రేణిగుంట మండలానికి చెందిన అర్హులైన స్థానిక పేద ప్రజలు, మధ్య కుటుంబస్తులు, నిరాశ్రయ కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించాలని సిపిఐ డిమాండ్ చేసింది. అదేవిధంగా, ఇప్పటికే సుమారు 63 ప్లాట్లు స్థానికేతర వ్యక్తులకు కేటాయించినట్లు తమ దృష్టికి వచ్చిందని సిపిఐ పేర్కొంది. రేణిగుంట మండలానికి సంబంధం లేని వ్యక్తులకు ప్లాట్లు కేటాయించారనే సమాచారం స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళనకు కారణమైందని తెలిపింది. ఈ వ్యవహారంపై జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా కేటాయింపులు జరిగి ఉంటే వాటిని సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని కోరింది.వలసదారులకు కాకుండా రేణిగుంట మండలస్థానిక పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని సిపిఐ నాయకులు తెలిపారు. ఈ సమస్యపై తిరుపతి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు సిపిఐ వెల్లడించింది. మిగిలిన ప్రభుత్వ భూమిని స్థానిక అర్హులైన పేద కుటుంబాలకు మాత్రమే కేటాయించి సామాజిక న్యాయం చేయాలని జిల్లా పరిపాలనను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వై.ఎస్. మణి మండల కార్యదర్శి, భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ), రేణిగుంట మండలం, తిరుపతి జిల్లా.వి. కార్తీక్ అధ్యక్షులు, ఏఐటీయూసీ, శ్రీకాళహస్తి. సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# పార్లపల్లి--ఏ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంఈవో ఎ. మునిసుబ్రహ్మణ్యం

ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలోని పార్లపల్లి--ఏ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి ఎ. మునిసుబ్రహ్మణ్యం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల అభ్యాస స్థాయిని పరిశీలించి, ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న విద్యా కార్యక్రమాలను సమీక్షించారు. విద్యార్థుల వద్ద ఉన్న రెడీనెస్ పుస్తకాలను పరిశీలించిన ఎంఈవో, వారి పఠన, రచన, గణిత నైపుణ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యాస పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల వద్ద ఉన్న రెడీనెస్ పుస్తకాలను పరిశీలించిన ఎంఈవో, వారి పఠన, రచన, గణిత నైపుణ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యాస పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అలాగే విద్యార్థులకు బోధనను మరింత ఆసక్తికరంగా, సులభంగా అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థులు అన్ని అంశాల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



# కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

## సిపిఐ ఎమ్మెల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డిపి పోలయ్య డిమాండ్






ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు, నీట్ ప్రశ్నాపత్రం లీక్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని మూడు వారాలుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్ చుక్ ను ఢిల్లీ పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తరలించడాన్ని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి పోలయ్య తీవ్రంగా ఖండించారు. దీక్ష చేస్తున్న వారితో చర్చలు జరపకుండా, విద్యా వ్యవస్థలో, పోటీ పరీక్షల నిర్వహణలో మార్పులు చేయకుండా, దీక్షను భగ్నం చేయడం కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని,అయినా కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకులు అభిజీత్ దీప్కే తదితరులు నిరవధిక నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారని, ఇప్పటికైనా కేంద్రం ఉద్యమకారులతో చర్చలు జరపాలని అన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# వైభవంగా శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పార్వేట ఉత్సవం



ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి శ్రీవారిమెట్టు సమీపంలో భక్తిశ్రద్ధలతో అన్నప్రసాదాల పంపిణీ శ్రీవేంకటేశ్వరస్వామి వారు నడిచిన పవిత్ర మార్గంగా భక్తులు విశ్వసించే శ్రీవారిమెట్టు సమీపంలో ఉన్న శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పార్వేట ఉత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ఆలయం నుంచి ఉత్సవమూర్తులు మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య ఊరేగింపుగా బయలుదేరి శ్రీవారిమెట్టు సమీపంలోని పార్వేట మండపానికి చేరుకున్నారు. అక్కడ క్షేమతలిగ నివేదన అనంతరం పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. దుష్టశిక్షణకు ప్రతీకగా స్వామివారు మూడుసార్లు బల్లెంను ప్రయోగించే విశిష్ట ఘట్టం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఆస్థానం నిర్వహించి, సాయంత్రం ఉత్సవమూర్తులను తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. పార్వేట ఉత్సవం సందర్భంగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు భక్తి సంకీర్తనలు ఆలపించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. భజన బృందాలు భజనలు, కోలాటాలతో భక్తులను అలరించగా, అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జేఈవో డా. ఎ. శరత్, ఆలయ ప్రత్యేకశ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ అర్చకులు బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్ జయ, ఇతర అధికారులు, అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# తిరుమలలో మహారాష్ట్రకు చెందిన భక్తుడు అదృశ్యం కేసు నమోదు



ప్రజా భూమి ప్రతినిధి తిరుమల మహారాష్ట్ర రాష్ట్రం, పూణే జిల్లాకు చెందిన హైదర్ అన్వరుల్లా హక్ ఖాన్ (40) తన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చి, వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2 లోని క్యూలైన్‌లో ప్రవేశించారు. 15-07-2026 రాత్రి 8.00 గంటల నుండి 9.00 గంటల మధ్య, వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2 లోని కంపార్ట్‌మెంట్ నెం.14 వద్ద కుటుంబ సభ్యుల నుండి విడిపోయి అదృశ్యమయ్యారు. కుటుంబ సభ్యులు తిరుమల, తిరుపతి పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, హైదర్ అన్వరుల్లా హక్ ఖాన్ బాలాజీనగర్ వైపు కాలినడకన వెళ్తు, ఆ తరువాత కనిపించకుండా పోయారు. ఈ మేరకు ఆయన భార్య శ్రీమతి అర్చనా రోహిదాస్ రోకడే ఈదినం అనగా తేదీ. 20-07-2026న తిరుమల టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, తిరుమల టౌన్ పోలీస్ వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా తిరుమల టౌన్ పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 1.9440796771 2.9440796769 3. 0877-2289027

# శ్రీకాళహస్తి ఆలయంలో ఆఫ్‌లైన్ ప్రసాదం కౌంటర్ ఏర్పాటు

## రేపటి నుంచి ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ ప్రసాద విక్రయాలు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం రేపటి నుంచి ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ లోనూ ప్రసాదాల విక్రయాలను ప్రారంభించనున్నట్లు ఆలయ చైర్మన్ సాయి కొట్టే తెలిపారు.ఆలయానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు విచ్చేస్తుండటంతో ప్రసాదాల కొనుగోలులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుర్తించిన చైర్మన్ సాయి కొట్టే, అదనంగా ఆఫ్‌లైన్ ప్రసాదం కౌంటర్ ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్, నియోజకవర్గ ఎమ్మెల్యే, ఆలయ ఈవో దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ఈ ప్రతిపాదనకు దేవాదాయ శాఖ కమిషనర్ వెంటనే ఆమోదం తెలపడంతో సంబంధిత ఆదేశాలు ఆలయ అధికారులకు అందాయని పేర్కొన్నారు. దీంతో రేపటి నుంచి భక్తులు ఆన్‌లైన్‌తో పాటు నేరుగా ఆఫ్‌లైన్ కౌంటర్‌లో కూడా ప్రసాదాలను పొందే అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు.ఈ నిర్ణయం వల్ల ప్రసాదాల కోసం వేచి ఉండే సమయం తగ్గడంతో పాటు భక్తులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని సాయి కొట్టే తెలిపారు.భక్తుల అవసరాలను గుర్తించి తక్షణమే స్పందించిన దేవాదాయ శాఖ కమిషనర్, ఆలయ ఈవో, నియోజకవర్గ ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులో కూడా శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి కొనసాగుతుందని ఆలయ చైర్మన్ సాయి కొట్టే తెలిపారు.

# ప్రజల సమస్యలకు పరిష్కార వేదికగా "పబ్లిక్ గ్రీవిన్స్ రిడ్రెస్సల్" కార్యక్రమం

## 52 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి



ప్రజాభూమి ప్రతినిధి చిత్తూరు ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశిత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పనిచేయాలని ఆయన సూచించారు. సోమవారం నిర్వహించిన "పబ్లిక్ గ్రీవిన్స్ రిడ్రెస్సల్" కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్పీ తుషార్ డూడి, నాన్-కేడర్ ఎస్పీ రాజశేఖర్ రాజు, అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) ఎస్. షాను, చిత్తూరు ఎస్‌డీపీవో జె. వెంకటనారాయణలను కలిసి తమ సమస్యలను వివరించారు.ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయడమే పోలీసు శాఖ లక్ష్యమని ఎస్పీ తెలిపారు. ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 52 ఫిర్యాదులు అందాయి. వాటిలో చీటింగ్ -- 9, వేధింపులు -- 5, ఇంటి తగాదాలు -- 8, భూ తగాదాలు -- 8, డబ్బు తగాదాలు -- 8, చిన్న గొడవలు -- 8, ఆస్తి తగాదాలు -- 6 ఫిర్యాదులు ఉన్నాయి.

# ప్రమాద భీమ కార్మికులకు పదిలక్షలు ప్రభుత్వం ప్రకటించాలి

**-ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు డి.పి పోలయ్య డిమాండ్..**



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
భారత కార్మిక సంఘాల సమైఖ్య( బిల్డింగ్ కన్-స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ బీసీ డబ్ల్యు యు ఆధ్వర్యంలో సోమవారం ఐఎఫ్టియు జిల్లా కార్యాలయం నుండి భవన నిర్మాణ కార్మికులు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్లో రాస్తా రోకో చేసి, అనంతరం ర్యాలీగా బయల్దేరి తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేసి తహసీల్దారు గారికి వినతి పత్రం సమర్పించారు. ఆ ధర్నాను ఉద్యేశించి ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు డి.పి పోలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ రంగంపై ఆధారపడి 36 రకాల వృత్తులు కలిగిన కార్మికులు పనిచేస్తూ తమ కుటుంబాల్ని పోషిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డులో ఉన్న సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేయకుండా సహజ మరణం పొందితే రూ.80000 ప్రసుతికి రూ. 20,000 వివాహానికి 20వేలు మాత్రమే ప్రకటించారు ప్రమాదవశాత్తు మరణిస్తే కనీసం రూపాయి కూడా ఇవ్వటం లేదు పక్క రాష్ట్రం తెలంగాణలో ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షలు సహజ మరణం పొందితే రెండు లక్షలు ప్రసుతి కింద రూ. 30,000 వివాహానికి రూ.30000 లు ఇతర రాష్ట్రాల్లో పెన్షన్లు సైతం మంజూరు చేస్తున్నారు. కార్మికుల పిల్లలు చదువుల కోసం వివిధ రాష్ట్రాలు చదువును బట్టి స్కాలర్షిప్లు ఇస్తున్నారు. మన రాష్ట్రంలో ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికులకు హామీలు ఇచ్చిన అమలు చేయడంలో చిత్తశుద్ధి కొరబడింది. ప్రభుత్వం తక్షణమే భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద బీమా కింద పది లక్షలు కార్మికుల కుటుంబానికి ఇవ్వాలి నిర్మాణ స్థలంలో చనిపోతే కార్డుతో నిమిత్తం లేకుండా ప్రమాద భీమా వర్తింప చేయాలి. భవన నిర్మాణ కార్మికుడు సహజ మరణం పొందితే వారి కుటుంబానికి రెండు లక్షలు ఇవ్వాలి, భవన నిర్మాణ కార్మికులకు ఈఎస్ఐ పెన్షన్ సౌకర్యం కల్పించాలి, భవన నిర్మాణ కార్మికులకు వివాహ కానుక కింద లక్ష రూపాయలు, ప్రసుతి 50,000 పిల్లల సంరక్షణ కొరకు 10000 మంజూరు చేయాలి, కార్మికుని శ్రమ సామర్థ్యాన్ని బట్టి టూల్ కిట్ కింద ?20,000 ఇవ్వాలి , భవన నిర్మాణ కార్మికుల పిల్లల చదువులకయ్యు ఖర్చును బట్టి స్కాలర్షిప్లు మంజూరు చేయాలి. 50 సంవత్సరాలు దాటిన ప్రతి కార్మికునికి నెలకు 5000 పెన్షన్ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున కార్మికులను కూడగట్టుకొని ఉద్యమిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం తహసీల్దారు కి వినతి పత్రం సమర్పించారు. పై సమస్యలను జిల్లా కలెక్టరు గారికి సిఫారసు చేయవలసిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ డబ్ల్యు యుజిల్లా కార్యదర్శి యం. అనీల్, నాయకులు దేగా శ్రీనివాసులు, పి వెంకట రమణయ్య, పి పోలయ్య, సుధాకర్, క్రిష్ణయ్య, వెంకటేశ్వర్లు, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ గురుకుల పాఠశాలను మూసివేయడం తగదు



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
గూడూరు నియోజకవర్గ కోట మండలంలో శ్రీ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఎత్తి వేయటంపై "దళిత విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం: కోట అంబేద్కర్ గురుకుల పాఠశాల మూసివేతపై రాష్ట్ర బీఎస్పీ కార్యదర్శి నాశినభాస్కర్ గౌడ్ ఎల్వి సుబ్బయ్య గూడూరు ఆర్డీవో ఆఫీసులో ఏవో కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఆర్డిఓ ఆఫీస్అవరణలో మీడియా వారితో నాసిన భాస్కర్ గౌడ్ ఎల్వి సుబ్బయ్య మాట్లాడుతూ కోట అంబేద్కర్ గురుకులాన్ని ఎత్తివేయడం దళితులపై వివక్షకు నిదర్శనం 550 మంది విద్యార్థులను తరలిస్తే సరిపడా వసతులు ఎక్కడ?: 640 మంది సామర్థ్యం ఉన్న పాఠశాలలో 800 మందిని ఎలా ఉంచుతారు? దళిత పిల్లలపై చులకన భావంతో ప్రభుత్వం వ్యవహరిస్తుంది.

ఐఐటికి మేము వ్యతిరేకం కాదు... గురుకులాన్ని తొలగించడానికే మేము వ్యతిరేకం: సీట్లు లేవన్న అధికారులు ఇప్పుడు అదనపు విద్యార్థులను ఎలా చేర్చుతున్నారు? ప్రైవేట్ విద్యాసంస్థలకు లాభం చేకూర్చేందుకే ఈ నిర్ణయమా? విద్యా సంవత్సరం మధ్యలో పిల్లలను పంపించడం అమానుషం దళిత బిడ్డల కన్నీళ్లకు ప్రభుత్వం బాధ్యత వహించాలి

రిజర్వుడ్ నియోజకవర్గం కాబట్టి దళితులను నిర్లక్ష్యం చేయొద్దు:
కోట గురుకులాన్ని కొనసాగించాలి...
ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి:
దళిత నియోజకవర్గమైన గూడూరులో, దశాబ్దాలుగా ఎంతోమంది పేద విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన 'కోట అంబేద్కర్ గురుకుల పాఠశాల'ను ప్రభుత్వం ఒక్కసారిగా ఎత్తివేయడంపై రాష్ట్ర బీఎస్పీ పార్టీ కార్యదర్శి నాసిన భాస్కర్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దళిత వర్గాలపై ఉన్న వివక్షకు నిదర్శనమని తెలిపారు

వసతులు ఎక్కడ ఉన్నాయి?: కోట గురుకులంలో ఉన్న 550 మంది విద్యార్థులను వాకాడు (640 మంది సామర్థ్యం), నాయుడుపేట (1000), చిల్లకూరు (640) సామర్థ్యం ఇప్పటికే అక్కడ విద్యార్థులు ఉండగా, అదనంగా ఈ 550. మందిని పాఠశాలలకు తరలించారు.పిల్లలను పాఠశాలకూ పంపడం వల్ల అక్కడ ఏ మేరకు వసతులు కల్పిస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. "దళిత బిడ్డలు కదా, 640 మంది ఉండాల్సిన చోట 800 మంది ఉన్నా సర్దుకుంటారు" అనే చులకన భావంతోనే ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు.

ఎల్వి సుబ్బయ్య మాట్లాడుతూఅభివృద్ధి అంటే పాఠశాలలను మూసివేయడమా?:-
గూడూరుఎమ్మెల్యే ఈ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఎత్తివేయటంపై స్పందించాలని దళిత బిడ్డలకు న్యాయం చేయాలని కోరారు ఐఐటీ ఏర్పాటును తాము వ్యతిరేకించడం లేదని, కానీ ఒక మంచి విద్యాసంస్థను మూసివేసి మరో సంస్థను తేవడం విడ్డూరమని అన్నారు. అభివృద్ధి చేయాలనుకుంటే కొత్తగా ఏర్పాటు చేయాలి కానీ, ఉన్న గురుకులాలను ఎత్తివేయడం దేనికి సంకేతం? అని ప్రశ్నించారు.

అధికారుల తీరుపై అనుమానాలు:
సాధారణ రోజుల్లో "సీట్లు లేవు, వసతులు తక్కువ" అని చెప్పే అధికారులు, ఇప్పుడు ఒక్కసారిగా ఒక్కో పాఠశాలకు 200 మందికి పైగా విద్యార్థులను ఎలా చేరుస్తారని ఆయన నిలదీశారు. ప్రైవేట్ విద్యా సంస్థలకు లాభం చేకూర్చడానికే ప్రభుత్వ దళిత పాఠశాలలను ఇలా నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దళిత బిడ్డల కన్నీళ్లు: దళితుల పట్ల ఉసురు పోసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాము పాఠశాల నడుస్తున్న సమయంలో, విద్యా సంవత్సరం మధ్యలో ఉన్నఫలంగా నోటీసులు ఇచ్చి పిల్లలను బయటకు పంపడం వారి తల్లిదండ్రులను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని ఎల్వి సుబ్బయ్య పేర్కొన్నారు. "పిల్లల కళ్ళల్లో కన్నీళ్లు చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. ఇది దళితుల పట్ల ప్రభుత్వం చూపుతున్న వివక్ష కాక మరేంటి?" అని ఆయన ప్రశ్నించారు.

ప్రభుత్వ అధికారులకు హెచ్చరిక: రిజర్వుడ్ నియోజకవర్గంలో అడిగేవారు లేరనే ధీమాతో దళితులపై ఇటువంటి అణచివేత చర్యలకు పాల్పడుతున్నారని, ఇది పూర్తిగా దళిత వ్యతిరేక ధోరణి అని ఆయన ఘాటుగా విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని, దళిత విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడం మానుకోవాలనీ ఎల్ వి సుబ్బయ్య డిమాండ్ చేశారు. గూడూరు ఆర్డీవో ఆఫీస్ లో ఏవో గారికి ఈ అర్జీ ఇచ్చిన వారిలో. నాశీన భాస్కర్ గౌడ్ ఎల్.వి సుబ్బయ్య జి వెంకటేశ్వరరాజు మీరమ్మ తదితరులు పాల్గొన్నారు

## దళిత క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం - నూతన కమిటీ ఎంపిక



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు
దళితులు, దళిత క్రైస్తవులపై ఇటీవల కాలంలో జరుగుతున్న దాడులు, వివక్ష, క్రైస్తవ ప్రార్థనా మందిరాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ గూడూరులో సోమవారం దళిత క్రైస్తవుల సమావేశం నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన, దళిత క్రైస్తవుల సమస్యల పరిష్కారం లక్ష్యంగా గూడూరు డివిజన్ దళిత క్రిస్టియన్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని, దళితులు, దళిత క్రైస్తవులపై జరుగుతున్న అన్యాయాలను ప్రభుత్వం కఠినంగా అరికట్టాలని కోరారు. ప్రార్థనా మందిరాలపై దాడులు, మత స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. సమాజంలో శాంతి, సామరస్యం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. గూడూరు డివిజన్ దళిత క్రిస్టియన్ అసోసియేషన్ నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడు: బిషప్ ఎం. జె. జయకుమార్ ప్రెసిడెంట్: బి. ప్రభుచరణ్ వర్కింగ్ ప్రెసిడెంట్: ఎన్. పాల్ సురేంద్ర అడ్వైజర్: ఎం. జె. జోసఫ్, అడ్వకేట్ మహిళా విభాగం: జీవన్ కుమార్, డాలీ మేరీ, యూత్ ప్రెసిడెంట్: ఎం. నాథన్ ట్రెజరర్: ఎం. నవీన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్: జోసెఫ్, రత్నం, అజ్జు, విజయకుమార్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ: జి. రవి కుమార్, నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, దళితులు, దళిత క్రైస్తవుల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, విద్య, ఉపాధి, సంక్షేమం, క్రైస్తవ ప్రార్థనా మందిరాల భద్రత వంటి అంశాలపై సమిష్టిగా పోరాడతామని తెలిపారు. ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు దళిత, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతిమయాత్ర పథకం ద్వారా నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం వారు మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
మండలంలోని చెన్నూరు గ్రామం లో నివసిస్తున్న కటికాల వెంకటరమణయ్య శుక్రవారం నాడు అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది వాళ్లని నిరుపేదలుగా గుర్తించిన నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం మట్టి ఖర్చులు నిమిత్తం అంతిమయాత్ర పథకం కింద ఐదు వేలు రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. వారి కుటుంబ సభ్యులు సంఘంలోని దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కటికాల శేషు కార్యవర్గ సభ్యులు మదిర బాలయ్య మరియు చెన్నూరు దేవాంగ కమిటీ సభ్యులు మన్నె రమణయ్య ఆకాశం బాల గురవయ్య చల్లా వెంకటేశ్వర్లు కటకాల హరి, జగన్, కామాక్షయ్య, చలమయ్య, సుబ్బయ్య, మధిర సునీల్, మాదన లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎంఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులుగా బాలకృష్ణ గౌడ్, కార్య నిర్వాహక కార్యదర్శిగా డబ్బు కృపానిధి

**-ఘనంగా సత్కరించిన వ్యవస్థాపకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఢిల్లీ బాబు రెడ్డి**
**-జర్నలిస్టుల సంక్షేమ కోసం కృషి చేస్తా-ఏపీ ఎంఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ గౌడ్**



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులుగా పి బాలకృష్ణ గౌడ్ కార్య నిర్వాహక కార్యదర్శిగా డబ్బు. కృపానిదిలను ఏకగ్రీవంగా జిల్లా జర్నలిస్టులు ఎన్నుకున్నారు. నెల్లూరు రోటరీ భవన్లో ఆంధ్ర ప్రదేశ్ మీడియా జర్నలిస్టుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లా ఆంధ్ర ప్రదేశ్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గానికి అధ్యక్షులుగా బి.ఆర్.కె న్యూస్ స్టాఫ్ రిపోర్టర్ మల్లికార్జునరావు ప్రభాత దర్శిని నెల్లూరు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పీ.బాలకృష్ణ గౌడ్, ప్రభాన్యూస్ గూడూరు నియోజకవర్గం ఇన్చార్జి కృపానిధిని జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ వ్యవస్థాపకులు ఢిల్లీ బాబు రెడ్డి నూతన కార్యవర్గాన్ని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల సంక్షేమం కోసం ఏపీఎంఎఫ్ కృషి చేస్తుందని తెలిపారు. విద్య వైద్యం సంక్షేమం లక్ష్యంగా ఏపీఎంఎఫ్ కృషి చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు బాలకృష్ణ గౌడ్ ఏపీ ఎమ్ ఎఫ్ వ్యవస్థాపకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిల్లీ బాబురెడ్డిని కోరారు. జిల్లా కమిటీ ఉపాధ్యక్షులగా జర్నలిస్టుల సంస్థల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడగా ఎన్నికయ్యేందుకు సహకరించిన గూడూరు డివిజన్ ఏపీఎంఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సురేష్, అనిల్ తో పాటు కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## బత్తినయ్య స్వామి కి ప్రత్యేక పూజలు

**సోమవారం శివానుగ్రహం... సర్వజన హితమే సంకల్పం: దండి నరేంద్ర**



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్
పరమశివునికి అత్యంత ప్రీతిపాత్రమైన సోమవారం సందర్భంగా మునలిపేడు బత్తెనయ్యస్వామి కోనలోని పవిత్ర శివాలయంలో భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాను.ఈ సందర్భంగా... జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని అన్నదాత రైతుల సంక్షేమం, ప్రజల సుభిక్షం కోసం ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత కోసం సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని పరమేశ్వరుని ప్రార్థించాను. కొండపైకి మొత్తం 4,140 మెట్లు (2,070 ఎక్కడం -- 2,070 దిగడం) అధిరోహించి స్వామివారి దివ్య దర్శనం పొందడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. తెల్లవారుజామున 4:13 గంటల నుంచి ఉదయం 10:20 గంటల వరకు సుమారు 6 గంటలు సాగిన ఈ భక్తి యాత్రలో ప్రతి క్షణం దైవానుభూతితో, ఆత్మసంతృప్తితో నిండిపోయింది.అక్కడి సహజసిద్ధమైన ప్రకృతి సౌందర్యం, ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రశాంతమైన పరిసరాలు మనసుకు అపూర్వమైన ప్రశాంతతను అందించాయి. శారీరకంగా ఫిట్ గా ఉన్నవారు అవకాశం ఉంటే ముఖ్యంగా సోమవారం ఈ పవిత్ర క్షేత్రాన్ని తప్పకుండా దర్శించుకోవాలని హృదయపూర్వకంగా సూచిస్తున్నాను

## ప్రతిభా పురస్కారానికి ఎంపికైన శ్రీకాళహస్తిలోని ఎంజిఎం కాలేజ్ విద్యార్థి




ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్
తిరుపతిలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వం నిర్వహించిన షైనింగ్ స్టార్స్ ప్రోగ్రాం లో శ్రీకాళహస్తిలోని ఎంజీఎం కాలేజ్ విద్యార్థి గోవింద్ కిషోర్ మంచి మార్కులు సాధించినందుకు గాను ప్రభుత్వం నుండి 20 వేల రూపాయలు నగదు మరియు మెడల్ , సర్టిఫికెట్ బహుమతిని మంత్రి అనగానీ సత్య ప్రసాద్ మరియు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా తిరుపతిలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నందు అందుకున్నారు. ఎంజీఎం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్ ఈ కార్యక్రమాన్ని వీక్షించి శ్రీకాళహస్తిలోని మా ఎంజిఎం కాలేజ్ నందు బాగా చదివి ఇంటర్మీడియట్ లో మంచి మార్కులు సాధించినందుకు ఈరోజు తిరుపతిలో జరిగిన ప్రతిభా పురస్కారానికి ఎంపికైన విద్యార్థి వారి తల్లి,తండ్రి మరియు కాలేజీ ప్రిన్సిపల్ మధ్య ఈ ప్రతిపాపరష్కారాన్ని అందుకున్నందుకు సంతోషంగా ఉందని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగానీ సత్య ప్రసాద్ , తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఎంజిఎం జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ వి ఎస్ రత్నం మరియు విద్యార్థి తల్లిదండ్రిలు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సముచిత భాగస్వామ్యం కల్పిస్తారా?



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్
ప్రభుత్వ భూములతో అభివృద్ధి చెందుతున్న ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు పారిశ్రామిక యాజమాన్యం, ప్లాట్ల కేటాయింపు, ఉపాధి, నైపుణ్య శిక్షణ, వెండర్ అవకాశాలు, మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, బ్యాంకు రుణాల హామీ, సబ్సిడీలు, సామాజిక ఆడిట్ వంటి అంశాలపై స్పష్టమైన విధానాన్ని ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తుందా? అలాగే ప్రభుత్వ రాయితీలు పొందే ప్రతి ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులో సామాజిక న్యాయ సూత్రాలు తప్పనిసరిగా అమలు చేసేలా ఒప్పందాల్లో నిబంధనలు చేర్చి, ప్రత్యేక పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేసి, జిల్లాకు మరిన్ని ఎస్ఈజెడ్లు, పరిశ్రమలు తీసుకువచ్చి బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు పారిశ్రామిక రంగంలో సముచిత భాగస్వామ్యం కల్పించే చర్యలు చేపడతారా? అని భారతీయ జనతా పార్టీ నాయకులు జనతా వారధి కార్యక్రమం సందర్భంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## ప్రజల సమస్యలే మా ప్రాధాన్యం... పరిష్కారమే మా లక్ష్యం - దండి నరేంద్ర

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు
ప్రజా సమస్యల పరిష్కారానికి వినతిపత్రం । కలెక్టరేట్ కార్యాలయం, తిరుపతి । జనసేన పార్టీ. ఏర్పేడు, రేణిగుంట మండలాల జనసేన నాయకులు ప్రజల నుంచి అందిన వినతులను సమగ్రంగా పరిశీలించి, తిరుపతి కలెక్టరేట్లో సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించి, తదుపరి చర్యల కోసం అధికారిక రసీదు పొందడం జరిగింది.



ప్రధాన వినతులు: నివాస స్థలాల రిజిస్ట్రేషన్కు అనుమతి. గాజులమండ్యం పంచాయతీ హరిజనవాడకు చెందిన 170కు పైగా కుటుంబాల దీర్ఘకాల సమస్య పరిష్కారం కోసం వినతి.(వినతిదారు: శ్రీ గోవర్ధన్, గాజులమండ్యం.) మేర్లపాక ఎస్సీ కాలనీ పాఠశాల అభివృద్ధి ఫౌండేషన్ స్కూల్(క్లాస్:1-2)ను గతంలో ఉన్నట్లుగా పూర్తి స్థాయి ప్రాథమిక పాఠశాల(క్లాస్: 1-5)గా పునరుద్ధరించాలని వినతి. (వినతిదారు:తమ్మిని వంశీ , మేర్లపాక) ప్రజల గొంతుకగా జనసేన పార్టీ ఎల్లప్పుడూ నిలుస్తుంది. ప్రతి సమస్యకు చట్టబద్ధమైన పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, ప్రజల పక్షాన అండగా నిలుస్తుంది." ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల అధ్యక్షుడు నాగరాజు, మాజీ వార్డు సభ్యులు ం అడ్వకేట్ బాషా, వంశీ, గోవర్ధన్, వేణు, రవి రాజు, దివాకర్, చంద్ర తదితర జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ఆర్ఎస్పి లక్ష్యం - తిరుపతిలో ఆర్ఎస్పిలో భారీగా చేరికలు




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
ప్రజా పోరాటాల్లో ఆర్ఎస్పి ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తుందని ఆర్ఎస్పి రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు అన్నారు. తిరుపతి నగరంలోని ఓ ప్రైవేట్ హాలులో నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో సతీష్, బాలకృష్ణ సమక్షంలో వివిధ కమ్యూనిస్టు పార్టీల్లో పనిచేసిన నాయకులు, కార్యకర్తలతో పాటు సుమారు 100 కుటుంబాలు ఆర్ఎస్పిలో చేరాయి. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జానకి రాములు మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న ప్రజావ్యతిరేక విధానాలు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వంటి ప్రజా సమస్యలపై ప్రజలతో కలిసి నిరంతర పోరాటాలు నిర్వహించే పార్టీగా ఆర్ఎస్పి నిలుస్తోందని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, లౌకిక ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.వివిధ కమ్యూనిస్టు ఉద్యమాల్లో పనిచేసిన అనుభవజ్ఞులు ఆర్ఎస్పిలో చేరడం పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజా ఉద్యమాలను విస్తృతం చేస్తామని తెలిపారు. కొత్తగా చేరిన సభ్యులు ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కొత్త సభ్యులు ఆర్ఎస్పి సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ లక్ష్యాలు, సామాజిక న్యాయం కోసం పార్టీ చేపడుతున్న ఉద్యమాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగగా, పార్టీ నాయకులు కొత్త సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి ప్రజా ఉద్యమాలను మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్ఎస్పి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన బ్యాంకు సిబ్బంది




ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
పచ్చవ వెన్నెల భర్త చుండి వంశీధర్ రెడ్డి అనే నేను వ్యాపార అవసరాల నిమిత్తం 2018 అక్టోబరు నెల 5వ తేది బ్యాంకు అఫ్ ఇండియా గూడూరు బ్రాంచి వారి నుండి బ్యాంకు ఋణం రూ 43,00,000/- అక్షరాల నలభై మూడు లక్షలు తీసుకో వడమైనది.... పై బ్యాంకు రుణం పోందడానికి పై బ్యాంకు అఫ్ ఇండియా కు రుణ హామిగా 3 అస్తులు వుంచడమైనది. కరోన వల్ల 2023వ సంవత్సరము నుండి పై రుణం తీర్చలేక మాకు ఇబ్బంది అయ్యి అకౌంట్ యన్.పి.ఏ (నాన్ వర్ ఫామింగ్ ఆసెట్ట్ ) క్రింది బ్యాంకు వారు ప్రక టించినారు. బ్యాంకు వారు పై రుణం రికవరీ కొరకు నేను హామి వుంచిన ఆస్తుల వేలం వేయుటకు నిర్ణయించి 3 సార్లు వేలం వేసినారు. మెదటి సారి, రెండవసారి బ్యాంకు వారి నిర్లక్ష్యం కారణంగా వేలం పాట రద్దయింది. 3 వ సారి ప్రొసీజర్ సరిగా అనుసరించకుండా వేశారు. దానికి గాను మేము డ.ఆర్.టి లో కేసు వేసినాము. ప్రొసీజర్ అనుసరించకుండా వేలం వేసిన విషయమై కోర్టు నోటీసు పంపినా వాయిదా అడిగి వాయిదా తేది లోపల వేలం జరిగింది. నోటీసు కు సమాధానం చెప్పకుండా ఆస్తి వేలం వేశారు. నోటీసు ఆస్తి వున్న ప్రదేశంలో ప్రదర్శించకుండా అడ్డగోలుగా ఆస్తి వేలం వేసినారు. 3 వాయిదాలు కోరి డి. ఆర్.టి కి నకిలీ సాక్షాలు సమర్పించిన తర్వాత డి.ఆర్.టి సరైన సాక్ష్యాలు ఇవ్వడానికి గడువు ఇచ్చారు. ఈ గడువు తీరకముందే బ్యాంకు అ ఫ్ ఇండియా ఏ.ఆర్.బి, హైదరాబాద్, ఆథరైజ్డ్ ఆఫీసర్ వాళ్ళు దౌర్జన్యంగా ఖాళీ చేయించి ఆస్తిని స్వాదీనం చేసుకొని చట్టవిరుద్ధంగా వున్న స్థితిని అడ్డగోలుగా చట్టబద్ధంచేసుకొని తప్పించుకోవాలని క్రుట్రపన్నారు.సాక్ష్యంలో వున్న వ్యక్తి సమాచారం కూడా ఇవ్వటం లేదు.

## జీవో 396కు వ్యతిరేకంగా దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్




ప్రజాభూమి ప్రతినిధి
రేణిగుంట.
రేణిగుంట: జీవో నెం.396ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం పిలుపు మేరకు రేణిగుంటలో దస్తావేజు లేఖరులు 12 రోజుల పెన్‌డౌన్ ఉద్యమాన్ని ప్రారంభించారు. దస్తావేజుల తయారీని ప్రైవేట్ సేవా కేంద్రాలకు అప్పగించడం వల్ల తమ జీవనోపాధి కోల్పోతూ, తమ కుటుంబాల భవిష్యత్తు, దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 31 వరకు రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన దస్తావేజు సేవలు అందుబాటులో ఉండవని, ప్రభుత్వం పునరాలోచించి జీవోను రద్దు చేయాలని నిరసన తెలియజేస్తున్నారు.

# పిజిఆర్ఎస్ / రెవెన్యూ క్లినిక్ కు వినతులు అందజేసిన ప్రజలు

- వినతుల పరిష్కారంలో ఆలసత్యం వహిస్తే సహించేదిలేదు
- పి.జి.ఆర్.ఎస్., రెవెన్యు మొత్తం 264 వినతులు నమోదు
- రెవెన్యు మరియు సర్వే కి సంబంధించిన 205 వినతులు
- పెండింగు వినతులను పరిష్కరించి వెంటనే డిస్పోజ్ చేయాలి
- : -జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:
పెండింగు వినతులను పరిష్కరించి వెంటనే డిస్పోజ్ చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో ్రా+=ూ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, డి ఆర్ ఓ కె.మోహన్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, జిల్లాలోని జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్/రెవెన్యూ క్లినిక్ కు అందిన మొత్తం 264 వినతులు నమోదుకాగా అందులో అత్యధికంగా 205 రెవెన్యూ మరియు సర్వే శాఖవే ఉన్నాయి. పెండింగ్లో ఉన్న అర్జీలను ప్రత్యేకంగా సమీక్షించి వెంటనే పరిష్కరించాలని, ప్రజలకు న్యాయం జరిగేలా ప్రతి వినతిని నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ సమస్యలపై ఫోకస్ చేసి రైతుల రీ-సర్వే, భూ సమస్యలను నిర్ణిత గడువులోగా పరిష్కారించాలన్నారు. భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు వివాదాలు, రికార్డులలోని తప్పులు, విస్తీర్ణ వ్యత్యాసాల పై రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని, భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. అర్హులైన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లోనే పారదర్శకంగా సేవలు అందించాలని కలక్టరు రెవెన్యూ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. 1100 టోల్ ఫ్రీ ఫిర్యాదులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 1100 టోల్ ఫ్రీ సేవ ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత బాధ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి అర్జీదారునితో నేరుగా మాట్లాడిన తరువాతే నివేదికలు సమర్పించాలని, మాట్లాడిన తేదీ, సమయాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజల్లో 1100 సేవలపై మరింత అవగాహన కల్పించాలని సూచించారు. రెవెన్యూ మరియు సర్వే 205, డిఆర్డిఎ-24, పంచాయతీ రాజ్: 2, పోలీస్-6, పశుసంవర్ధక శాఖ-5, సివిల్ సప్లై-3, వ్యవసాయ శాఖ-2, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్-3, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ 2, ఐసిడిఎస్ 3, ఏపీఐఐసీ 1, అటవీ శాఖ-1, గనులు మరియు భూగర్భ శాఖ 1, మత్స్యశాఖ 2, గృహ నిర్మాణ శాఖ-2 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ శ్రీనివాసులు నాయుడు, డిప్యూటీ కలెక్టర్లు, పి మధుసూదన్ రావు, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్, పుల్లారెడ్డి , విజయలక్ష్మి,జిల్లాలోని వివిధ శాఖల ఉన్నత శాఖల తదితరులు అధికారులు పాల్గొన్నారు.

# హంద్రీనీవా పనులు చూసి వైసీపీకి వణుకు

- తట్టెడు మట్టి కూడా వేయని వాళ్లు అభివృద్ధిపై మాట్లాడటం విడ్డూరం
- ఈ సీజన్‌లోనే రైతులకు కృష్ణా జలాలు అందిస్తామని స్పష్టం
- రాచపల్లి వద్ద కాలువ విస్తరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఎమ్మెస్‌రాజు, పరిటాల శ్రీరామ్



ప్రజాభూమి, హిందూపురం టౌన్
హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతుండటాన్ని చూసి వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని మడకశిర ఎమ్మెల్యే, శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు ఎమ్మెస్ రాజు విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో హంద్రీనీవా కాలువ అభివృద్ధి కోసం తట్టెడు మట్టి కూడా వేయని వ్యక్తులు ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేపడుతున్న భారీ అభివృద్ధి పనులపై విమర్శలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని అన్నారు. ఈ సాగు సీజన్‌లోనే పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల రైతులకు కృష్ణా జలాలు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. సోమవారం ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌తో కలిసి హిందూపురం మండలం రాచపల్లి వద్ద రూ.790 కోట్లతో చేపడుతున్న 79 కిలోమీటర్ల హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులను ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలువ వెడల్పు, బండల నిర్మాణం, కాంక్రీట్ పనులు, యంత్రాల వినియోగం, నిర్మాణ నాణ్యత, పనుల పురోగతిపై సంబంధిత ఇంజినీర్లు, కాంట్రాక్టర్ ప్రతినిధులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. పనులు ఎక్కడా ఆలస్యం కాకుండా నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ, హంద్రీనీవా కాలువ పనులపై వైసీపీ నాయకులు చేసిన ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. వైసీపీ నాయకులు మీడియా సమావేశం పెట్టి పనులు నిలిచిపోయాయని, ఎలాంటి పురోగతి లేదని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని, అందుకే తాము నేరుగా పనులు జరుగుతున్న ప్రాంతానికే వచ్చి పరిశీలించామని తెలిపారు. ఇక్కడ పనులు ఏ స్థాయిలో జరుగుతున్నాయో ప్రజలందరూ చూస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవా కాలువ విస్తరణపై చిత్తశుద్ధితో వ్యవహరించి ఉంటే ఈ ప్రాంత రైతులకు ఇప్పటికే సాగునీరు అందేదని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయాలకే ప్రాధాన్యత ఇచ్చిన వైసీపీ ఇప్పుడు అభివృద్ధిపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిజానికి, అబద్ధానికి తేడా లేకుండా మాట్లాడటం రాజకీయ నాయకులకు తగదని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, లేకపోతే ప్రజలే సరైన సమయంలో తీర్పు చెబుతారని హెచ్చరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రజల్లో తమ ఉనికిని చాటుకునేందుకే వైసీపీ నాయకులు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని రాజు విమర్శించారు. అభివృద్ధి కనిపిస్తున్నా దాన్ని అంగీకరించలేక అసత్య ప్రచారానికి దిగడం వారి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. హంద్రీనీవా కాలువ విస్తరణ పూర్తయితే పెనుకొండ, హిందూపురం, మడకశిర ప్రాంతాల్లో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. రూ.790 కోట్ల వ్యయంతో జరుగుతున్న 79 కిలోమీటర్ల కాలువ విస్తరణ పూర్తయిన తర్వాత సుమారు 170 చెరువులకు కృష్ణా జలాలు చేరడంతో పాటు వేలాది ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందనుంది. భూగర్భ జలాల మట్టం పెరగడం, పంటల దిగుబడి మెరుగుపడటం, రైతుల ఆదాయం పెరగడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని నేతలు పేర్కొన్నారు. ఈ సీజన్‌లోనే కాలువ ద్వారా నీటిని విడుదల చేయడానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని, పనులు కూడా అదే లక్ష్యంతో వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. పరిశీలన అనంతరం పనుల్లో నిమగ్నమైన ఇంజినీర్లు, సిబ్బందితో నేతలు ప్రత్యేకంగా సమావేశమై, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత సహాయకులు బాలాజీ, మార్కెట్ యార్డు అధ్యక్షులు అశ్వర్థ నారాయణరెడ్డి, టీడీపీ రూరల్ కన్వీనర్ రాము, నాయకులు ఉమాశంకర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీవో 396పై దస్తావేజు లేఖరుల సమరశంఖం

## -ప్రైవేటీకరణ' నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే ఉద్యమం ఉధృతం -పెన్ డౌన్ నిరసనలో దస్తావేజు లేఖరులు



ప్రజాభూమి, హిందూపురం టౌన్
రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖరులు సోమవారం హిందూపురంలో ఆందోళనకు దిగారు. రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంఘం పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన పెన్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా హిందూపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. జీవో 396 పేరుతో రిజిస్ట్రేషన్ వ్యవస్థలో ప్రైవేట్ భాగస్వామ్యానికి ప్రభుత్వం మార్గం సుగమం చేస్తోందని, దీనివల్ల దశాబ్దాలుగా కొనసాగుతున్న దస్తావేజు లేఖరుల వ్యవస్థకు మనుగడ సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హిందూపురం సబ్‌రిజిస్ట్రార్ భాగ్యశేఖర్ రెడ్డికి దస్తావేజు లేఖరులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ నెల 31వ తేదీ వరకు నిరవధికంగా పెన్‌డౌన్ ఉద్యమాన్ని కొనసాగిస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు మాట్లాడుతూ, 1872 నుంచి కొనసాగుతున్న దస్తావేజు లేఖరుల వ్యవస్థకు ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానం వల్ల తీవ్ర ముప్పు ఏర్పడిందన్నారు. రిజిస్ట్రేషన్ వ్యవస్థలో ప్రైవేట్ సంస్థలకు అవకాశం కల్పించడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్ష మంది దస్తావేజు లేఖరులు, వారి కుటుంబాలు ఉపాధిని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు సేవలందిస్తున్న దస్తావేజు లేఖరులను పక్కనబెట్టి ప్రైవేట్ వ్యవస్థను తీసుకురావడం వల్ల వేలాది కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కొత్త విధానం అమల్లోకి వస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియలో గోప్యత దెబ్బతినే అవకాశం ఉందని, ప్రజల ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలు, వ్యక్తిగత సమాచారం ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. భూములు, ఇళ్లు, ఆస్తుల రిజిస్ట్రేషన్లలో అత్యంత గోప్యత అవసరమని, అలాంటి వ్యవస్థలో ప్రైవేట్ జోక్యం పెరగడం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని అభిప్రాయపడ్డారు. దస్తావేజు లేఖరులు కేవలం పత్రాలు రాసే వారే కాకుండా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు మార్గనిర్దేశం చేస్తూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించి జీవో 396ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, అనగాని సత్యప్రసాద్ తక్షణమే జోక్యం చేసుకుని దస్తావేజు లేఖరుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, జిల్లా కేంద్రాలు, కలెక్టరేట్లు, ప్రజాప్రతినిధుల కార్యాలయాల ఎదుట నిరసనలు చేపడతామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో హిందూపురం దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షులు హరీష్, లక్ష్మీనారాయణ, అత్తావుల్లా, బాలాజీ, మంజునాథ్, మణి, రాంప్రసాద్‌రావు, పూర్ణసాయి, జగన్మోహన్‌రెడ్డి, గిరిబాబు, హనుమంతరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, చంద్ర, ఇమ్రాన్, మహబూబ్ బాషా, ఇర్ఫాన్, అశోక్, అదిల్, రామాంజి, వేణుగోపాల్, రఫీక్, ఉదయ్ తదితర దస్తావేజు లేఖరులు పాల్గొన్నారు.

# ద్రౌపది మాత కళ్యాణం కమనీయం,కడు రమణీయం

- అమ్మవారి కళ్యాణాన్ని తిలకించడానికి కదలి వచ్చిన భక్త జనసంద్రం
- ఆలయానికి పోటెత్తిన విరాళాలు
- వేదమంత్రాలతో సాంప్రదాయ బద్ధంగా సాగిన కళ్యాణ తంతు



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం,
రామచంద్రాపురం మండలంలో నిలువు రాళ్ల కమ్మపల్లి గ్రామంలో వెలసివున్న శ్రీకృష్ణ పాండవుల సమేత ధర్మరాజుల ఆలయంలో 60వ మహాభారత వార్షికోత్సవాలలో భాగంగా నాలుగవ రోజైన సోమవారం ఆది గర్భేశ్వరి శ్రీ ద్రౌపతి మాత కళ్యాణం మంగళ వాయిద్యాల మధ్య కమనీయంగా,కడు రమణీయంగా సాగింది. వేదమంత్రాలతో పౌరోహితులు మాడభూషిత రాజగోపాల్ అయ్యంగార్ ,ప్రదీప్ అయ్యంగార్ల బృందం కళ్యాణ తంతును ఎంతో సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. కళ్యాణంలో ప్రధాన ఘట్టమైన ఎదురుకోలు సన్నివేశాన్ని చక్కటి లయబద్ధకమైన నాట్యంతో అందరిని ఆనంద పరవశులు గావించారు. కళ్యాణ వేదికను దివంగత అర్చకులు బ్రహ్మర్షి వెంకటరత్నం ఆచారి దివ్య ఆశీస్సులతో ప్రధాన అర్చకులు హరి స్వామి అర్చకులు అరవింద ఆచార్యులు స్వామివారి శిష్య బృందం నానావిధ పరిమళ పుష్పాల తోరణాలతో ఎంతో చక్కగా అలంకరించారు.కళ్యాణ మండపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మగారి పల్లికి చెందిన సుబ్బరామనాయుడు తొలిసమ్మ కుటుంబ సభ్యులు సతీష్ ,లైలా దంపతులు ఉభయ దారులుగా అమ్మవారికి కుమ్మరిలతో చేయబడిన అరిమేని కుండలను వివిధ రకాల పిండి వంటలు,నానా విధ పండ్లు,పట్టు వస్త్రాలతో సారే సమర్పించారు. పలువురు దంపతులు నిర్ణీత రుసుము చెల్లించి కళ్యాణంలో పాల్గొన్నారు.ఉభయ దారుల కుటుంబం మూడు పూటలా భక్తులకు పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ గావించారు. కళ్యాణానికి వచ్చిన వారందరికీ పసుపు దారం,పసుపు కుంకుమ,పండ్లు పంచిపెట్టారు. పాబోలు వంశీకులు సాయి ప్రసాద్ బాబు ,బాలాజీ, పార్థసారథి భక్తుల వద్ద విరాళాలను అందిపుచ్చుకొని ఎప్పటికప్పుడు మైక్ లో ప్రకటిస్తూ మరింత మందిని చైతన్యపరిచారు.ధర్మకర్తలు రమేష్ బాబు ,రవికుమార్ లు గ్రామ పెద్దలతో కలిసి ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి లోటు రాకుండా చర్యలు చేపట్టారు. అమ్మవారి కళ్యాణాన్ని తిలకించటానికి వచ్చిన భక్తులతో ఆలయం జనసంద్రంగా మారింది.

వీనుల విందుగా హరికథ గానం: పంచమ వేద 60వ మహాభారత ఉత్సవాలలో నాలుగవ రోజు మధ్యాహ్నం హరికథ భాగవతారిణి స్వర్ణలత ద్రౌపతి స్వయం వరాన్ని చక్కటి గాత్రంతో వినిపించారు.దృపదుని ఇంట యజ్ఞ కుండలిలో జన్మించిన శ్రీ ద్రౌపతి అమ్మవారిని అర్జునుడు స్వయంవరంలో మత్స్య యంత్రాన్ని ఛేదించి వివాహం చేసుకున్నాడు. పాండవుల తల్లి కుంతీదేవి ఆజ్ఞతో ఐదుగురు పాండవులకు ద్రౌపతి ధర్మపత్ని అయింది.ద్రౌపతి స్వయంవరం కథనం నేపథ్యంగా తీసుకుని శ్రీ వెంకటేశ్వర నాట్య కళామండలి వారు కిరణ్ బృందం రాత్రి చక్కటి పౌరాణిక నాటక ప్రదర్శన గావించారు.ద్రౌపతి కళ్యాణం సందర్భంగా ప్రధాన అర్చకులు హరి స్వామి, అర్చకులు అరవింద ఆచార్యులు,స్వామివారి శిష్య బృందం,ఘన ఆచార్యులు ,బటాచార్యులు ఈశాన్య భాగంలో ఉన్న బావి నుంచి పోతురాజులు స్వామి తోడు రాగా తంబల మేళాలతో , దివిటీ వెలుగులలో పవిత్ర జలాన్ని తీసుకొని వచ్చి ఆలయంలోని సపరివార దేవతలకు ప్రత్యేక పూజలు చేసి మూడు పూటలా ధూప దీప నైవేద్యాలు సమర్పించారు.

# యోగ సభా ప్రాంగణం ప్రారంభం



ప్రజాభూమి, హిందూపురం టౌన్ హిందూపురం రూరల్ మండలం పరిధిలోని పూలకుంట ప్రాథమిక పాఠశాలలో సోమవారం యోగా సభ ప్రాంగణాన్ని ప్రారంభించారు. యోగ ప్రాంగణం ఏర్పాటు కోసం లోటస్ విద్యా సంస్థ చైర్మన్ నీలకంఠ రెడ్డి రూ.లక్ష సొంత నిధులను వెచ్చించి సిద్ధం చేయించారు. ఈ నేపథ్యంలో మండల విద్యాశాఖ అధికారులు డాక్టర్ ఏహెచ్ గంగప్ప, ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలో సంపన్నులు ఎంతోమంది ఉన్నప్పటికీ అందరికీ దానగుణం ఉండదన్నారు. మానవసేవయే మాధవసేవ అన్న గాంధీ తత్వాన్ని నీలకంఠ రెడ్డి నిజం చేశారని తెలిపారు. ఇందులో భాగంగా నీలకంఠరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయరాణి, చందన, సరస్వతి, పావని, వరలక్ష్మి, సుధారాణి పాల్గొన్నారు.

# పుత్తూరు బాలిక హాస్టల్లో తక్షణమే త్రాగునీటి బోరు ఏర్పాటు చేయాలని వినతి పత్రం



ప్రజా భూమి ప్రతినిధి పుత్తూరు.
తిరుపతి కలెక్టరేట్ లో పి జి ఆర్ ఎస్ లో డిఆర్ఓ కి దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.నందయ్య పుత్తూరు సిపిఎం పార్టీ కార్యదర్శి ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. వారు మాట్లాడుతూ గత మూడు నెలలుగా త్రాగునీటి బోరు చెడిపోవడంతో బాలికలు నీటి కొరతతో చాలీచాలని నీళ్లతో అవస్థ పడుతున్నారు. నీళ్లు బయట నుంచి కూడా బకెట్లో తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం పుత్తూరు కమిషనర్ వాటర్ ట్యాంకుల ద్వారా నీళ్లు పంపిణీ జరుగుతున్నవి. అయితే శాశ్వత నీటి సమస్య తీరాలంటే కొత్తగా నీటి బోరు వేసి తీర్చాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయాలని, అదేవిధంగా అద్దె భవనంలో ఉన్న బాలుర మరియు బాలికల హాస్టలను కొత్తగా భవనం ఏర్పాటు చేయాలని కోరడమైనది. ఈ విషయమై స్పందించిన డిఆర్ఓ జి.నరసింహులు హాస్టల్లో తక్షణమే బాలికలకు నీటి బోరు ఏర్పాటు చేస్తామని, మెనూ ప్రకారం భోజనం కూడా ఏర్పాటు చేస్తామని, అద్దె భవనంలో ఉన్న బాలుర మరియు బాలికలకు కొత్త భవనాలు కూడా ప్రతిపాదనలో ఏర్పాటు చేస్తామని,హాస్టల్ సమస్యలన్నీ పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కె.హరిబాబు, జి.శ్రీనివాసులు, ఏ.శివ తదితరులు పాల్గొన్నారు.

# స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద ఆసుపత్రి కార్మికులకు నెలకు రూ.26,000 కనీస వేతనం అమలు చేయాలి.

## జూలై 25న టీటీడీ పరిపాలన భవనం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయండి -- సిఐటియు పిలుపు



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.
రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో జూలై 1 నుండి 30 వరకు నిర్వహిస్తున్న కనీస వేతనాల ప్రచార కార్యక్రమంలో భాగంగా నేడు స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐటియు నగర ఉపాధ్యక్షులు కే. వేణుగోపాల్ మాట్లాడుతూ, స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద ఆసుపత్రుల్లోని 48 విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సేవలందిస్తున్నప్పటికీ వారికి నెలకు రూ.26,000 కనీస వేతనం కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా ఆసుపత్రుల్లో రోగులకు సేవలందిస్తూ, పరిశుభ్రత, భద్రత, రోగుల సంరక్షణ వంటి కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న కార్మికులు తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, ఇళ్ల అద్దెలు, పిల్లల విద్య, వైద్య ఖర్చుల నేపథ్యంలో ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలు ఏమాత్రం సరిపోవడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సొసైటీ కార్మికుడికి నెలకు రూ.26,000 కనీస వేతనం అమలు చేయాలని, ముఖ్యంగా టీటీడీ పరిధిలో పనిచేస్తున్న స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద ఆసుపత్రి కార్మికులకు వెంటనే ఈ వేతనాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని, టీటీడీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం 25వ తేదీన టీటీడీ పరిపాలన భవనం వద్ద నిర్వహించనున్న ధర్నాలో కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్విమ్స్ కార్మికుల సంఘం అధ్యక్షులు వి. సూరితో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# 75 శాతం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీ



ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు
మండలంలోని రైతులకు 75 శాతం సబ్సిడీ ధరలపై పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేస్తున్నట్టు స్థానిక ఇరుగుళం పశువైద్యాధికారి డాక్టర్ దయాకర్ పేర్కొన్నారు.మొక్కజొన్న గడ్డి విత్తనాలు ఒక కిలో 68 రూపాయలు కాగా సబ్సిడీ పోను రైతులు ఒక ఒక కిలో 15 రూపాయలు చెల్లించాలి అన్నారు.ఈ నేపథ్యంలో ఐదు కిలోల బ్యాగు కోసం 85 రూపాయలు చెల్లించాలన్నారు.అలాగే జొన్న గడ్డి విత్తనాలు ఒక కిలో 92 రూపాయలు కాగా 75 శాతం సబ్సిడీ పోను ఒక కిలో 23 రూపాయలు చెల్లించాలన్నారు.అదే ఐదు కిలోల జొన్న గడ్డి విత్తనాల బ్యాగు కోసం రైతులు 115 రూపాయలు చెల్లించాల్సి ఉందన్నారు.పశుగ్రాస విత్తనాలు కోసం రైతులు ఆధార్ కార్డు,పట్టాదారు పాస్ పుస్తకంతో వెటర్నరీ అసిస్టెంట్లను సంప్రదించి తీసుకెళ్లొచ్చు అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# తిరుపతి నుండి యూకేకు తొలి మామిడి గుజ్జు ఎగుమతి ప్రారంభం



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
భారత్-యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్ టి ఏ) అమల్లోకి వచ్చిన నేపథ్యంలో, తిరుపతికి చెందిన శ్రీ వర్ష ఫుడ్స్ సంస్థ యూకేకు తొలి మామిడి గుజ్జు (మ్యాంగో పల్ప్) ఎగుమతి కంటైనర్‌ను ప్రారంభించింది.ఈ కార్యక్రమంలో ఏపీడీఏ ప్రాంతీయ ఏజీఎం ఆర్. పి. నాయుడు, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ శ్రీ ఫణి కిరణ్, ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ దేవముని రెడ్డి, తిరుపతి జిల్లా ఉద్యాన శాఖ అధికారి జయభారత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి జయభారత్ రెడ్డి మాట్లాడుతూ, భారత్-యూకే ఎఫ్‌టీఏ ద్వారా ఆంధ్రప్రదేశ్ ఉద్యాన ఉత్పత్తులకు కొత్త ఎగుమతి అవకాశాలు లభిస్తాయని, తిరుపతి నుంచి తొలి మామిడి గుజ్జు ఎగుమతి ప్రారంభం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు.

# ఎరువుల పంపిణీలో పూర్తి పారదర్శకత

**- పక్కదారి అనే మాట లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు**
**- ఏపీఎయిమ్స్‌తో అన్నదాతలకు స్మార్ట్ సేవలు**
**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:
రైతులకు నాణ్యమైన ఎరువులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పంట విస్తీర్ణానికి అనుగుణంగా పూర్తి పారదర్శకంగా అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఎరువుల పంపిణీలో పక్కదారి పట్టే అవకాశాలకు పూర్తిగా చెక్ పెడుతూ, ఆధునిక సాంకేతికత ఆధారంగా ఎరువుల సరఫరా ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.కలెక్టర్ లక్ష్మీశ సోమవారం విస్సన్నపేటలో పీఏసీఎస్-ఎరువుల సరఫరా కేంద్రాన్ని పరిశీలించారు. ఎరువుల పంపిణీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ వ్యవసాయ సమాచార నిర్వహణ వ్యవస్థ (ఏపీఎయిమ్స్) యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకుని సమగ్ర వ్యవసాయ సేవలను పొందాలని సూచించారు.

ప్రతి ఎరువుల దుకాణంలో ప్రత్యేక సమాచార కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యలు ఉంటే కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ నంబర్ 91549 70454 లేదా స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ఉద్యాన పంటలు, స్వల్పకాలిక వరి రకాలు, అంతర పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. దీంతో నీటి వినియోగం తగ్గడంతో పాటు పంట నష్టాల ప్రమాదం తగ్గి మెరుగైన దిగుబడి, ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు. కలెక్టర్ లక్ష్మీశ స్థానికంగా ఉన్న సేంద్రియ వ్యవసాయ క్షేత్రాన్ని కూడా సందర్శించారు. అక్కడ అమలవుతున్న ప్రకృతి సేద్య విధానాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి సేద్యం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని, ఆరోగ్యాన్ని ఇచ్చే వ్యవసాయ ఉత్పత్తులను పొందొచ్చని పేర్కొన్నారు.

## కుటుంబ నియంత్రణ జనాభా నియంత్రణకు మాత్రమే పరిమితం కాదు

# దీని ప్రభావం తల్లి–శిశు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది



**కుటుంబ నియంత్రణ అనేది కేవలం జనాభా నియంత్రణకే పరిమితం కాకుండా తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణకు, కుటుంబ ఆర్థికాభివృద్ధికి, సమాజ శ్రేయస్సుకు ఎంతో కీలకం**
**ప్రపంచ జనాభా దినోత్సవం-2026 సందర్భంగా కుటుంబ నియంత్రణ లబ్ధిదారులకు లక్కీ డ్రా**
**విజేతలకు ఒక్కొక్కరికి రూ.5,000 నగదు ప్రోత్సాహకం: కలెక్టర్ డా.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:
ప్రపంచ జనాభా దినోత్సవం-2026 సందర్భంగా కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరం నందు సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక లక్కీ డ్రా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా పాల్గొని విజేతలను ఎంపిక చేశారు. ఎంపికైన లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ మాట్లాడుతూ, కుటుంబ నియంత్రణ అనేది కేవలం జనాభా నియంత్రణకే పరిమితం కాకుండా తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణకు, కుటుంబ ఆర్థికాభివృద్ధికి, సమాజ శ్రేయస్సుకు ఎంతో కీలకమని అన్నారు. శాశ్వత కుటుంబ నియంత్రణతో పాటు తాత్కాలిక కుటుంబ నియం త్రణ పద్ధతులైన పిపిఐయుసిడి, అంతరా ఇంజెక్షన్ వంటి ఆధునిక పద్ధతులను ప్రజలు విస్తృ తంగా వినియోగించాలని సూచించారు. అర్హులై న దంపతులు ప్రభుత్వ వైద్య సంస్థల్లో అందుబాటులో ఉన్న కుటుంబ నియంత్రణ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జూలై 11, 2026న ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకున్న అర్హులైన దంపతులు, ప్రసవానంతరం పిపిఐయుసిడి వేయించుకున్న లబ్ధిదారులు, అంతరా ఇంజెక్షన్ వినియోగించిన మహిళలలో లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. కుటుంబ నియంత్రణ పద్ధతులను ప్రజల్లో ప్రోత్సహించడంతో పాటు, చిన్న కుటుంబం – సంతోషకరమైన కుటుంబం అనే భావనను బలో పేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ముగ్గురు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న దంపతులలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకున్న లబ్ధిదారుల విభాగంలో విజేతలుగా రాణిగారి తోట యుపిహెచ్సి పరిధిలోని తమ్మిశెట్టి మల్లేశ్వరి, గిరిపురం యుపిహెచ్సి పరిధిలోని షేక్ నజియా, విజయవాడ రూరల్ పరిధిలోని భవారి అంజ లి విజేతలుగా నిలిచారు. పిపిఐయుసిడి వేయించుకున్న లబ్ధిదారుల విభాగంలో సింగ్ నగర్ పరిధిలోని కె.తేజావతి, క్రీస్తురాజపురంకి చెందిన డి.మరియమ్మ విజేతలుగా నిలిచారు. అంతరా ఇంజెక్షన్ వినియోగించిన లబ్ధిదారుల విభాగంలో ఇబ్రహీంపట్నం పరిధికి చెందిన జి.సాగర రాణి, కొండూరు పరిధికి చెందిన కె.నరసమ్మ విజేతలుగా నిలిచారు.చివరిగా కుటుంబ నియంత్రణకు సంబంధించిన సమా చారం గోడ పత్రికను జిల్లా కలెక్టర్ చేతుల మీదు గా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.శ్రావణబాబు, ఎన్టీఆర్ వైద్య సేవా కార్యక్రమ జిల్లా అధికారి డా. సుమన్, జిల్లా గణాంక అధికారి, వైద్య మరియు ఆరోగ్య శాఖకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

# షైనింగ్ స్టార్.. ప్రతిభకు పట్టం!

**- జిల్లాలో 175 మందికి షైనింగ్ స్టార్స్ పురస్కారాలు**
**- మెరిసిన విద్యాతారలు.. స్వర్ణాంధ్రకు వారధులు**
**- వికసిత్ భారత్ సాకారానికి కీలక భాగస్వాములు**
**- ప్రభుత్వ ప్రోత్సాహంతో దేశానికి ఆదర్శవంతులుగా ఎదగాలి**
**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను షైనింగ్ స్టార్స్ పురస్కారాలతో ప్రతిభకు పట్టంకడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని.. ఈ చేయూతతో భవిష్యత్తులో దేశానికి ఆదర్శవంతులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. పాఠశాల విద్య, సమగ్రశిక్ష, ఇంటర్మీడియెట్ విద్యా శాఖల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సోమవారం నగరంలోని మారిస్ స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో షైనింగ్ స్టార్స్ ప్రతిభా పురస్కారాలు-2026 కార్యక్రమం జరిగింది. కలెక్టర్ లక్ష్మీశ, శాసనసభ్యులు గద్దె రామమోహన్, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఏపీ కుమ్మరి, శాలివాహన సంక్షేమం, అభివృద్ధి కార్పొ రే షన్ ఛైర్మన్ పి.ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎం.ఎస్.బేగ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన 135 మందితో పాటు ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మరో 40 మంది విద్యార్థులకు రూ. 20 వేల నగదు బహుమతితో పాటు పతకం, సర్టిఫికెట్ అందించి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ తాను ఐదో తరగతి చదువుతున్నప్పుడు మంచి మా ర్కులు సాధించినందుకు బహుమతిగా ఒక డిక్షనరీ అందుకున్నానని గుర్తు చేసుకున్నారు. ఆ డిక్షనరీని తన తల్లికి చూపించినప్పుడు ఆమె ముఖంలో కనిపించిన ఆనందం తన జీవితాంతం మరచిపోలేని జ్ఞాపకంగా నిలిచిపోయిందన్నారు. ఆ ఆనందాన్ని ఎప్పటికీ నిలబెట్టాలనే సంకల్పమే తనను ఐఏఎస్‌గా తీర్చిదిద్దిందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సాహంతో మరిం త మంది షైనింగ్ స్టార్‌లుగా ఎదగాలని.. దీర్ఘకాలంలో మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఇంత మంచి అవకాశం కల్పిస్తున్న ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రికు విద్యార్థుల తరపున ధన్యవా దాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. సభా ధ్యక్షులు, శాసనసభ్యులు గద్దె రామమోహన్ మాట్లాడుతూ షైనింగ్ స్టార్స్ అందరికీ అభినందనలు తెలియజేస్తున్నానని.. విద్యతోనే ఒక కుటుంబం దశ, దిశ మారుతుందని, అందుకే ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రివర్యులు విద్యారంగం అభివృ ద్ధికి విశేష కృషిచేస్తున్నారన్నారు.

సీఎం మొద ట్నుం చీ మహిళా శక్తి సాధికారతకు పెద్దపీట వేస్తు న్నారని, నేటి షైనింగ్ స్టార్స్‌లో ఎక్కువ మంది అమ్మాయిలే ఉండటం ఆ కృషి ఫలిత మేనని పేర్కొన్నారు. యువశక్తి దేశాభివృద్ధికి ప్రధాన మని, యువత చెడు అలవాట్ల వైపు వెళ్లకుండా బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగా లని శాసన సభ్యులు సూచించారు.20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ మాట్లా డుతూ.. దేశాన్ని 2047 నాటికి విశ్వగురుగా మార్చేందు కు ప్రధానమంత్రి, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో ముందంజలో నిలపడానికి స్వర్ణాంధ రూపకల్పనకు సీఎం కృషిచేస్తున్నారన్నారు. దేశ సమగ్రాభివృద్ధికి అత్యుత్తమ మానవ వనరు లు కీలకమని.. అందుకే నూతన జాతీయ విద్యావిధానం తెచ్చారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల ద్వారా అత్యుత్తమ విద్యను అందించేందుకు కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుంటూ షైనింగ్ స్టార్స్ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఏపీ కుమ్మరి, శాలివాహన సంక్షేమం, అభివృద్ధి కార్పొ రే షన్ ఛైర్మన్ పి.ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎం.ఎస్.బేగ్.. ఇంత మంచి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని.. ఇంతటితో ఆగకుండా ఈ విజయం స్ఫూర్తితో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాకారానికి కృషిచేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి బి.ప్రభాకరరావు, సమగ్రశిక్ష ఏపీసీ ఆర్.రమేష్‌బాబు, మారిస్ స్టెల్లా కళాశాల నుంచి డా. సిస్టర్ ఇన్నాసమ్మ, జిల్లా విద్యాశాఖ, సమగ్ర శి క్ష అధికారులు, సిబ్బంది సూరిబాబు, జీవీ రమణ, షేక్ ఉమర్ అలీ, కె.పిచ్చేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, అశోక్‌బాబు, ఏవీవీ ప్రసాదబాబు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ప్రజలకు భరోసాగా నిలవాలి

**పరిష్కరించిన ఫిర్యాదు తిరిగి పునరావృతం కాకూడదు**
**ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవు**
**సత్వర, నాణ్యమైన పరిష్కారమే ప్రజల సంతృప్తికి కొలమానం....**
**జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:
ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు బాధ్య తా యుతంగా వ్యవహరించి, ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో పెం డింగ్, పరిష్కరించిన ఫిర్యాదులపై సమీక్ష నిర్వ హిం చారు.ఈ సందర్భంగా కలెక్టర్ డా.లక్ష్మీశ మాట్లాడుతూ ఒకసారి పరిష్కారం చూపిన ఫిర్యాదు తిరిగి ప్రారంభమయ్యే పరిస్థితి రాకుం డా శాశ్వత పరిష్కారం అందించాలని సూచిం చారు. ఫిర్యాదుల పరిష్కారం కేవలం నామ మాత్రంగా కాకుండా ఫిర్యాదుదారుడు పూర్తిగా సంతృప్తి చెందే విధంగా ఉండాలన్నారు. సమస్య లు వెంటనే పరిష్కరించలేని పరిస్థితుల్లో కారణాలను స్పష్టంగా వివరించి అర్జీదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి అర్జీని పూర్తిగా పరిశీలించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలన నిర్వహించి నాణ్యమైన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశిం చారు. రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న కలెక్టర్, ప్రజలు ప్రభుత్వంపై నమ్మ కంతో తమ సమస్యలను తీసుకొస్తున్నందున వాటిని తమ సమస్యలుగా భావించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కా రంలో నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శించే అధికా రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈరోజు నిర్వహించిన పిజిఆ ర్ఎస్ సమావేశం ద్వారా 251 అర్జీలను స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్ సేవలపై క్యూ.ఆర్ కోడ్ ద్వారా ప్రజాభిప్రాయం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్యూ.ఆర్ కోడ్ ఆధారిత ఫీడ్‌బ్యాక్ విధానాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ డా.లక్ష్మీశ తెలిపారు. జిల్లా, మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాలు, హెల్ప్‌డెస్కులు, ఫిర్యాదుల కౌంటర్లు, నోటీసు బోర్డులు తదితర ప్రదేశాల్లో క్యూ.ఆర్ కోడ్‌ను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రజలు సేవలు పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్ ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సేవలపై తమ అభిప్రాయాన్ని తెలియజేయ వచ్చన్నారు. ఈ విధానం ద్వారా ప్రజల సంతృప్తి స్థాయిని అంచనా వేసి సేవల నాణ్యతను మరింత మెరుగుపరుస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎం.లక్ష్మీనరసింహ, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# విజయానికి పాఠ్యపుస్తకాలే బలమైన పునాది

**ఇతరులతో పోల్చుకోవద్దు..షైనింగ్ స్టార్స్–2026లో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాల ప్రదానం చేసిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా
విద్యార్థులు పాఠ్యపుస్తకాలను లోతుగా చదివే అలవాటు పెంపొందించుకోవాలని, నోట్స్‌పై మాత్రమే ఆధారపడకుండా స్వయంగా చదివి అర్థం చేసుకునే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి విద్యార్థులకు ఉద్బోధించారు.సోమవారం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన షైనింగ్ స్టార్స్–2026 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, విలువైన పుస్తకాలను అందజేసి అభినందించారు.కృష్ణా జిల్లాలో ఈ ఏడాది మొత్తం 217 మంది విద్యార్థులు షైనింగ్ స్టార్స్‌గా ఎంపికయ్యారు. వీరిలో పదో తరగతికి చెందిన 168 మంది, ఇంటర్మీడియట్‌కు చెందిన 49 మంది ఉన్నారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి రూ.20 వేల నగదు బహుమతి, పతకం, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఇందుకోసం జిల్లాలో మొత్తం రూ.43.40 లక్షల ప్రోత్సాహకంగా పంపిణీ చేశారు.అనంతరం విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన తన విద్యార్థి దశ అనుభవాలను పంచుకున్నారు. పాఠ్యపుస్తకాలను స్వయంగా చదివి అర్థం చేసుకునే అలవాటు తన విజయానికి బలమైన పునాది అయిందన్నారు. క్రమశిక్షణ, సమయపాలన, నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసం విజయానికి కీలకమని చెప్పారు. మార్కుల కంటే నేర్చుకునే సామర్థ్యం ముఖ్యమని, ఇతరులతో పోల్చుకుంటూ అనవసర ఒత్తిడికి గురికాకుండా, నిన్నటి తనకంటే ఈరోజు మెరుగ్గా ఉండాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు.కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు



సాధించిన విద్యార్థులను గుర్తించి ఒక్కొక్కరికి రూ.20 వేల నగదు బహుమతి అందించడం ద్వారా వారి ప్రతిభకు గౌరవం లభిస్తుందని అన్నారు. ఇలాంటి గుర్తింపు విద్యార్థుల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచి ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తుందన్నారు. ఈ పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో పాటు, ఇతర విద్యార్థులకు కూడా ప్రేరణగా నిలిచి మరింత కష్టపడి చదివేలా చేస్తాయని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలుగు భాషను నేర్చుకుని ప్రజలతో మమేకమవుతూ విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని కొనియాడిన కొనకళ్ల నారాయణరావు, పాఠశాలల సందర్శనల ద్వారా విద్యా ప్రమాణాల మెరుగుదలకు కలెక్టర్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని అన్నారు.కార్యక్రమంలో డీఈవో యు వి సుబ్బారావు, డిఐఈఓ సరళ, సమగ్ర శిక్ష ఏపీసి ఆర్ కుముదిని సింగ్, రాష్ట్ర గిడ్డంగుల నిర్వహణ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ నాని, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, డిప్యూటీ డీఈవోలు శేఖర్ సింగ్, పద్మారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న గొల్లిపాలెం యానాదుల హత్యలపై నిరసన జ్వాల



**హంతకులను వెంటనే అరెస్ట్ చేయాలి.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి**
**మచిలీపట్నం కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో 'జాతీయ యానాది మహానాడు' ఆధ్వర్యంలో బృహత్ ధర్నా**
**బాధితులకు మద్దతు తెలిపిన కృష్ణా జిల్లా బీజేపీ అధ్యక్షుడు**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి
కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం చిన్న గొల్లిపాలెంలో యానాది సామాజిక వర్గానికి చెందిన శెట్టి సుబ్బన్న, గొలుసు అయ్యప్పలను అత్యంత దారుణంగా హత్య చేసిన నేరస్తులను వెంటనే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో నిరసనజ్వాలలు మిన్నంటాయి. జాతీయ యానాది మహానాడు నాయకుల పిలుపు మేరకు సోమవారం మచిలీపట్నం కలెక్టరేట్‌లోని ధర్నా చౌక్ వద్ద బాధితులు, సంఘం నాయకులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలిఈ సందర్భంగా జాతీయ యానాది మహానాడు నాయకులు మాట్లాడుతూ... అమాయకులైన సుబ్బన్న, అయ్యప్పలను పొట్టనబెట్టుకున్న నిందితులను పోలీసులు తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నిందితులపై కేవలం హత్యా నేరమే కాకుండా, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి బాధితులకు తగిన న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

గిరిజనులపై జరుగుతున్న దాష్టీకాలను సహించేది లేదని, బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు."సామాజికంగా వెనుకబడిన యానాదులపై జరుగుతున్న అన్యాయాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలి. సుబ్బన్న, అయ్యప్పల కుటుంబాలకు తక్షణమే న్యాయ సహాయం అందించాలి."— జాతీయ యానాది మహానాడు నాయకులుబాధితులకు బీజేపీ సంఘీభావంధర్నా చౌక్‌లో యానాది బాధితులు చేస్తున్న ఆందోళనకు కృష్ణా జిల్లా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షుడు నేరుగా హాజరై తన పరిపూర్ణ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హత్యకు పాల్పడిన ఎంతటి వారైనా చట్టం ముందు నేరస్తులేనని, వారిని తక్షణమే అరెస్ట్ చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పూర్తి స్థాయిలో మద్దతుగా ఉంటుందని హామీ ఇచ్చారు.అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ యానాది మహానాడు నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు మరియు పెద్ద ఎత్తున గిరిజన ప్రజలు పాల్గొన్నారు.


Printed by Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at and published at DOOR NO. 19-4-378, S T V NAGAR, NEAR OLD TVS SHOW ROOM, OPPOSITE TIRUPATHI (URBAN) editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .PRGINo. "APTEL/25/A2316,Phone No. Cell : 9502116677

# సీడ్ రైతులకు పంట డబ్బులు వెంటనే చెల్లించాలి




ప్రజాభూమి ప్రతినిధి - నూజివీడు

సీడ్ మొక్కజొన్నను కొనుగోలు చేసిన కంపెనీలు తక్షణమే డబ్బులు రైతులకు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చలసాని వెంకట రామారావులు రాష్ట్రప్రభుత్వం డిమాండ్ చేశారు. సీడ్ కంపెనీలు రైతులతో చేసుకున్న ఒప్పందం మేరకు దిగుబడి తగ్గిన రైతులకు ఆ మేరకు నష్టపరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆఫీస్ వద్ద సీడ్ మొక్కజొన్న సాగు చేసి నష్టపోయిన రైతులు ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.జమలయ్య ,చలసాని రామారావు మాట్లాడుతూ నూజివీడు మండలంలో సింజంటా, విజయలక్ష్మి అడ్వెంటా,శ్రీకర,బేయర్ తదితర కంపెనీలు పలు గ్రామాల్లో రైతులతో ఒప్పందాలు చేసుకొని ఎకరానికి నాలుగు నుంచి ఐదు టన్నులు దిగుబడి వస్తుందని టన్నుకు రూ.30 వేలు నుంచి 40 వేల రూపాయలకు కొనుగోలు చేస్తామని నమ్మించి మోసం చేశారు. ఈ రోజు నాటికి సుమారు రూ.100 కోట్లపైగా బకాయిలను రైతులకు చెల్లించాలన్నారు. కంపెనీ ప్రతినిధులు చెప్పిన ప్రకారం దిగుబడి రాకపోగా తీవ్రంగానష్టపోయారన్నారు. దిగుబడి వచ్చిన మేరకు ఆ పంటను కంపెనీ ప్రతినిధులు తీసుకెళ్లి నాలుగు నెలలైనా ఎంత వరకు ఒక పైసా చెల్లించకపోవడం వల్లే ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే పంట తాలూకా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కంపెనీ ఆర్గనైజర్లు రైతులతో చేసుకున్న ఒప్పందం ప్రకారం తగ్గిన దిగుబడి మేరకు టన్నుకు రూ.30 వేలు చొప్పున రైతులకు చెల్లించి ఆదుకోవాలని కోరారు. గత రబీలో సాగు చేసిన మొక్కజొన్న సీడ్ లో నాణ్యత లేకపోవడం వలనే ఎకరానికి నాలుగు నుంచి ఐదు నుంచి రావలసి ఉండగా కేవలం టన్ను నుంచి టన్నున్నర మాత్రమే దిగుబడి వచ్చిందని తగ్గిన దిగుబడి మేరకు పరిహారం ఇవ్వమని అడిగితే కంపెనీలు మొఖం చాటేస్తున్నాయన్నారు. పండిన పంట తీసుకెళ్లిన 4 నెలల అవుతున్నా డబ్బులు ఇవ్వమని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని రైతుల నమ్మించి మోసగించిన కంపెనీ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కంపెనీ తరపున కంపెనీ ప్రతినిధులు ఆర్గనైజర్లుకలసి చదువు లేని రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని రైతాంగాన్ని మోసగించడం దుర్మార్గమని అటువంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులను మోసగించిన సీడ్ కంపెనీలు భవిష్యత్తులో నూజివీడు ప్రాంతంలో సాగుచేయకుండా బహిష్కరించాలని కోరారు. నూజివీడు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ మాట్లాడుతూ నియోజకవర్గంలో 50 గ్రామాల్లో పైగా 15 కంపెనీలు మొక్కజొన్న సీడ్ ఇచ్చి సాగు చేయమని చెప్పారన్నారు. మంచి దిగుబడులు వచ్చి ఆదాయం పెరుగుతాయని చెప్పి నమ్మించి మోసం చేశారన్నారు. సీడ్ కంపెనీలు రైతులను నిలువున దోపిడీ చేస్తుంటే స్థానిక వ్యవసాయ అధికారులు ఏమి పట్టనట్లు వ్యవహరించడం అన్యాయం అన్నారు. వినత పత్రం అందుకున్న సబ్ కలెక్టర్ స్పందించి రైతులను ఆదుకోవడానికి జులై 22వ తేదీన రైతులు, కంపెనీ యాజమాన్యాలతోను, వ్యవసాయ అధికారులతోను తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు ,ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొంత కృష్ణ, నియోజకవర్గ వై సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మదుపల్లి నాగేంద్ర నాగేంద్రరావు, నాయకులు కూచిపూడి నాగేశ్వరావు, చెంగల వెంకటేశ్వరరావు, బొప్పుడి రాంబాబు, యాదాల సురేష సాల్మన్ రాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయిలో మెరిసిన విద్యా రోహిణి షైనింగ్ స్టార్స్



ప్రజాభూమి - బుట్టాయగూడెం

రాష్ట్రస్థాయిలోనే అత్యధిక షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికైె విద్యా రోహిణి స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణ తెలిపారు. ఏలూరులో సోమవారం జరిగిన షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ కార్యక్రమంలో విద్యా రోహిణి డిజిటల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రంలోనే అత్యధిక షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్న సందర్భంగా వారిని విద్యా రోహిణి డిజిటల్ స్కూల్ ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణ అభినందించారు. విద్యా రోహిణి డిజిటల్ స్కూల్ విద్యార్థులు తన్నేరు జాహ్నవి, ముష్టిన సలోమి, షేక్ సుహానా, సాయన దీప్తి శ్రీలక్ష్మి, జుజ్జవరపు సాయినాథ్ షైనింగ్ స్టార్స్ ప్రతిభ అవార్డులు పొందారని, ఈ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అవార్డులు అందించారని రామకృష్ణ తెలిపారు. ఇప్పటివరకు విద్యా రోహిణి పాఠశాల ద్వారా 25 మంది విద్యార్థులు ప్రతిభ షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికైనట్లు చెప్పారు.

## షైనింగు స్టార్స్ విద్యార్థులకు స్వయంగా భోజనాలు వడ్డించి, సహపంక్తి భోజనం చేసిన కలెక్టరు కె, వైట్రీ సెల్వి



ప్రజాభూమి ప్రతినిధి - పెదపాడు

పెదపాడు మండలం వట్లూరు సి.ఆర్.రెడ్డి ఆడిటోరియంలో సోమవారం షైనింగు స్టార్స్ కార్యక్రమం అనంతరం అద్భుతమైన ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు స్వయంగా భోజనాలు వడ్డించి, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులతో మమేకమై విద్యాభ్యాసం, లక్ష్యాలు, భవిషత్తు కార్యాచరణ గురించి జిల్లా కలెక్టరు ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ కలలు కనండి, నిజం చేసుకోవడానికి శక్తివంచన లేకుండా కృషిచెయ్యాలని అన్నారు. దేశభవిష్యత్తు యువత చేతిలో ఉందని గ్రహించి ముందుకు అడుగులు వెయ్యాలని అన్నారు. యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో, పట్టుదలతో విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యతో పాటు నైపుణ్యాలు అభివృద్ధి, మంచి విలువలు, సంస్కృతి సంప్రదాయాలు, పెద్దలంటే గౌరవం, సమయపాలన అలవర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చునని హితబోధ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న విద్యాఅవకాశాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని తమకలలను సాకారం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు విజయమే జిల్లా అభివృద్ధికి, రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకట లక్ష్మమ్మ, డిఐవో కె.యోహాను, పరీక్షలు నిర్వహణ సహాయ కమీషనరు ఆర్.ఆశ, తహశీల్దారు ఏ.కృష్ణజ్యోతి విద్యార్థులు పాల్గొన్నారు.

## అత్తులూరి సర్వేశ్వరరావుని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాభూమి ప్రతినిధి - ఏలూరు జిల్లా

సిపిఐ మాజీఎమ్మెల్యే, ఎఐటియుసి నాయకులు అత్తులూరి సర్వేశ్వరరావు ఆశయాలను, ఆదర్శాలను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు ఎఐటియుసి నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వై.ఎం.హెచ్.ఏ సెంటర్లో ఉన్న అత్తులూరి సర్వేశ్వరరావు స్మారక స్తూపం వద్ద సర్వేశ్వరరావు 44 వర్ధంతి కార్యక్రమాన్ని ఏఐటి యుసి అనుబంధ ఏలూరు పట్టణ టూబాకో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిపారు. ఈ సందర్భంగా ఏఐటియుసి పతాకాన్ని బండి వెంకటేశ్వరరావు ఆవిష్కరించగా, సర్వేశ్వరరావు స్మారక స్థూపానికి టూబాకో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బరగడ పోతురాజు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు మాట్లాడుతూ సర్వేశ్వరరావు ఏలూరు సత్యనారాయణపేట కౌన్సిలర్గా, ఏలూరు ఎమ్మెల్యేగా ఏలూరు పట్టణ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని వారు తెలిపారు. వీరమాచినేని విమలాదేవి సిపిఐ ఏలూరు ఎంపీగా, సర్వేశ్వర రావు ఎమ్మెల్యేగా ఏలూరు జూట్ మిల్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణము, తమ్మిలేరు నుండి ఏలూరు ప్రజలకు వరద నివారణకు ఏటిగట్టు పటిష్టతకు విశేష కృషి చేశారని వారు పేర్కొన్నారు. అత్తులూరి సర్వేశ్వరరావు ఏలూరు పట్టణంలో టూబాకో వర్కర్స్ యూనియన్, జట్లు- లాగుడు బండ్ల కార్మిక సంఘంతో పాటు అనేక కార్మిక సంఘాలను నిర్మాణం చేసి వారి హక్కుల కోసం ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశారని వారు గుర్తు చేశారు. సర్వేశ్వరరావు పోరాట స్ఫూర్తిని నేటి కార్మిక వర్గం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు ఆదర్శంగా తీసుకోవాలని వెంకటేశ్వరరావు, కన్నబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టూబాకో వర్కర్స్ యూనియన్ నాయకులు చింతా సాంబశివరావు, పసుపులేటి బాపి రాజు, తలపంటి రావు, గంగరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలు చదువులు బడి - బ్రతుకులను మార్చే దేవాలయం

**సి.ఆర్.రెడ్డి ఇంజనీరింగు కాలేజీ ఆడిటోరియం జ్యోతి ప్రజ్వలన చేసి షైనింగు స్టార్స్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి**



ప్రజాభూమి ప్రతినిధి - పెదపాడు

విద్యారంగంలో ఏలూరు జిల్లాను ఆదర్శవంతమైన జిల్లాగా నిలిచేలా సమిష్టిగా కృషిచేద్దామని, అందుకు అనుగుణంగా కలసికట్టుగా పనిచేద్దామని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. సోమవారం పెదపాడు మండలం వట్లూరులోని సర్.సి.ఆర్. రెడ్డి ఇంజనీరింగు కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన షైనింగు స్టార్ కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి, లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా కలెక్టరుతో పాటు ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), దెందులూరు మండలం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షైనింగు స్టార్ కార్యక్రమం ద్వారా ఏలూరు జిల్లాలోని ఉన్నత పాఠశాలలు 2025-26 సంవత్సరానికి పదవతరగతిలో అద్భుతమైన ఫలితాలు సాధించిన 187 మంది విద్యార్థులకు రూ 37,40 లక్షలు, ఇంటర్మీడియట్ 35 మంది విద్యార్థులకు రూ 7 లక్షలు రూపాయలు రెండు నమూనా చెక్కులను అందజేశారు. పదవరగతి 187 మంది విద్యార్థిని, విద్యార్థులకు, ఇంటర్మీడియట్ 35 మంది విద్యార్థిని, విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ 20 వేలు చొప్పున చెక్కులను, ప్రశంసాపత్రాలను, మెడల్సును అందించి, ఘనంగా సత్కరించారు. షైనింగు స్టార్సు విద్యార్థిని, విద్యార్థులు తమ విజయగాథలను వివరించి, తమ భవిష్యత్తు కార్యాచరణను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ విద్యార్థులను బతుకులు మార్చే బడి దేవాలయం అన్నారు. వంద రోజులు యాక్షన్ ప్లాను సమర్థవంతంగా అమలు చేసి, ఉత్తీర్ణ శాతాన్ని పెంచిన విద్యాశాఖ అధికారులు, ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులను, విద్యార్థులను ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు అభినందించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు సైనింగు స్టార్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సన్మానించుకునుట విద్యలో పోటీతత్వం, చదువుకోవటానికి మరింత ప్రోత్సాహకరంగా, స్ఫూర్తిదాయకంగా ఉంటుందని అన్నారు. అభివృద్ధికి విద్యఒక్కటే రాజమార్గమని ఒక మంచి ఆయుధమని అన్నారు. డొక్కా సీతమ్మ పేరున మధ్యాహ్నం భోజనం పథకం ద్వారా మంచి పౌష్టికాహారం అందిస్తున్నామని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ పేరున విద్యార్థులకు పుస్తకాలు తదితర కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. విద్యకు రాష్ట్ర ప్రభుత్వం మంచి అవకాశాలు కల్పిస్తున్నాయని, ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని అన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ రాష్ట్రం లోటు బడ్జెట్ ఉన్నను, అభివృద్ధి, సంక్షేమంతో పాటు విద్యారంగంలో పెను మార్పులు తీసుకువచ్చిన ఘనత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్కు దక్కుతుందని అన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం ప్రవేశపెట్టడం, కూటమి ప్రభుత్వానికే సాధ్యం అయ్యిందని అన్నారు. నిరుపేద, మధ్యతరగతి వర్గాలు విద్యార్థులకు పౌష్టిక ఆహారం వారు చదువుకు ఎంతో దోహద పడుతుందన్నారు.షైనింగు, రైజింగు స్టార్స్ కార్యక్రమాలు కూటమి ప్రభుత్వానికే సాధ్యం అన్నారు. మేము చదువుకున్న రోజుల్లో ఇటువంటి అవకాశాలు లేవని, ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదివి, మంచి స్థాయికి ఎదగాలని కోరారు. ప్రతి సంవత్సరం విద్యాప్రగతి శాతం పెంచుకుంటూ ఉన్నత విద్యను అభ్యసించి, ఐఏఎస్, ఐపియస్, ఉన్నత చదువులు చదివి, ఉన్నత స్థానాలకు ఏదిగి దేశానికి, రాష్ట్రానికి మంచి సేవలు అందించాలన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్య, వైద్యానికి ఎంతో ప్రాధాన్యత నిస్తున్నదన్నారు. ప్రభుత్వం మీద నమ్మకంతో పాఠశాలకు తమ పిల్లలను పంపించిన తల్లి,తండ్రులకు అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలతో పాటు విద్యావ్యవస్థను సర్వనాశనం చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూసి ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజలు నమ్మేస్థితిలో లేరని, కేవలం వారి ఉనికి కోసమే నానాపాట్లు పడుతున్నారని అన్నారు. అమ్మఒడి అని ఇంటికి ఒక్కరికే అని, అదికూడా కొంతమందికే ఇచ్చారని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోయినా తల్లికి వందనం క్రింద ఈ నెల 22 వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా 64,76,590 మంది విద్యార్థులకు రూ 15 వేలు చొప్పున రూ 10,120,78 కోట్ల రూపాయలు ప్రతి విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నామని తెలిపారు. డిఎస్సీ ద్వారా 16,350 ఉపాధ్యాయ పోస్టులను నియమించి, విద్యఒక్కటే అభివృద్ధికి మూలం అని గుర్తించింది కూటమి ప్రభుత్వం మేనని అన్నారు. చదువుకుంటేనే మంచి భవిషత్తు ఉంటుందని, ఆస్థివలన మనకు పేరు ప్రఖ్యాతలు రావని, చదువు ద్వారానే ఇది సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, డిఐవో కె.యోహాను, పరీక్షలు నిర్వహణ సహాయ కమీషనరు ఆర్.ఆశ, తహశీల్దారు ఏ.కృష్ణజ్యోతి, విద్యాశాఖ అధికారులు, వివిధ కళాశాలలు ప్రిన్సిపాల్సు, ఉన్నత పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు వారికుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## బదిలీ అయిన అధ్యాపకులకు ఘనంగా సత్కారం



ప్రజాభూమి - బుట్టాయిగూడెం

బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి ఇటీవల బదిలీలపై ఇతర కళాశాలలకు వెళ్లిన అధ్యాపకులు మద్రి వెంకటేశ్వర రావు, డా. సునీతను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. డిగ్రీ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. మణేంద్రరావు మాట్లాడుతూ బదిలీ అయిన అధ్యాపకుల సేవలను కొనియాడారు. బదిలీ అయిన సీనియర్ అధ్యాపకులు మద్రి వెంకటేశ్వర రావు, డా. సునీత కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన అధ్యాపకులు బదిలీ అయిన అధ్యాపకుల సేవలని కొనియాడారు. కార్యక్రమంలో చివరిగా బదిలీ అయిన అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. సాకే అక్కులన్న, తెలుగు అధ్యాపకులు డా. శ్రీనివాస్, హిస్టరీ అధ్యాపకులు శ్రీనివాస్, ఆంగ్ల అధ్యాపకులు మల్లేశ్వర రావు, కామర్స్ అధ్యాపకులు డా. శాంతి బాబు, పాలిటిక్స్ అధ్యాపకులు శ్రీను, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**ఎస్ ఎఫ్ ఐ ధర్నా**




ప్రజాభూమి - బుట్టాయిగూడెం

నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) బుట్టాయిగూడెం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుట్టాయిగూడెం మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా, ఢిల్లీలో తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్య దేశంలో విద్యార్థుల గొంతును అణచివేసే చర్యలను వెంటనే నిలిపివేయాలని, విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సతీష్, అమూల్య మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను సహించబోమని హెచ్చరించారు. నీట్ పేపర్ లీకేజ్ ఘటనపై పారదర్శక దర్యాప్తు జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం పార్టీ ధర్నా



ప్రజాభూమి - బుట్టాయగూడెం

వివిధ ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం బుట్టాయిగూడెం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ, గిరిజనుల హక్కులను పరిరక్షించే 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 30ఏళ్ళు సాగు చేసుకుంటున్న 1/70చట్టం ఎల్ టి ఆర్ సాగు భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని కోరారు.సివిల్ వివాదాల్లో పోలీసుల జోక్యాన్ని తక్షణమే నిలిపివేయాలని, చట్ట ప్రకారం సంబంధిత అధికారులు మాత్రమే చర్యలు చేపట్టాలని అన్నారు. రీ-సర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలను తప్పనిసరిగా నిర్వహించి, గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని భూ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులుపోలోజు. నాగేశ్వరావు , కారం. ముత్యాలరావు. వెట్ట. విరయ్య కోయ్యల. శ్రీను. మడకం. శ్రీదేవి.పొడియం. రాజు నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్విని మర్యాద పూర్వకంగా కలిసి జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ

ప్రజాభూమి ప్రతినిధి - పెదపాడు



పెదపాడు మండలం వట్లూరు సి.ఆర్.రెడ్డి ఇంజనీరింగు కళాశాల ఆడిటోరియంలో సోమవారం షైనింగు స్టార్సు కార్యక్రమానికి వచ్చిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్ లకు మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ పూలమొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
# జనరల్ 14
మంగళవారం 21, జూలై 2026

## ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి

ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ



**ప్రజాభూమి ప్రతినిధి - ఏలూరు జిల్లా**

ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా స్థాయీ అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టరు ఎం.జె. అభిషేక్ గౌడ నిర్వహించారు. జాయింట్ కలెక్టరుతో పాటు అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, డిఆర్వో ఎం. శ్రీదేవి, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, ఎస్సీ కార్పొరేషన్ ఈడి ఎం. ముక్కంటి లు ప్రజలు నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో పిజిఆర్ఎస్ దరఖాస్తులను తప్పనిసరిగా నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలన్నారు. అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించి, పిజిఆర్ఎస్ మరియు రెవెన్యూ క్లినిక్‌లలో అందిన అర్జీలను నిర్ణీత గడువులోపు నాణ్యమైన విధంగా పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో పరిష్కారాలు ఉండాలని, అర్జీదారులు సంతృప్తి స్థాయిని మరింత పెంచాలని అన్నారు. సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో 328 దరఖాస్తులు అందాయని జేసీ అభిషేక్ గౌడ తెలియజేసారు.

## రామచంద్రపురం డిపో మేనేజర్ భాస్కర్రావుకి ఘనసత్కారం

- రావులపాలెం మేనేజర్ కుమార్ ఇన్చార్జిగా బాధ్యతలు
- డిపో సిబ్బంది ఘనంగా వీడ్కోలు

**ప్రజాభూమి ప్రతినిధి - రామచంద్రపురం**

సుదీర్ఘ కాలం పాటు రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్ గా సేవలందించిన పేపకాయల భాస్కర్రావు పదోన్నతిపై నెల్లూరు జోనల్ వర్క్స్ మేనేజర్ వెళ్తున్న సందర్భంగా రామచంద్రపురం ఆర్టీసీ గ్యారేజ్ నందు ఆయనని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి రావులపాలెం డిపో మేనేజర్ వై వి వి ఎన్ కుమార్ హాజరై ఇన్చార్జిగా రామచంద్రపురం ఏపీఎస్ఆర్టీసీ డిపో బాధ్యత లను స్వీకరించారు. ఈ సందర్భంగా భాస్కరావు మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో రామచంద్ర పురం డిపో పరిసరాల పరిశుభ్రత మొదటి స్థానం పొందిందని అదే విధంగా ఆయిల్ పొదుపులో కూడా మంచి స్థానంలో ఉందని సర్వీసెస్ లో కూడా కార్మిక సోదరులందరూ కూడా సంతృ ప్తికరంగా చేస్తున్నారని తెలియజేశారు. అదేవిధంగా డిపోలో ఆయనకు ఉన్న అనుబంధాన్ని సందర్భంగా తెలియజేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు సిబ్బంది ఆఫీస్ సిబ్బంది రన్నింగ్ స్టాప్ తదితరులు ఆయన గురించి తాను చేస్తూ ఇతరులతో పని చేయించేవా రని చూసి యజమాని కాదు చేసే యజమానిగా డిపో ఎంతో చక్కగా అన్ని విభాగాల్లోనూ సంతృప్తికరంగా చేశారని కొని ఆడారు. రామచంద్రపురం డిపో అన్ని విభాగాల ఉద్యోగస్తులు సాదరంగా భాస్కరరావుకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డిపో ఉన్నత స్థితికి మేనేజర్ భాస్కర రావు ముఖ్య పాత్ర పోషించారని ఈసందర్భంగా కొనియాడారు.

## ఇసుక అక్రమ రవాణా పై ఎస్ఐ సతీష్ ఉక్కుపాదం



**ప్రజాభూమి ప్రతినిధి - చింతలపూడి**

అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీని చింతలపూడి ఎస్సై సతీష్ తన సిబ్బందితో కలిసి రేచర్ల సమీపంలో స్వాధీనం చేసుకున్నారు. 28 టన్నులు ఉండాల్సిన ఇసుక లోడు అదనం గా 15 టన్నులు ఎక్కువ వేసి మొత్తం 43 టన్నులు లోడ్ తో వెళ్తుండడంతో చింతలపూడి పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఇసుక లారీని చింతలపూడి పోలీస్ స్టేషన్కు తరలించి ఈ లారీని రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కు అప్పగించనున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ హెచ్చరించారు.

## ఘనంగా తెలుగు యువత మండల అధ్యక్షుడు పుత్తా సుధీర్ జన్మదిన వేడుకలు



**ప్రజాభూమి - సిద్ధవటం**

సిద్ధవటం మండల తెలుగు యువత అధ్యక్షుడు పుత్తా సుధీర్ రాయల్ జన్మదిన వేడుకలను సోమవారం మండలంలోని మాధవరం-1 గ్రామంలో తెలుగు తమ్ముళ్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సుధీర్ రాయల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్, టీడీపీ యువ నాయకులు ఆడిటర్ శివానంద, జింకా శ్రీనివాసులు, జానపాటి సుబ్బరాయుడు, దుర్గం మౌలాలి తదితరులు పాల్గొన్నారు. సుధీర్ రాయల్ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని, ఆయురారోగ్యాలతో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం పరస్పరం మిఠాయిలు పంచుకుని శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఒక రోజు చేపలు పట్టుకునేందుకు రికార్డు స్థాయిలో పెరిగిన ఆదాయం

- అధికారులు ఆశ్చర్యపరిచిన బహిరంగ వేలం
- పాట 7 లక్షల 11 వేలు,జీఎస్టీ తో 8 లక్షల 40, వేలు
- ప్రభుత్వానికి నాలుగు రెట్లు పెరిగిన ఆదాయం
- కంగుతున్న ఆశావాహులు ఆశావాహులు అంచనాలు తల్లకిందులు
- హెచ్చు పాట ద్వారా జన సైనికుడు జగదీష్ కైవసం
- అజ్ఞాత వ్యక్తి ప్రోద్బలంతో పెరిగిన ఆదాయం

**ప్రజాభూమి ప్రతినిధి - కాజులూరు**

గొల్లపాలెం గ్రామంలో గల సిపిడబ్ల్యూఎస్ సమ్మర్ స్టోరేజీ చెరువు నందు సహజ సిద్ధంగా పెరిగిన మత్స్య సంపదను పట్టు కొనేందుకు ఎట్టకేలకు అధికారులు బహిరంగ వేలం నిర్వహించడంతో రికార్డ్ స్థాయిలో ఆదాయం పెరగడంతో పాట నిర్వహించిన అధికారులను సైతం ఆశ్చర్యపరిచింది. దీంతో గత పదవతే దిన జరగాల్సిన ఈ బహిరంగ వేలం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్న నేపథ్యంలో వాయిదా వేసిన సంగతి పాఠకులకు తెలిసిందే. సోమవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో జే. రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ వేలంలో 16 మంది నిబంధనల మేరకు డిపాజిట్లు కట్టి వేలం పాటలో పాల్గొన్నారు. వాస్తవానికి 11 గంటలకు మొదలు పెట్టాల్సిన బహిరంగ వేలం 12 గంటలకు తర్వాత ఎట్టకేలకు ప్రారంభమైయ్యింది. దీంతో జిల్లాపరిషత్ రెవెన్యూ అధికారి కనికెళ్ల శ్రీనివాస సమక్షంలో ప్రారంభమైన బహిరంగ వేలానికి మంచి స్పందన లభించి ప్రభుత్వానికి రికార్డు స్థాయిలో ఆదాయం చేకూరింది. తొలుత 90 వేల రూపాయలతో ప్రారంభమైన పాట లక్షా తొమ్మిది వేల రూపాయలకు ఆర్యావటం గ్రామానికి చెందిన వీరవల్లి గణపతి నుండి మొదలుకొని పలువురు దఫా దఫాలుగా పాటను పెంచుకుంటూ పోగా ఇదే వీరవల్లి గణపతి 7 లక్షల 9వేలరూపాయల వరకూ వెళ్ళడంతో పాటలో పాల్గొన్న వారికే వంకింత ఆశ్చర్యాన్ని గురిచేసింది అలాగే అధికారులు సైతం నిశ్చేయలను చేసింది.అయితే అక్కడతో పాట ఆగకుండా మండల కేంద్రమైన కాజులూరు గ్రామానికి చెందిన జనసేన సైనికుడు సాదా జగదీష్ మరో రెండు వేల రూపాయలు పెంచడంతో 7 లక్షల 11 వేల రూపాయలు హెచ్చు పాట దారుడైన జన సైనికుడు జగదీష్ కైవసం చేసుకున్నారు. దీంతో హెచ్చుపాట దారుడైన



జగదీష్ కి అధికారులు ఈబహిరంగ వేలం ద్వారా గొల్లపాలెంలో గల సిపిడబ్ల్యూఎస్ స్కీముకి సంబంధించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నందు ఒకరోజు సహసిద్ధంగా పెరిగిన చేపలను పట్టుకుని అమ్ముకునేందుకు అనుమతు లభించింది.

**ఆశావాహుల అంచనాలు తల్లకిందులు, నాలుగు రెట్లు పెరిగిన ఆదాయం**

దీంతో గత పది రోజుల నుండి ఎలాగైనా ఈ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో చేపలను పట్టుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేసిన ఆశావాహులు అంచనాలు తలకిందులయ్యాయి. ముఖ్యంగా ఎవరు ఊహించని విధంగా రికార్డ్ స్థాయిలో జిఎస్టితో కలిపి 8, లక్షల 39 వేల రూపాయలకు వెళ్లడంతో గతంలో మునుపేన్నడు లేని విధంగా ఈ బహిరంగ వేలం ద్వారా ప్రభుత్వాని ఆదాయం పెరగడం అధికారుల సైతం ఆశ్చర్యానికి గురి చేసింది. కాగా సుమారు 16 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సిపిడబ్ల్యూఎస్ స్కీముకి సంబంధించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో సాహసిద్ధంగా పెరిగిన చేపలు పట్టుకునేందుకు మునుపెన్నడు లక్షా 85 వేల రూపాయలకు మించని ఆదాయం ఒక్కసారిగా నాలుగు రెట్లు పెరగడంతో అధికారుల సైతం ఆశ్చర్యాన్ని గురి చేయడంతో పాటు విషయం తెలిసిన మండల ప్రజల సైతం ఒకరోజు పాటకే ఇంత హెచ్చు పాటా అంటూ ఆశ్చర్యానికి గురవుతున్నారు. అయితే ఇక్కడ ఈ స్టోరేజీ ట్యాంకులో కేవలం సహజ సిద్ధంగానే కాకుండా సంబంధిత స్టోరేజీ ట్యాంకు మెయింటినెన్స్ కాంట్రాక్టర్ ట్యాంకులో నాచు, గడ్డి తినేందుకు చెరువు అప్పట్లో కొన్ని చేపలను వేయడం,ఇదే అదునుగా అజ్ఞాత వ్యక్తులు రాత్రి వేళల్లో చేపలను వేసిన సందర్భాలను దృష్టిలో పెట్టుకుని హెచ్చు పాటకు జగదీష్ పాడినట్లు సమాచారం.

**అజ్ఞాత వ్యక్తి ప్రోద్బలంతోనే హెచ్చు పాట**

మండలానికి చెందిన ఒక అజ్ఞాత వ్యక్తీ ప్రోద్బలంతో ఇచ్చిన భరోసాతోనే ఒక్కసారిగా మునిపెన్నడూ లేని విధంగా నాలుగు రెట్లు పెంచి మరి హెచ్చు పాట ద్వారా కాజులూరు చెందిన జన సైనికుడు జగదీష్ కైవసం చేసుకుని జన సేన ఖాతాలో వేసారని సమాచారం.కాగా ఏది ఏమైనా ఇక్కడ అనధికారకంగా అజ్ఞాత వ్యక్తులు రాత్రి వేళల్లో వేసిన చేపలు తమకు దక్కకుండా పోతున్నాయన్న ఆలోచన అయితే మాత్రం సోమవారం జరిగిన బహిరంగ వేలంలో స్పష్టంగా కనిపించింది. అర్యావటం ,గొల్లపాలెం, గ్రామాలకి చెందిన వ్యక్తులు ఎక్కువ మంది వ్యక్తులు ఈ బహిరంగ వేలంలో పాల్గొన్నప్పటికీ కాజులూరు గ్రామానికి చెందిన ఒకే ఒక వ్యక్తి జగదీష్ పాల్గొని హెచ్చు పాటతో బహిరంగ వేలం ద్వారా కైవసం చేసుకున్నారు. ఈవిషయంలో ఇప్పటివరకు పైరవీలు చేసిన వ్యక్తులు సైతం కంగుతి న్నారు. ఈ బహిరంగ వేలంలో జిల్లా పరిషత్ ఆర్వో కనికెళ్ళ శ్రీనివాసు, ఎంపీడీవో జె. రాం బాబు, డిప్యూటీ ఎంపీడీవో ముద్రగడ సత్యనా రాయణ మూర్తి (చంటి), ఏ వో పద్మలత, గొల్లపాలెం పంచాయతీ కార్యదర్శి సిహెచ్ సూర్య ప్రకాష్, వీరవల్లి గణపతి, కోటిపల్లి నాగేశ్వరరావు, మాతా నాగరాజు, బి నాగమల్లే శ్వరరావు, పలివెల సూరిబాబు, అంగర శ్రీనివాసరావు, తాడి మాచారెడ్డి, జి. వెంకటేశ్వర రావు, కట్టా శ్రీను, శేరు అప్పారావు, ధర్మాడి చినబాబు, ధర్మాడి కామరాజు, గంధం రాంబాబు, కోట పద్మావతి, ధర్మాడి లక్ష్మి తది తరులు పాల్గొన్నారు.



## ప్రజల సమస్యలను త్వరితగతిన, పారదర్శకంగా పరిష్కరించడమే మా లక్ష్యం

ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్



**ప్రజాభూమి ప్రతినిధి - ఏలూరు జిల్లా**

ప్రజల సమస్యలను వేగంగా, నిష్పక్షపాతంగా పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ, అదనపు ఎస్పీ అడ్మిన్ వై. ప్రసాద్ రావతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులను నేరుగా కలుసుకుని వారి అర్జీలను స్వీకరించారు. అధికారులు ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా విని, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పూర్తిగా పేపర్‌లెస్ విధానంలో, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ పారదర్శకమైన ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా నిర్వహించారు. ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 69 ఫిర్యాదులు అందాయి. వీటిలో ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ తగాదాలు, ఆర్థిక మోసాలు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. ప్రతి ఫిర్యాదుపై చట్టప్రకారం నిష్పక్షపాత విచారణ చేపట్టి, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ గారు సంబంధిత పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. విచారణ నివేదికలను నిర్ణీత గడువులో సమర్పించాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం ఎస్పీ సూచ నలు దూర ప్రాంతాల నుంచి ప్రజలు జిల్లా పోలీసు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా, తమ సమీపంలోని సబ్-డివిజన్ లేదా సర్కిల్ కార్యాలయాల్లోనే ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని ఎస్పీ తెలిపారు.అలాగే ఇంటర్నెట్ సదుపాయం ఉన్నవారు "మీకోసం" పోర్టల్ ద్వారా తమ ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు.

## సాగునీటి కోసం రైతుల ఆందోళన.. ప్రభుత్వం స్పందించకపోతే ధర్నా

వై ఎస్ ఆర్ సీపీ నాయకుల డిమాండ్

**ప్రజాభూమి - లింగాల**

మండలంలోని రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని లింగాల కుడి కాలువకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పీబీసీ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహిస్తామని వైఎస్సార్సీపీ నాయకులు హెచ్చరించారు. మండల పరిధిలోని పెద్దకూడాల సమీపంలోని లింగాల కుడి కాలువ వద్ద రైతులతో కలిసి సోమవారం నాడు వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ బాబు రెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత 14 రోజులుగా లింగాల కుడి కాలువకు సాగునీరు విడుదల చేయకపోవ డంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ బోర్లలో నీటి మట్టం అడుగంటి పోయిందని, తక్షణమే కాలువలకు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజులలోగా నీటిని విడుదల చేయకపోతే రైతులతో కలిసి పీబీసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పులివెందుల వైఎస్సార్సీపీ రైతు విభాగం అధ్యక్షుడు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక రైతులు ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇలాంటి సమయంలో కాలువల మరమ్మతులు పేరుతో సాగునీటిని నిలిపివేయడంవల్ల కాలువలు పూర్తిగా ఎండిపోయాయని, పంటలు ప్రమా దంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని, లేనిపక్షంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి నాయక త్వంలో మండల రైతులు, ప్రజల తో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.వైఎస్సార్సీపీ నాయకుడు మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ, రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే కాలువలకు సాగునీరు విడుదల చేయాలని, లేకపోతే రైతులతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్ర మంలో నాగేంద్రరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, లింగాల యువనాయకుడు అలవాలపాటి విజయ కుమార్ రెడ్డి పలువురు రైతులు పాల్గొన్నారు.

## ప్రాథమిక వైద్యశాలలో నాణ్యతా ప్రమాణాలపై శిక్షణ

**ప్రజాభూమి ప్రతినిధి - ఆగిరిపల్లి**

ఆగిరిపల్లి ప్రాథమిక వైద్యశాలలో జాతీయ నాణ్యతా భరోసా ప్రమాణాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి వచ్చిన వరప్రసాద్ నేతృత్వంలో నిర్వహించిన ఈ శిక్షణలో ఆసుపత్రి సేవలను మరింత నాణ్యంగా, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధానాలపై అవగాహన కల్పిం చారు. రోగులకు అందించే సేవల్లో నాణ్యత, పరిశుభ్రత, రికార్డుల నిర్వ హణ, సేవల ప్రమాణాలు, సిబ్బంది బాధ్యతలు తదితర అంశా లను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు టీనా, మహిత, మధ్య స్థాయి వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## డి ఈ మెహర్ బాబాకు మంత్రి నిమ్మల అభినందనలు

**ప్రజాభూమి ప్రతినిధి - పాలకొల్లు**



పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పి ఐ యు సబ్ డివిజన్ కు రెగ్యులర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పదోన్నతి పొందిన యర్రా మెహర్ బాబా రాష్ట్ర జలవనుర్ల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంతవరకు డి ఈ మెహర్ బాబా ఇదే కార్యాలయంలో ఏఈగా, ఆ తర్వాత ఎఫ్ఎసి డి ఈ గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల రెగ్యులర్ డి ఈ గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల డి ఈ మెహర్ బాబాకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మలకు డి ఈ మెహర్ బాబా కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు కార్యాలయం సిబ్బంది కూడా మెహర్ బాబాకు అభినందనలు తెలిపారు.

## వైభవంగా లక్ష్మీనరసింహస్వామి శాంతి కళ్యాణం



**ప్రజాభూమి ప్రతినిధి - ఆగిరిపల్లి**

ఆగిరిపల్లి శోభనాచల గట్టుపై వెలసిన శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనంతో ప్రారంభమైన ఉత్సవాల్లో వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి శాస్త్రోక్తంగా శాంతి కళ్యాణం, అనంతరం నారసింహ సుదర్శన హోమం నిర్వహించారు. ఉభయదాతలు పి. నాగరాజు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సిహెచ్ సాయి తెలిపారు.

## ట్రాఫిక్ ఎస్ఐ గంగాధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంట్రాక్టర్ కులశేఖర్ రెడ్డి



**ప్రజాభూమి - పులివెందుల**

పులివెందుల ట్రాఫిక్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన గంగాధర్‌రెడ్డిని సోమవారం కాంట్రాక్టర్ కులశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి దుశాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందులలో ట్రాఫిక్ సమస్య అస్తవ్యస్తంగా ఉందని వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయనను కోరారు. ఇందుకు ఎస్ఐ స్పందిస్తూ ఇప్పటికే ప్రతి ఒక్కరిని ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తా అన్నారు.